అధికార వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత అప్పుడే బయటపడింది. అందుకు ఆపార్టీ అభ్యర్థుల నామినేషన్‌ల కార్యక్రమాలే నిదర్శనం. డబ్బులు, మద్యం ఇచ్చి.. వాహనాలు పంపితే ఇలా వచ్చి అలా వెళ్లారే తప్ప నాయకుల కోసం వేచి ఉండ లేదు. దీంతో ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలు సైతం వెలవెలబోయాయి. సోమవారం కొండపి, ఒంగోలు, మార్కాపురంలలో ఆదిమూలపు, బాలినేని, అన్నా రాంబాబు కార్యక్రమాలను పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతోంది. వారు నామినేషన్ల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలు బోసిపోవడంతో వైసీపీ శ్రేణులు నీరసపడిపోయాయి. మరోవైపు టీడీపీ అభ్యర్థులు వేలాది మంది మధ్య సభల్లో ప్రసంగిస్తుంటే.. వైసీపీ వారు మాత్రం జనం లేని సభల్లో మాట్లాడలేక తూతూమంత్రంగా ముగించారు. ఒంగోలులో నామినేషన్ అనంతరం బాలినేని బయటకు వచ్చేసరికి జనం కనిపించ లేదు. దీంతో ఆయన ప్రసంగం లేకుండా మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. అయితే ఈ నామినేషన్ల సందర్భంగా భారీగా నగదు, లిక్కర్ పంపిణీతో హడావుడి చేసినా, కొండపిలో భోజనాలు పెట్టినా ఫలితం దక్కలేదు.


మంత్రి సురేష్ మాట్లాడుతుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు


ఒంగోలులో వైసీపీ ర్యాలీ మధ్యలోనే వెళ్లిపోతున్న ప్రజలు

జనం జంప్

- వైసీపీ అభ్యర్థుల నామినేషన్ సభలు వెలవెల
- వారి మాటలు వినేందుకు ఇష్టపడని ప్రజలు
- డబ్బులు ఇచ్చారు.. ఇలా వచ్చి, అలా వెళ్లారు
- మంత్రి సురేష్ అసహనం
- ఎంపీ అభ్యర్థితో సహా ముఖ్యనాయకులు డుమ్మా
- రాంబాబు కార్యక్రమానికి గిద్దలూరు వాసులు
- కౌన్సిలర్లు డబ్బులు పంచినా కదలిక కరువు
- ఒంగోలులో ర్యాలీ.. సగంలోనే శ్రేణులు మాయం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఎన్నికల సంగ్రామంలో భాగంగా ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసే కార్యక్రమం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలో టీడీపీ పక్షాన కొండపి, వైపాలెం, అద్దంకి అభ్యర్థుల నామినేషన్లు పూర్తికాగా సోమవారం దర్శి, పర్చూరు అభ్యర్థులు భారీ జనసందోహం మధ్య నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన అభ్యర్థులు రానున్న మూడు రోజుల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీలో ఇప్పటికే దర్శి, గిద్దలూరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. సోమవారం అద్దంకి అభ్యర్థి సమర్పించారు. నామినేషన్ల కార్యక్రమాల తీరుతెన్నులను పరిశీలిస్తే.. వైసీపీ అభ్యర్థులు డబ్బులతో అడపాదడపా జనాన్ని తీసుకొచ్చుకున్నా చివరివరకు ఉండి మిమ్మల్ని ఆశీర్వదించలేమన్నట్లుగా వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

మంత్రి సురేష్‌కు చుక్కెదురు

వైపాలెం నుంచి బదిలీపై కొండపి వచ్చి పోటీచేస్తూ కులరాజకీయాలకు శ్రీకారం పలికిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు సోమవారం నామినేషన్ సందర్భంగా ప్రజల నుంచి చుక్కెదురైంది. కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. మధ్యాహ్నానికే తిరిగి వెళ్లొచ్చని చెప్పి కూలి పనులకు వెళ్లిన వారికి కూలి ఇచ్చి సమీకరించేందుకు ప్రయత్నాలు చేశారు. గ్రేడింగ్ కూలీలకు రూ.200, ఇతరులకు రూ.400 ప్రకారం ఆయా ప్రాంతాలకు డబ్బులు పంపారు. మగవారికి క్వార్టరు బాటిల్, అది వద్దనుకుంటే అదనంగా రూ.150 డబ్బులు కూడా ఇచ్చారు. ఎక్కడికక్కడ వాహనాలు ఏర్పాటు చేశారు. వీటికితోడు కొండపిలో మంచి భోజనం అంటూ ప్రచారం చేశారు. సింగరాయకొండ నుంచి ర్యాలీగా వచ్చిన ఆయనకు మధ్యలో కలిసేవారు కలుస్తుంటే, ఆగిపోయేవారు ఆగిపోతూనే ఉన్నారు. తీరా నామినేషన్ వేసి సభావేదిక వద్దకు వచ్చేసరికి ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది. ఆయన ర్యాలీతో కొండపి వరకు వచ్చిన వారు మధ్యలోనే జారిపోయారు. మిగిలిన కొద్దిమంది కూడా ఏర్పాటు చేసిన భోజనం చేసి తిరిగి వెళ్లిపోయారు. మొత్తంగా ర్యాలీ నుంచి సభ వరకు ఏదిచూసినా టీడీపీ అభ్యర్థి స్వామి నామినేషన్‌కు వచ్చిన వారిలో సగం మంది కూడా లేరు. సభా వేదికను చూచిన సురేష్ అసహనానికి గురై మీడియా వారు ఏం రాసుకుంటారో రాసుకోండని దండం పెట్టి రెండు ముక్కలతో ప్రసంగాన్ని ముగించారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి వచ్చి కూడా ముఖం చూపించలేదు. డాక్టర్ వెంకయ్య, జూపూడి ప్రభాకర్‌రావు లాంటి వారు గైర్హాజరయ్యారు. వేమూరులో పోటీలో ఉన్న అశోక్‌బాబు వద్దకు ఆయన అనుచరులు వెళ్లగా కొన్ని గ్రామాల నుంచే నాయకులు రావటం కనిపించింది. గ్రామసీమలతో నిండిన నియోజకవర్గంలో కులరాజకీయాలకు శ్రీకారం పలికిన సురేష్ వైఖరితో అసంతృప్తిగా ఉన్న పలు సామాజికవర్గాల వారు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. చివరకు ఆయన ఆశించిన మాదిగ సామాజిక వర్గం వారు నామమాత్రమే.

ఒంగోలులో నీటిసరఫరా బంద్..

ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి భారీ సమీకరణ ప్రయత్నాలు జరిగాయి. డబ్బు, మద్యం పంపిణీతోపాటు నగరంలో మధ్యాహ్నం వరకూ మంచినీటి సరఫరాకు బ్రేకు వేసినా ఆశించిన ఫలితం లభించలేదు. కొన్నిప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 చొప్పున ఆయా డివిజన్ల బాధ్యులు చెల్లించి జన సమీకరణకు ప్రయత్నించారు. ఆటోలు, ఇతర వాహనాలను సమకూర్చారు. ఉదయం 10 గంటల సమయంలో ర్యాలీలో కనిపించిన ప్రజలు కలెక్టరేట్ వద్దకు వచ్చేసరికి మాయమయ్యారు. నామినేషన్ అనంతరం మాట్లాడాల్సిన బాలినేనికి ప్రజలు ఆ అవకాశం ఇవ్వలేదు. ఆయన నామినేషన్ వేసి కలెక్టరేట్ వద్ద బయటకు వచ్చేసరికి జనం వెళ్లిపోయారు. దీంతో మీడియా పాయింట్లో మాట్లాడేందుకే బాలినేని పరిమితమయ్యారు. నగరంలోని శివారు ప్రాంతాల నుంచి డబ్బులు ఇచ్చి లేక పార్టీలో ఉన్న శ్రేణులను సమీకరించడం కనిపించిందే తప్ప ఇతర వర్గాల వారి నుంచి స్పందన కరువైంది. వ్యాపార, ఉద్యోగ, హైస్థాయి, మధ్యతరగతి వారు కదలలేదు. మూడు ప్రధాన సామాజికవర్గాల వారు నివసించే ప్రాంతాల్లో సమీకరణకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయనే చెప్పవచ్చు. ర్యాలీకి వచ్చేవారికి ఇబ్బంది అవుతుందని నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉదయం 7.30కు ఇవ్వాల్సిన మంచినీటి సరఫరాను నిలిపివేసి మిట్టమధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇవ్వడం చర్చనీయాంశమైంది.

మార్కాపురంలో బహిరంగంగా డబ్బులు పంపిణీ

మార్కాపురంలో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన చివర్లో సభాకార్యక్రమం కూడా తుస్సుమంది. మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్లు, కొందరు ముఖ్యనాయకులు, ఎక్కడికక్కడ డబ్బు పంచుతూ 'బాబూ రండి, బాబూ రండి' అని తిరగడం కనిపించింది. 7వ వార్డు కౌన్సిలర్ కృష్ణ డబ్బులు పంపిణీ చేస్తూ అలా కోరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. పట్టణంలో జనసమీకరణకు రూ.500 చొప్పున చెల్లించడం విశేషం. ముందుగానే నామినేషన్ పత్రాలు ఇచ్చేందుకు రాంబాబు ఎన్నికల అధికారి వద్ద కూర్చోగా బయట ర్యాలీ నిర్వహణలో నిబంధనలకు తూట్లు పొడిచారు. పోలీసులు చేతులెత్తేసి సహకరించగా కొద్దిపాటి ర్యాలీతో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు నరకం చూశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అన్ని ప్రాంతాల్లో మైకులు ఏర్పాటుచేసినా వినేందుకు కూడా జనం బయటకు రాలేదు. కాగా గిద్దలూరు నియోజకవర్గం నుంచి రాంబాబు మద్దతుదారులు మార్కాపురం వచ్చి పాల్గొనడం, హంగామా చేయడం కనిపించింది. ఓ కల్యాణ మండపానికి ముందుగా కూలీ ఇచ్చిన మహిళలను సమీకరించి అక్కడ నుంచి తీసుకురావడం చర్చనీయాంశమైంది. నామినేషన్ అనంతరం గడియార స్తంభం సెంటర్లో జనం పెద్దగా కనిపించకపోవడంతో రాంబాబు ప్రసంగం అంతా ప్రత్యర్థి కందులపై విమర్శలు చేసేందుకే పరిమితమైంది. నియోజకవర్గంలో రాంబాబు సామాజికవర్గం ఓటర్లలో అత్యధికభాగం ఆరంభం నుంచి టీడీపీతో ఉన్నారు. కులపరంగా వారిని ఆకర్షించేందుకు రాంబాబును గిద్దలూరు నుంచి మార్చారనే ప్రచారం ఉంది. అయితే రాంబాబు కులపరమైన ప్రలోభాలు చెల్లవంటూ మాట్లాడటం ఆ పార్టీశ్రేణుల్లోనే చర్చనీయాంశంగా మారింది. ఒంగోలు నుంచి కొండపి వెళ్లకుండా నేరుగా మార్కాపురం వచ్చిన ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్ కోసం ఓట్లేయండంటూ ఏక వాఖ్యంతో దండంపెట్టి ప్రసంగం ముగించేశారు.


మార్కాపురంలో డబ్బులు పంపిణీ చేస్తున్న వైసీపీ కౌన్సిలర్ కృష్ణ

అసెంబ్లీ మారితే అవినీతి పోతుందా?

- ఏం చేశారని జగన్‌కు ఓటేస్తారు
- పీసీసీ చీఫ్ షర్మిల సూటి ప్రశ్న
- మంత్రి సురేష్, ఎమ్మెల్యే టీజేఆర్ కలెక్షన్ కింగ్‌లని విమర్శ
- ఆలోచించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి


ఎర్రగొండపాలెంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల సందర్భంగా జగనన్న వదిలిన బాణాన్ని అని చెప్పుకున్న ఆయన సోదరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి నేడు జగన్‌పై సూటి ప్రశ్నల బాణాలు వదిలారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోమవారం జిల్లాకు వచ్చిన ఆమె మాట్లాడిన ప్రతిచోటా క్లుప్తంగా సూటిగా వినేవారికి అర్థమయ్యేలా ప్రసంగించి ఆకట్టుకున్నారు. స్థానిక సమస్యలు, వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని ప్రస్తావిస్తూ జగనన్నా నీకెందుకు ఓటేయాలంటూ ప్రశ్నించారు. ఇంకా జగన్‌కు ఓటేయాలనుకుంటున్న వారు తన మాటల్లోని అక్షరసత్యాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. మంత్రి సురేష్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబుల అవినీతి వ్యవహారాలను ప్రస్తావించారు. వైపాలెంలో సురేష్ చేసిన అవినీతి కొండపి వెళ్లేసరికి నీతి అవుతుందా అంటూ వేసిన ప్రశ్న సభికులను విశేషంగా ఆకట్టుకుంది. తొలుత వైపాలెం, ఆతర్వాత చీమకుర్తి, రాత్రికి అద్దంకిలో జరిగిన రోడ్‌షోలలో పాల్గొని ప్రసంగించారు. వైపాలెం సభలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికీ ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి సురేష్ బాగా సంపాదించారంట కదా అని వ్యాఖ్యానించారు. అన్ని కమీషన్లు ఆయనవేనని.. మొత్తం దోచేశారని చెప్తున్నారు అంటూ వ్యాఖ్యానాలు చేశారు. చీమకుర్తి సభలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన కలెక్షన్ కింగ్ అంట కదా.. గ్రానైట్ క్వారీలలో కలెక్షన్‌పై కలెక్షన్ చేశారంట కదా, ఆయన అలా చేస్తుంటే చూసీచూడనట్లు వదిలేసి ఇప్పుడు అభ్యర్థిని మార్చాం, ఓట్లేయండని అడగటం ఏమి నీతి అని ప్రశ్నించారు. అవినీతిపరులను ప్రోత్సహించిన జగన్‌కు ఓటేస్తే మళ్లీ అవినీతే కదా వచ్చేదని వ్యాఖ్యానించారు. 'వెలిగొండ విషయంలో మిమ్మల్ని మోసం చేశారు, కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేట్లనే పెట్టలేక పోయారు. వైఎస్ వారసుడినని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని తుంగలో తొక్కాడు. అందుకే ఆయన్ను నమ్మి మరోసారి మోసపోకండి. ఆయన అధికారంలోకి వస్తే చెప్పింది చేయడు, అవినీతిపరులను ప్రోత్సహిస్తాడు. తల్లిని, చెల్లినే చూడని వాడు మీ బాగోగుల గురించి ఏం పట్టించుకుంటాడనేదే నా బాధ' అంటూ ఆమె ప్రజలను ఆకట్టుకునే విధంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థులు సుధాకరరెడ్డి, జేడీశీలం పాల్గొన్నారు. కాగా తన సమీప బంధువు బాలినేని పోటీచేస్తున్న ఒంగోలు నియోజకవర్గం మార్గమధ్యంలోనే ఉన్నా ఆమె ఆగకపోవటం, అద్దంకిలో ఆ నియోజకవర్గానికి చెందిన తన బాబాయ్ వైవీ సుబ్బారెడ్డికి సంబంధించి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మాట్లాడకపోవడం రాజకీయవర్గాలలో చర్చనీయాంశమైంది.


దర్శిలో నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి లక్ష్మి, పక్కన అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్

నామినేషన్ల జోరు

- ఐదో రోజు భారీగా దాఖలు
- ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు అందజేత
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది 46 సెట్లు

వివరాలు లోపలి పేజీల్లో..

బాలికలు భళా!

- పదో తరగతి ఫలితాల్లో బాలురకంటే అధిక ఉత్తీర్ణత
- రాష్ట్రంలో ఏడోస్థానంలో జిల్లా
- గత ఏడాది కంటే మెరుగు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బాలికలు మెరిశారు. బాలురకంటే పైచేయి సాధించారు. ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే జిల్లా ఏడోస్థానంలో నిలిచింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండా అందరూ పాసైనట్లు ప్రకటించారు. 2022 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2023లో 12వ స్థానానికి పడిపోయారు. ప్రస్తుతం ఏడోస్థానంలో నిలిచి పర్వాలేదనిపించారు. పదో తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 29,195 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 26,630 (91.92శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణతతో పోల్చుకుంటే ఇది సుమారు ఐదుశాతం ఎక్కువ. గత ఏడాది కేవలం 73.74శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది 18.5శాతం అధికంగా పాసయ్యారు. బాలుర కంటే బాలికలు సుమారు మూడుశాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. బాలురు 14,684 మంది పరీక్షకు హాజరు కాగా 13,208 మంది (89.95శాతం) పాసయ్యారు. బాలికలు 14,511 మంది హాజరు కాగా 13,422 మంది (92.5శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం పాసైన 26,630 మందిలో 21,316 మంది ప్రథమ శ్రేణి, 3,618 మంది ద్వితీయ శ్రేణి, 1,696 మంది తృతీయ శ్రేణిలో నిలిచారు. పాఠశాలల వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. ఉత్తమ ఫలితాలు సాధించిన స్కూళ్ల యాజమానులు బాణ సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

30 లోపు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు పాఠశాల హెచ్ఎంల ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించారు. రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థికి జవాబు పత్రాన్ని పంపుతారు.


ఒంగోలులోని ఓ పాఠశాల వద్ద ఫలితాలు చూసుకుంటున్న విద్యార్థులు

మాది అభివృద్ధి.. వారిది అరాచకం

- అందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు ఉన్నాయి
- టిడ్కో గృహాలు వదిలేసి పట్టాల పేరుతో ఆశలు
- మంచినీటి పథకాలను పూర్తి చేయలేకపోయారు
- అదేమంటే ప్రేలాపనలు.. అసత్య ఆరోపణలు
- మూడు పార్టీల కలయికతో మా బలం పెరిగింది
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'మాది అభివృద్ధి విధానం. అందుకు ఒంగోలు నియోజకవర్గంలో ప్రత్యక్ష సాక్ష్యాలు ఉన్నాయి. అధికార వైసీపీ నేతలదంతా అరాచకం. భూదందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు నిత్యకృత్యం. అందుకు రుజువులు ఉన్నాయి. ప్రగతి పనులను వదిలేసి ప్రజలను మభ్యపెట్టేందుకు వైసీపీ నాయకులు ఎన్నికలకు ముందు ప్రలోభాలకు తెరలేపారు. విజ్ఞులైన ప్రజలు పరిస్థితులను బేరీజు వేసుకొని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జేజేలు పలుకుతున్నారు' అని టీడీపీ కూటమి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్ అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలు ఎమ్మెల్యేగా తాను సాధించిన అభివృద్ధి, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఉండగా జరిగిన, జరుగుతున్న అకృత్యాలను ప్రజలందరూ గమనించారన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి ఇప్పటికీ కళ్లకు కనిపిస్తున్నదన్నారు. అందుకు మౌలిక వసతుల కల్పన, రోడ్లు, వంతెనల నిర్మాణం, రిమ్స్ వైద్యశాల అభివృద్ధి వంటి అనేక అంశాలను ఆయన ఉదహరించారు. 40ఏళ్లకు పైబడిన ఒంగోలు మునిసిపాలిటీ చరిత్రలో ఏర్పడని డంపింగ్ యార్డును గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లోనూ తాము ముందున్నామన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.1,044 కోట్లతో 14,656 టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. రూ.330 కోట్ల వ్యయంతో మంచినీటి పథకాన్ని మంజూరు చేయించానని, తొలి విడతగా అమృత పథకం కింద రూ.123కోట్లు మంజూరు చేయించి గత టీడీపీ ప్రభుత్వంలోనే పనులు ప్రారంభించామని జనార్దన్ తెలిపారు. గడిచిన ఐదేళ్లల్లో ఏం చేశారని వైసీపీ పాలకులను ప్రశ్నిస్తే.. వలంటీర్ల అంశాన్నే ప్రస్తావిస్తారు కానీ ఆగిపోయిన పింఛన్‌ల గురించి, వేలాది మందికి నిలిపివేసిన అమ్మఒడి, ఇతరత్రా పథకాల గురించి మాట్లాడరని ఎద్దేవా చేశారు. తాము 80శాతం చేసిన టిడ్కో నిర్మాణాలను ఇంతవరకూ ఎందుకు పూర్తిచేయలేకపోయారో చెప్పలేకపోయారన్నారు. తాము 90శాతం చేసిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయలేక అసత్య ప్రేలాపణలతో కాలం గడిపారని ధ్వజమెత్తారు. మంచినీటి పథకం పనులు ఎందుకు ముందుకు సాగలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇళ్ల పట్టాల అంశాన్ని గత నాలుగేళ్లుగా ఎందుకు విస్మరించారో వారే చెప్పాలన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో పేదలకు ఆశ చూపుతున్నారన్నారు. యరజర్ల వద్ద ఇళ్ల పట్టాల పేరుతో నిధులు దోచేసిన వైనాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. అనంతరం ఆప్రాంతంలోనే ఎర్రమట్టిని ఏంచేశారో అందరికీ తెలుసన్నారు. ఇక ఒంగోలు నగరంలో రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని భూదందాలు జరిగాయన్నారు. వాటిపై ఏర్పాటు చేసిన సిట్ ఎందుకు ఆగిపోయిందనే ప్రశ్నలు ప్రజల నుంచే వస్తున్నాయని చెప్పారు. సొంత పార్టీకి చెందిన ఆర్యవైశ్య యువకుడిని అతిదారుణంగా హింసించిన చరిత్ర వైసీపీ వారిదేనన్నారు. ఈ నగ్న సత్యాలను ప్రజలు గుర్తించారని.. అందుకే టీడీపీ కూటమి ప్రచారానికి, కార్యక్రమాలకు విశేష స్పందన వస్తున్నదని అభిప్రాయపడ్డారు. జనసేన, బీజేపీలతో టీడీపీ జతకట్టడంతో బలం పెరిగిందని చెప్పారు. కూటమి పార్టీల లక్ష్యం 2019 నుంచి ఆగిపోయిన అభివృద్ధిని పునఃప్రారంభించడమేనని దామచర్ల స్పష్టం చేశారు. భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళిక తన వద్ద ఉందన్నారు. కానీ ప్రత్యర్థులు చెప్పినట్లుగా రోజువారీ నీళ్లు ఇవ్వకపోతే రాజీనామా చేస్తానని, ఆ పని, ఈపని చేయకపోయినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని తాను చెప్పనన్నారు. అభివృద్ధి ఎలా సాధించుకోవాలో తనకు తెలుసన్నారు. భవిష్యత్తులో మరింత రెట్టింపు అభివృద్ధి చేసి ఒంగోలు పేరు నిలుపుతానని దామచర్ల చెప్పారు.



నిర్మలా హైస్కూలు విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : ఒంగోలులోని నిర్మలా హైస్కూలు విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. షేక్ దిల్షన్‌భాను 594, ఆళ్ళ మనోజ్ఞ 593, చెన్నుపాటి ధాత్రిచౌదరి 590 మార్కులు సాధించారు. 590కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు ముగ్గురు ఉండగా, 16 మంది విద్యార్థులు 580కిపైగా, 30 మంది 570కిపైగా, 44 మంది 560కిపైగా మార్కులు, 50మంది విద్యార్థులు 550కిపైగా, 104 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. పరీక్షకు 154 మంది హాజరు కాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం స్థానిక స్కూలులో గౌరవ సలహాదారు నల్లూరి నిర్మల హరిబాబు, స్కూలు డైరెక్టర్ నల్లూరి సురేంద్ర, ప్రిన్సిపాల్ దొడ్డాల శ్రీనివాస్, శీలం విక్టర్‌పాల్, నీలిశెట్టి పద్మజ అభినందించారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని మాంటిస్సోరి హైస్కూలు విద్యార్థులు మంచిఫలితాలు సాధించారు. కరవదికి చెందిన మన్నె జయప్రకాష్ 600కు 594 మార్కులు, పొన్నలూరు మండలం రాజోలుపాడుకు చెందిన దాసరి వెంకటేశ్వర్లు 591 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. పరీక్షకు 199 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. 51 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా, 107 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. ఈ సదర్భంగా సోమవారం స్థానిక స్కూలులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ మాంటిస్సోరి ప్రకాష్, కరస్పాండెంట్ శబరినాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్‌ప్రిన్సిపాల్ నరేష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

క్విస్ విద్యార్థుల హవా



విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని క్విస్ హైస్కూలు విద్యార్థులు హవా కొనసాగించారు. మొత్తం 52 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. కె.మహతి 592 మార్కులు సాధించారు. 34 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు పొందారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం స్థానిక స్కూలులో విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రి, డీన్ నూతలపాటి కామేశ్వరిదేవి, ప్రిన్సిపాల్ నాగరాజు అభినందించారు.

శ్రీగురుదత్తా విద్యార్థుల ప్రభంజనం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీగురుదత్తా హైస్కూలు విద్యార్థులు సంచలన ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు సమవారం తెలిపారు. కాలువ పూర్ణచంద్ర 584 మార్కులు, గడ్డం తేజశ్రీ 576, జగన్మోహన్‌రెడ్డి, ఎం. అఖిలాష్ 566 మార్కులు పొందారు. కాగా 11 మంది విద్యార్థులు 560కిపైగా, 15 మంది 550కిపైగా, 20మంది 540కిపైగా, 25మంది 530కిపైగా, 27 మంది 520కిపైగా, 32మంది 510కిపైగా మార్కులు సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ అభినందించారు.

ఆంధ్రా హైస్కూలు విద్యార్థుల విజయభేరి



కరస్పాండెంట్ శ్రీనివాసరావుకు బొకే ఇస్తున్న విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని ఆంధ్రా హైస్కూలు విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఎం.అఖిల్‌సాయి 586, ఎస్.భవ్యశ్రీ 582, టి.భవ్యశాత్విక్ 579, ఎ.దీపిక 573, బి.దేవిచరణ్, భార్గవి 572మార్కులు సాధించారు. 550కిపైగా మార్కులను 18మంది సాధించగా 500లకు పైగా మార్కులను 31మంది సాధించారు. సోమవారం స్థానిక స్కూలులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు అభినందించారు.

గౌతమ్‌మోడల్ స్కూలుకు ఉత్తమ మార్కులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని గౌతమ్ మోడల్ స్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించారు. కె.శరణ్యరెడ్డి 594 మార్కులు, ఎస్‌వీఎస్.పరిఘ్న 590 మార్కులు సాధించారు. పరీక్షకు 73 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు 590కిపైగా, 28 మంది 550కి పైగా, 58మంది 500లకు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక స్కూలులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, డీన్‌లు పి.రామారావు తదితరులు అభినందించారు.

సుబ్బయ్య హైస్కూలు విజయదుందుభి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టలో గల బీవీసుబ్బయ్య హైస్కూలు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. గుంటక సాయిసాత్విక 585, పి.భార్గవ్‌రెడ్డి 581, జీవీ.సంతోష్‌రెడ్డి 574 మార్కులు సాధించారు. 135మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 134 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 20 మంది 550కిపైగా, 500లకు పైగా మార్కులు 33మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం స్థానిక పాఠశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.కోటిలింగం, హెడ్‌మాస్టర్ వై.వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. సీహెచ్ నిహారిక 594 మార్కులు సాధించారు. 52మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిమార్కులు సాధించిన నిహారికను సోమవారం స్థానిక స్కూలులో ప్రిన్సిపాల్ భారతి బొకే ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, సమన్వయకర్త శ్రీనివాసరావు, డీన్ శేషయ్య పాల్గొన్నారు.

వీఎన్‌జీ హైస్కూల్లో 99శాతం పాస్..

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని వీఎన్‌జీ హైస్కూలుకు చెందిన విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కొల్లా మాధవరావు సోమవారం తెలిపారు. సీహెచ్.జోషిత్‌ముకుంద 584, ఎ.నితిన్‌మహేష్ 582, కె.సాయితన్మయి 580 మార్కులు సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను మాధవరావు అభినందించారు.

గౌతమ్ ఈ-టెక్నోలో నూరుశాతం ఉత్తీర్ణత

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని గౌతమ్ ఈ-టెక్నో స్కూలు విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ పి.కిషోర్‌కుమార్ సోమవారం తెలిపారు. కావూరి భవ్యశ్రీ 583, షేక్ మెహరాతస్లీమ్ 581 మార్కులు సాధించారు. 14మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించడంతో పాటు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కిషోర్‌కుమార్ అభినందించారు.

టీడీపీ కూటమి విజయానికి సహకరించండి

రేపటి నా నామినేషన్‌కు భారీగా తరలిరండి.. ● అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపు ● పలు చోట్ల ఎన్నికల ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్



26వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దామచర్ల, రియాజ్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 22: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించేందుకు శ్రేణులు సహకరించాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. ఈనెల 24వ తేదిన ఒంగోలు అసెంబ్లీకి నామినేషన్ వేస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ బుధవారం ఉదయం 8గంటలకు వల్లూరమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహించిన అనంతరం ఒంగోలు మినీ స్టేడియం వద్దకు చేరుకుని కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మినీ స్టేడియం నుంచి ప్రతి ఒక్కరూ పసుపు రంగు చొక్కాలు ధరించి ప్రకాశంభవనం వరకు ర్యాలీగా బయలుదేరాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సంక్షేమానికి కృషి

ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్లు, రిజిస్టర్ మెడికల్ ప్రాక్టిషనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దామచర్ల జనార్దన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆస్కానాలో ఆర్ఎంపీలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీల వైద్యుల సహకారం టీడీపీ కూటమికి ఎంతో అవసరమని, అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

26వ డివిజన్‌లో ప్రచారం

ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. సోమవారం నగరంలోని 26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రజలతో మాట్లాడుతూ గతంలో ప్రజలు ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. అలాగే మరోసారి టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. అంతకముందు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

స్థానిక 49వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు ఆరిగల శ్రీను, ఆరిగల ఉదయ్, నాగిశెట్టి మధు, ఎ.బాలకృష్ణ తదితరులు టీడీపీలో చేరారు. వారికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

దళితుల సంక్షేమం తెలుగుదేశంలోనే..

కొత్తపట్నం(ఒంగోలునగరం): దళితుల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం కొత్తపట్నంలో జరిగిన దళితుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయగా వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దద చేసిందన్నారు. కొత్తపట్నం మండల కార్యాలయాల ఎదురుగా నిర్మాణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది వైసీపీ వారేనని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడమే కాకుండా స్మృతి వనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గెనం సుబ్బారావు, ద్వారపాకుల శ్రీనివాసరెడ్డి, నాళం నరసమ్మ, కళ్యాణ్, దాసరి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● వైసీపీని వీడి పార్టీలోకి భారీగా చేరికలు ● విజయ్‌కుమార్ గోనుగుంటలో ఘన స్వాగతం



బీఎన్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పేర్నమిట్టవాసులు



గోనుగుంటలో పార్టీలోకి చేరిన వారితో విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 22: రాష్ట్రంలో వైసీపీ అరాచక పరిపాలనకు ముగింపు మొదలైందని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పేర్నమిట్టలో టీడీపీ నాయకుడు వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 55 కుటుంబాలు వైసీపీని వీడి బీఎన్ సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా ఎనికపాడులో వైసీపీ నుంచి టీవై.ప్రసాద్, మరో 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ బీఎన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి మేలు జరుగుతుందని తెలిపారు.

ఎం.వేములపాడులో ప్రచారం

ఎం.వేములపాడులో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. వైసీపీ నాయకులు నియంతల్లాగా మారి అందిన కాడికి దోచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు కె.శ్రీను, వి.గోవిందు, ఇ.విష్ణు, అంకారావు, మండల అధక్షుడు మద్దినేని హరిబాబు, కోటయ్య, రాఘవ, గణేష్, కోటేశ్వరరావు, శ్రీను, బుచ్చయ్య, ఎం.శ్రీనివాసరావు, ఎం.రామారావు, వి.తిరుపతిస్వామి, ఎస్.రామారావు, మండల జనసేన అధ్యక్షుడు ఫణీంద్ర, బుచ్చన్న, రంగనాయకులు, అంకారావు, కోటయ్య, గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌కు బ్రహ్మరథం

చీమకుర్తి: అన్ని వర్గాల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. గోనుగుంట గ్రామంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. గోనుగుంట సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కాగా గ్రామంలో వైసీపీని వీడిన దాదాపు 50కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పిన బీఎన్ సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ మండల ఎస్సీ సెల్ నాయకులు బండ్లా కొండలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గొట్టిపాటి రాఘవరావు, గుడిపూడి ప్రసాద్, పల్లపు శివప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, తాతినేని రాము, సర్పంచ్ సాదు మోహనరావు, వెంపరాల ఆంజనేయులు, రాంబాబు, పుట్టా బ్రహ్మయ్య, మలినేని ప్రసాద్, లోకేష్, యాదాల కోటేశ్వరరావు, దరిమడుగు నాగరాజు, శ్యామ్యుల్, మద్దిశెట్టి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మాగుంట కుటుంబంలో విషాదం

● సుబ్బరామరెడ్డి తనయుడు విజయ్‌రెడ్డి మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22: ఒంగోలు లోక్‌సభ మాజీ సభ్యుడు దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి తనయుడు విజయ్‌రెడ్డి ఆలియాస్ విజయ్‌బాబు(55) అనారోగ్యంతో మృతి చెందారు. విజయ్‌బాబు అనారోగ్యానికి గురికావడంతో నెల్లూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున విజయ్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో మాగుంట కుటుంబంలో విషాదం నెలకొంది. ఒంగోలు పార్లమెంట్‌లో మూడు దశాబ్దాలుగా మాగుంట కుటుంబం రాజకీయాల్లో ఉంది. సుబ్బరామరెడ్డి మరణాంతరం ఆయన సతీమణి మాగుంట పార్వతమ్మ ఒంగోలు ఎంపీగా పనిచేశారు. తదనంతరం సుబ్బరామరెడ్డి సోదరుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు పార్లమెంట్ సభ్యులుగా కొనసాగుతున్నారు. సోమవారం ఉదయం విజయ్‌బాబు మరణవార్త తెలిసిన వెంటనే ఒంగోలులో ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న మాగుంట కుటుంబసభ్యులు నెల్లూరు బయలుదేరి వెళ్ళారు. మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు జరగనున్నట్లు సమాచారం.

మాగుంట కార్యాలయంలో సంతాపం

విజయ్‌బాబు మృతి చెందడంతో మాగుంట అభిమానుల్లో విషాదం నెలకొంది. సోమవారం ఉదయం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో విజయ్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి చెన్నయ్య, కండే శ్రీనివాసరావు, వీరశేఖర్, రత్నరాజ్, రామారావు, కరీముల్లా, షేక్ అన్సర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెలుగు అధికారి కీచకపర్వం !

బాలికపై అత్యాచారయత్నం ● కేసు నమోదు

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 22 : వెలుగు అధికారిగా పని చేస్తూ మహిళలను వేధించడమే నిత్యకృత్యంగా మార్చుకున్న వ్యక్తిపై ఒంగోలు దిశా పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఆయన పేరు అంబేడ్కర్. ప్రస్తుతం గిద్దలూరు వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తున్నాడు. ఒంగోలు నగరం మంగమూరురోడ్డులో తాను నివాసం ఉండే అపార్ట్‌మెంటు కాపాలదారుని కుమార్తెను గత నెల రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నాడు. పదో తరగతి పరీక్షలు రాసి ఇంట్లో ఉంటున్న బాలికపై కామాంధుడు కన్నుపడింది. 20 రోజుల క్రితం ఇంట్లో అంబేడ్కర్ ఒక్కడే ఉన్న సమయంలో గిన్నెలు ఇచ్చేందుకు బాలిక అతడి ప్లాట్‌లోకి వెళ్ళింది. లోపలికి వెళ్లగానే గిన్నెలు టేబుల్ మీద పెట్టమన్న కామపిశాచి ఆమెను గట్టిగా పట్టుకునే ప్రయత్నం చేశాడు. దీంతో అక్కడ నుంచి తప్పించుకున్న బాలిక ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా నేరుగా తాను చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకు జరిగిన విషయం చెప్పింది. అప్పట్లో ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో అంబేడ్కర్‌ను మందలించారు. అయినప్పటికీ అతడి బుద్ధి మారలేదు. వారం రోజుల క్రితం అపార్టమెంట్ సెల్లార్‌లో ఉన్న వాచ్‌మన్ ఇంటికి అంబేడ్కర్ వచ్చి బాలిక ఒక్కతే ఉండగా కంప్యూటర్ కోర్స్ చేయమంటూ సలహా ఇచ్చాడు. అందుకు ఆమె సరిగా సమాధానం చెప్పలేదు. అనంతరం బాలిక ఇంట్లోకి బలవతంగా ప్రవేశించి అత్యాచారయత్నం చేయగా తప్పించుకొని బయటకు వచ్చింది. అదే సమయంలో ఎవరికైన చెబితే చంపివేస్తానని ఏపీఎం బెదిరించాడు. ఈ విషయం సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక చెప్పి తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు కోసం దిశా పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గతంలో పర్చూరులో పనిచేసే సమయంలో మహిళల పట్ల అంబేడ్కర్ అసభ్యంగా ప్రవర్తించగా అక్కడ ప్రజాప్రతినిధులు అతడిని హెచ్చరించి అక్కడ నుంచి తరిమేశారు. ఈ మేరకు గిద్దలూరు బదిలీపై వచ్చి ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో దిశ పోలీసులు విచారణ చేస్తున్నారు.

చీమకుర్తిలో 90 సవర్ల బంగారం చోరీ

చీమకుర్తి, ఏప్రిల్22 : చీమకుర్తి పట్టణం విద్యానగర్‌లో చోరీ జరిగిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. దుండగులు 90సవర్ల బంగారం, రూ.60వేల నగదును అపహరించినట్లు ప్రాథమికంగా తెలుస్తున్నది. వివరాల్లోకి వస్తే స్థానిక విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఆర్ఎల్.పురంనకు చెందిన పమిడి తిరుపాలు తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి ఆదివారం ఊరెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన అగంతుకులు ప్రధానద్వారం పగు లకొట్టి చోరీ చేసినట్లు తెలుస్తుంది. తన ఇంట్లో దొంగతనం జరిగిందని సోమవారం సా యంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసిన తిరుపాలు దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య క్లూస్‌టీంతో పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా హరిహరక్షేత్రం వార్షికోత్సవం



పూజలలో పాల్గొన్న శిద్దా రాఘవరావు

చీమకుర్తి, ఏప్రిల్22 : చీమకుర్తిలోని హరిహరక్షేత్రం 17వసంతాలు పూర్తి చేసుకొని అష్టాదశ వార్షికోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి మంగళశాసనాలతో అంకురార్పణ జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులకు ఆలయ ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి పడిపూజను అర్చకులు మురళిధరన్ నంబూద్రి పర్యవేక్షణలో జరిపారు. కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు, శిద్దా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం ప్రచారం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22 : ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోరుతూ సోమవారం తిమ్మసముద్రం దళితకాలనీలో మాజీ మంత్రి శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే బి.యామినీబాలా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌ల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో తేళ్ళ మనోజ్ కుమార్, మెట్టు సుబ్బయ్య నాయుడు, మంగమూరి మధు, ముద్దన రవి కుమార్, తేళ్ళ చింటు, కదుళ్ళ వెంకట్రాయుడు పాల్గొన్నారు.

నిడమానూరులో గంద్ర శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు అంకిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరావు, రామనాథం వెంకటేష్, గుంజి హరీష్, పైడి నాగేశ్వరరావు, రామిరెడ్డి, లక్కినబోయిన విజయ్, ఊదరగుడి శ్యాంబాబు, కొప్పోలు వీరయ్య, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

157 స్కూళ్లలో 100శాతం ఉత్తీర్ణత : డీఈవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని 157 పాఠశాలల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో సుభద్ర సోమవారం తెలిపారు. నాలుగు ఏపీ రెసిడెన్షియల్ హైస్కూళ్ళు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయని, ఈ పాఠశాలల నుంచి 204 మంది పరీక్షకు హాజరు కాగా 200 మంది ప్రథమ, నలుగురు ద్వితీయ శ్రేణిలో పాసయ్యారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 442 మందికి 341 మంది పాసై 77శాతం, బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో 200 మందికి 197 మంది పాసై 99శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 2,106 మందికి 1,654 మంది పాసై 79శాతం సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో 61 మందికి 41 మంది ఉత్తీర్ణతో 67శాతం, కేజీబీవీల్లో 1014 మందికి 930 మంది పాసై 92శాతం, మునిసిపల్ పాఠశాలల్లో 569కి 465 మంది ఉత్తీర్ణతతో 82శాతం, ఏపీ మోడల్ స్కూళ్ళలో 475కి 455 మంది పాసై 96శాతం, ప్రైవేటు పాఠశాలల్లో 10,899మందికి 10,540మంది పాసై 97శాతం, ఏపీడబ్ల్యూఆర్ఎస్‌లో 844 మందికి 806 మంది ఉత్తీర్ణతతో 95శాతం, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్‌లో 251 మందికి 219 మంది పాసై 87శాతం, జడ్పీ హైస్కూళ్ళలో 12,385 మందికి 10,778 మంది పాసై 87శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జిల్లా మొత్తం 2,565 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా 254 మంది పరీక్షలకు గైర్హాజయ్యారని వెల్లడించారు.

ఒంగోలు పార్లమెంట్‌కు ఐదు నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22: ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నామినేషన్లు అందజేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తరుపున ఒక సెట్, మాగుంట గీతాలత తరుపున మరో నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సూర్యతేజ కోట, సింగమనేని శ్రీకాంత్, బొడ్డు క్రాంతికుమార్‌లు నామినేషన్లను అందజేశారు.

ఒంగోలు అసెంబ్లీకి ఐదుగురు : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్లను దాఖలు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఒంగోలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి నామినేషన్లు స్వీకరించారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు, ఎమ్మెల్సీ పోతుల సునీత, వైసీపీ నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు బలపర్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి మరో నామినేషన్‌ను వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా చప్పిడి రవిబాబు, అక్కురాజు నిర్మల్, మక్కెన తిరుపతిస్వామిలు నామినేషన్లు దాఖలు చేశారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

మద్దిపాడు, ఏప్రిల్ 22: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం మద్దిపాడు, తెల్లబాడు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎన్నికల సంఘం కేంద్ర బలగాలను పంపిందని, ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేస్‌లో అంతర్జాతీయ బాలికాదినోత్సవం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో బార్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఎన్.ధనలక్ష్మి మహిళల హక్కులు, లింగ సమానత్వంపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థినులకు ఉపన్యాసాలు, పోస్టల్ ప్రజంటేషన్, పేపర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, వీరాంజనేయులు, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

రైజ్ కళాశాలకు జాతీయస్థాయి అవార్డులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 22 : ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూపు ఇంజనీరింగ్ కళాశాలకు వివిధ విభాగాల్లో బ్రెయిన్‌విజన్ వారు జాతీయ స్థాయిలో భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డులను అందజేసినట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపు విద్యాసంస్థకు ఉత్తమ కళాశాల అవార్డు, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావుకు భీష్మచార్య అవార్డు, రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూపు విద్యా సంస్థలకు ఉత్తమ కళాశాల అవార్డు, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యంకు భీష్మ చార్య అవార్డు ప్రదానం చేశారు. షేక్ జానకు ఉత్తమ అధ్యాపకుడి అవార్డు ఇచ్చారు. ఏఐసీటీఈవో చీఫ్ కోఆర్డినేట్ ఆఫీసర్ బుద్దా చంద్రశేఖర్, యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రసాద్‌రెడ్డిలు ఈ అవార్డులను ప్రదానం చేశారు. రైజ్ విద్యాసంస్థల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, సెక్రటరీ శిద్దా హనుమంతరావు, ట్రెజరర్ శిద్దా భరత్, ప్రవల్లిక, ప్రిన్సిపాల్, అధ్యాపకులు వారిని అభినందించారు.

సేవాదృక్పథంతో వాసవీ క్లబ్ కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 22: సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో వాసవీ క్లబ్ వివిధ కార్యక్రమాలు చేపడుతోందని క్లబ్ గవర్నర్ పేర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. ఒంగోలు పర్యటన సందర్భంగా స్థానిక అమలనాథునివారి వీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి చీర, పసుపు కుంకుమలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి సహకారంతో దాదాపు 100 మందికి ఉచిత నేత్ర వైద్య శిబిరం, తాతా బిల్డింగ్స్ ఎదురు రామమందిరానికి 50 కుర్చీలు, గోసేవ మొదలైన కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో అచ్యుత శ్రీనివాసరావు, పుల్కాణం రాజేష్ బాబు, కొణిజేటి రఘు, చంద్ర, రంగస్వామి, పబ్బిశెట్టి వినోద్, మువ్వల నాగ రాజు, స్వామి సత్యం, శ్రీదేవి, భూమా శ్రీను, క్లబ్ నగర ప్రెసిడెంట్ నల్లమల్లి బదరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరఘునాయకస్వామి గ్రామోత్సవం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22: ప్రసిద్ధిగాంచిన చదలవాడలోని శ్రీరఘునాయకస్వామి వారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా బి.నిడమానూరుకు చెందిన బొమ్మరాజు హనుమంతరావు కుమారుడు రామకోటయ్యశర్మ వ్యవహరించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి వార్లను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఒంగోలుకు చెందిన రాధాకృష్ణ కోలాట బృందంచే కోలాట ప్రదర్శన, వేటపాలెం వారిచే అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఈవో అనిల్ పర్యవేక్షించారు.

వేసవి శిక్షణలను నిలుపుదల చేయాలి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 22: రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలలో విద్యార్థులకు జరిగే వేసవి శిక్షణ తరగతులు ఈ ఏడాది నిలుపుదల చేయాలని రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం ఒంగోలులో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు శిక్షణా తరగతులకు రావటానికి ఇబ్బంది పడతారన్నారు. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో గ్రంథాలయ ఉద్యోగులకు ఎన్నికల విధులు ఉన్నాయని, అంతేకాకుండా ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువమంది గ్రంథాలయ ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయబోతున్నారని పేర్కొన్నారు. కార్యక్ర మంలో సంఘ జిల్లా అధ్యక్షులు డీవీ.సుబ్బారెడ్డి, కార్యదర్శి ఎ.ప్రసాద్, గౌరవాధ్యక్షులు జీవీ.శివారెడ్డి, ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు రామతీర్థం తిరునాళ్ల

చీమకుర్తి, ఏప్రిల్22 : రామతీర్థం గంగజాతర తిరునాళ్ల మంగళవారం జరగనుంది. ప్రతి ఏటా చైత్రశుద్ధపౌర్ణమి నాడు అత్యంత వైభవంగా గంగమ్మతల్లికి తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహిస్తారు. మొక్కుబడి పొంగళ్లను భక్తుల చెల్లిస్తారు. ఏటా భారీ స్థాయిలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి టీవీ, సినీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ ఏడాది ఎన్నికల కోడ్ ఉండటంతో పొంగళ్లు, అమ్మవారికి అభిషేకాలు మాత్రమే నిర్వహించనున్నారు.

ఆసరా కోసం ఒమ్మెవరం పొదుపు మహిళల వినతి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22 : ఒమ్మెవరంలో పొదుపు మహిళలకు రావాల్సిన ఆసరా నిధులు అందకుండా అధికారులు మోకాలడ్డుతున్నారు. గ్రామంలో వీఏవో, ఆమె కుమారులు కోట వంశీ, నితిన్‌ల సహకారంతో రూ.35 లక్షల వరకు అవినీతి జరిగిందని అధికారులే నిగ్గు తేల్చారు. అయితే సొమ్మును జనం నుంచి వసూలు చేయాలని సీసీ కవిత పొదుపు మహిళలపై ఒత్తిడి తెస్తోంది. ఆసరా సొమ్ము ప్రభుత్వం నేరుగా మహిళల ఖాతాకు జమచేస్తున్నప్పటికీ, ప్రతి మహిళ నుంచి వేలిముద్రలు(బయోమెట్రిక్) తీసుకోవాలి. అయితే ఇటీవల గ్రామానికి వచ్చిన సీసీ కవిత వేలిముద్రలు తీసుకోనని భీష్మించారు. గోల్‌మాల్‌కు గురైన సొమ్మును ఆసరా నిధుల నుంచి జమచేయాలని కోరారు. దీనికి గ్రామస్థులు అంగీకరించలేదు. ఈ అవినీతిలో నాటి ఏపీఎం రవికుమార్‌తోపాటు, ప్రస్తుత సీసీ కవిత పాత్రకూడా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై సోమవారం పొదుపు మహిళలు ఏపీఎం హనుమంతురావుకు వినతిపత్రం అందజేశారు. సీసీ కవిత బెదిరిస్తోందన్నారు. దీనిపై ఏపీఎం స్పందిస్తూ ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని చెప్పారు.


పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బొకేలు అందిస్తున్న హెచ్ఎం, గణితం ఉపాధ్యాయుడు

ఆలకూరపాడు జడ్పీ హైస్కూల్లో నూరుశాతం ఫలితాలు

టంగుటూరు, ఏప్రిల్ 22 : మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. పదవ తరగతి పరీక్షాఫలితాలు ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఉప్పిటెర్ల నాగవెంకటసాయి 583 సాధించి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రథముడుగా నిలిచాడు. చిడిపోతు అమృత 583 , పేరం యసోవ 561 మార్కులతో పాఠశాల్లో మూడవ ప్లేస్‌లో నిలిచారు. 26 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలబడగా ఇద్దరు సెకెండ్ క్లాస్ సాధించారు. థర్డ్ ప్లేస్‌లో ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు. గణితం సబ్జక్టులో ముగ్గురు విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు

ప్రథమస్థానంలో నిలిచిన శరత్ శాతవాహన విద్యాసంస్థ

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో టంగుటూరు శరత్ శాతవాహన విద్యాసంస్థ ప్రథమంగా నిలచింది. కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ప్రథమంగా విజయం సాధించిన విద్యార్థితోపాటుగా ఉత్తీర్ణత సాధించిన ఈ పాఠశాల విద్యార్థులందరినీ అభినందించారు. శాతవాహన విద్యాసంస్థలో పదవ తరగతి పరీక్షలకు హాజరైన 11మందీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఇదే పాఠశాల విద్యార్థి ఎస్. అభిరానంద్ 585 మార్కులు సాధించి మండలంలోనే ప్రథముడుగా నిలచాడు. ఎస్వీ సాయిప్రదీప్ 575, కె. హర్షవర్ధన్ 561, ఇదే పాఠశాల్లో 2, 3వ స్థానాల్లో నిలిచారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్స్ రావూరి సతీష్‌బాబు, రావూరి శ్రీకల్పన, హెచ్ఎం కసుకుర్తి శ్రీధర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.


ఊళ్లపాలెం హైస్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం డీఎస్‌కేవీ ప్రసాద్, ఉపాధ్యాయులు

ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల సత్తా

సింగరాయకొండ : పదో తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్‌లోని విద్యార్థులు సత్తా చాటారు. ఆరు హైస్కూల్స్‌లో 411 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా 344 (83.69 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఊళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కరేటి మణితేజ 585 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్‌లో టాపర్‌గా నిలిచింది. ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలలో 85 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం. హాసిని 576, జె. ఆలేఖ్య 567, డి.ఏ. పూజిత 566 మార్కులు సాధించారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 73 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 63 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థినులు ఎస్కే. అఫ్రిన్ 575, వి. కీర్తన 566, కొట్టే వెంకట ఆకాంక్ష 555 మార్కులు సాధించారు. పాతసింగరాయకొండ హైస్కూల్‌లో 15 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణులయ్యారు. కె. కిరణ్ 539, ఆర్వీ రేవతి 520 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు.

జరుగుమల్లిలో

కొండపి : మండలంలోని ఏడు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 356 మంది పరీక్షలు రాయగా సోమవారం విడుదలైన ఫలితాల్లో 345 మంది పాస్ అయ్యారని ఎంఈవో బి. నాగేంద్రవదన్ తెలిపారు. కె. బిట్రగుంట కేజీబీవీ కళాశాలలో 36 మంది పరీక్షలు రాయగా అందరూ పాస్ అయ్యారని ప్రిన్సిపాల్ ఎస్. స్రవంతి తెలిపారు.

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడండి

- ఎమ్మెల్యే స్వామి
- మండలంలో సుడిగాలి పర్యటన

మర్రిపూడి,ఏప్రిల్22: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కొండపి శాసనసభ్యుడు, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ శ్రీ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని సన్నమూరు, గంజిపాలెం, అంకేపల్లి, నిమ్మాపురం, వల్లాయపాలెం, రామాయపాలెం గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో స్వామి మాట్లాడారు. దళితులు, వెనుకబడిన వర్గాల వారిపై వైసీపీ పాలనలో దాడులు పెరిగాయని స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సానుభూతి ద్వారా గెలుపొందాలనే లక్ష్యంతో సీఎం జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని స్వామి విమర్శించారు. ప్రతిసారి చవకబారు ప్రయత్నాలు పనిచేయవని స్వామి అన్నారు. టంగుటూరు- పొదిలి రోడ్డు నుంచి సన్నమూరు వరకు తాను తారురోడ్డు వేయించానని స్వామి ఈసందర్భంగా గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క అభివృద్ధి పనైనా నియోజకవర్గంలో చేసినట్లు వైసీపీ నాయకులు నిరూపించాలని స్వామి సవాల్ విసిరారు. గంజిపాలెం, అంకేపల్లి, నిమ్మాపురం, వల్లాయపాలెం రహదారుల అభివృద్ధితోపాటు వల్లాయపాలెం, రామాయపాలెం రహదారిని శాశ్వతంగా అభివృద్ధి చేశానని అన్నారు. మండలంలో మారుమూల గ్రామమైన రామాయపాలెం ప్రజలకు మండల కేంద్రంతో అనుసంధానం ఏర్పడిందని ఆయన అన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి గెలవాలని వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని స్వామి ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న రామాయపాలెంలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు సాగబోవని స్వామి హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తనకు, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్వామి కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళలు, రైతులు, యువకులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని స్వామి వెల్లడించారు. ప్రచారం సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే స్వామికి గ్రామస్థుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు ప్రచార కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాలకు పూలతో స్వామికి స్వాగతం పలికారు.


రామాయపాలెంలో స్వామికి అపూర్వ స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్వామి

టీడీపీలోచేరికల జోరు....

ఎమ్మెల్యే స్వామి ప్రచార కార్యక్రమం సందర్భంగా సన్నమూరులో వైసీపీ సీనియర్ నాయకులు నేరెళ్ల ఏడుకొండలు టీడీపీలో చేరారు. అంకేపల్లి పంచాయతీలో వైసీపీ కీలకనేతగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ఆయనతోపాటు మంచా వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటేశ్వర్లు, దేవళ్ల బసవయ్య, బత్తుల ఏడుకొండలు, తిరుపతమ్మలతోపాటు 15 కుటుంబాలు పార్టీలో చేరారు. అంకేపల్లిలో పంగా సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, సర్సింహారెడ్డిలతోపాటు ఐదు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వల్లాయపాలెంలో వైసీపీ సీనియర్ నాయకుడు సన్నపరెడ్డి వెంకట నరసింహారెడ్డి స్వామి సమక్షంలో గ్రామంలో పార్టీలో చేరారు. 25 ఏళ్ల తర్వాత సొంతగూటికి ఆయన చేరారు.


టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నాయకుడు ఏడుకొండలు


ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా నూతన ధ్వజస్తంభ స్థాపన

సింగరాయకొండ, ఏప్రిల్ 22 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా సంప్రోక్షణ సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుణ్యాహవాచనం, అకల్మషహోమం, వాస్తు హోమం, కంకణ ధారణ, శాంతి హోమం, యంత్రస్థాపన, రత్నన్యాసం, కలశస్థాపన తదితర కార్యక్రమాలను అర్చకుల బృందం నిర్వహించింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

పొగాకు కేజీకి అత్యధిక ధర రూ.266

కొండపి, ఏప్రిల్22: కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నాణ్యమైన పొగాకు కేజీకి అత్యధిక ధర రూ. 266 లు పలికింది. ఇప్పటివరకు ఈధర ఏ వేలం కేంద్రంలో రైతులకు లభించలేదు. మండలంలోని పెరిదేపి, మిట్టపాలెం, అనకర్లపూడి రైతులు తమ బేళ్లను వేలానికి తెచ్చారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

మంత్రి సురేష్ నామినేషన్

కొండపి, ఏప్రిల్22: మంత్రి సురేష్ తన నామినేషన్‌ను సోమవారం కొండపి తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో ఎ. కుమార్‌కు అందజేశారు. రెండు సెట్ల నామినేషన్లను మంత్రి దాఖలు చేశారు. అదేవిధంగా మంత్రి కొడుకు విశాల్ కూడా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. వీరితోపాటు రాడికల్‌పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కరిస్ట్) పార్టీ తరుపున ఒకరు నాలుగు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేశారు.


ఇంటింటికీ టీడీపీలో మాట్లాడుతున్న నాయకులు

భవిష్యత్ గ్యారెంటీకే సూపర్ సిక్స్ పథకాలు

టంగుటూరు ఏప్రిల్ 22 : రానున్న తెలుగుదేశం ప్రభుత్వం భవిష్యత్ గ్యారెంటీకి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు పరచనుందని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. టంగుటూరు చెల్లెమ్మతోటలో సోమవారం ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ శంఖారావం ప్రచారం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులంతా ఇంటింటికీ తిరిగి నేడు రాష్ట్రంలో నెలకొన్ని పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రావాలన్న ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం రాగానే చేపట్టబోయే వివిధ పథకాల గురించి వివరించారు. అలాగే బీసీలకు రక్షణ చట్టం కల్పించి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్‌నేత బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు తోకల భారతి, బ్రహ్మానందం, జక్కుల శ్రీను, భానుచందర్, దయానందం, పెద్దోడు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరావు, కుందేటి వెంకట్రావు, యజమాని, మొలకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు : కలెక్టర్

టంగుటూరు, ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ ఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొందూరులో సోమవారం ఎన్నికల ప్రవర్తన నియామావళిపై జరిగిన అవగాహనా సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఓటు హక్కు ప్రాధాన్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ధైర్యంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తొలుత పోలీస్ అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీకుమార్, ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, కనిగిరి డీఎస్పీ ఆర్. రామరాజు, మండల, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

మర్రిపూడి : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. సోమవారం రాత్రి రామాయపాలెంలో ఎస్పీ గరడ్‌సుమిత్ సునీల్‌తో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల రోజు ఎలాంటి ఘర్షణ పూరిత వాతావరణం లేకుండా చూడాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.


పొందూరులో మాట్లాడుతున్న కలెక్టర్

నామినేషన్ల జోరు

ఐదో రోజు భారీగా దాఖలు

ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు అందజేత

ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది 46 సెట్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 42 మంది అభ్యర్థులు 51 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. అందులో ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లను సమర్పించారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది అభ్యర్థులు 46 సెట్లను అందజేశారు. ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తరఫున ఒక సెట్, మాగుంట గీతాలత తరఫున మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు నాలుగు సెట్లు సమర్పించారు. సంతనూతలపాడుకు ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్లను అందజేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొండపి నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు ఏడు సెట్లు సమర్పించారు. మార్కాపురం, గిద్దలూరుకు ఐదుగురేసి, కనిగిరికి ముగ్గురేసి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దర్శి నుంచి టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి లక్ష్మి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ జన జాతరలా సాగింది. ఆమె భర్త కడియాల లలిత్‌సాగర్ కూడా నామినేషన్ పత్రాలను సమర్పించారు. కనిగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి గా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

'పది' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపి, ఏప్రిల్22: మండలంలోని మొత్తం 12 ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్ల నుంచి 605 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 571మంది పాస్ కాగా, 34 మంది ఫెయిల్ అయ్యారని ఎంఈవో కె. సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. కె. ఉప్పలపాడు పాపారావు పబ్లిక్ స్కూల్‌కు చెందిన రేణుమాల రేణి అత్యధికంగా 595 మార్కులు సాధించిందని స్కూల్ యాజమాన్యం తెలిపింది.

పొన్నలూరులో... పొన్నలూరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటుస్కూళ్లలో 369 మంది పరీక్షలు రాయగా తాజాగా విడుదలైన ఫలితాల్లో 345 మంది పాసయ్యారని ఎంఈవో ఇడపలపాటి రవి తెలిపారు.


కె. బిట్రగుంట కేజీబీవీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు

పొన్నలూరు విద్యార్థికి నాల్గవ ర్యాంక్

తాజాగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పొన్నలూరుకు చెందిన ఎండ్లూరి చరణ్ రాష్ట్ర స్థాయిలో నాల్గవ ర్యాంక్ సాధించాడు.

సుబ్బరామరెడ్డి తనయునికి పోతుల నివాళి

టంగుటూరు, ఏప్రిల్ 22 : ఆకస్మాత్తుగా మృతి చెందిన స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి తనయుడు మాగుంట విజయకుమార్‌రెడ్డి పార్థీవ దేహాన్ని కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సోమవారం సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాగుంట పార్వతమ్మ, మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాగుంట రాఘవరెడ్డితోపాటుగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మాగుంటను పరామర్శిస్తున్న పోతుల



దర్శిలో లక్ష్మీ నామినేషన్‌కు హాజరైన అశేషజనవాహిని(ఇన్‌సెట్లో) అభివాదం చేస్తున్న లక్ష్మీ, వంగవీటి రాధా

దర్శి ప్రజలకు జీవితాంతం

రుణపడి ఉంటా!

- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

- అట్టహాసంగా నామినేషన్

దర్శి, ఏప్రిల్ 22 : 'మీరు చూపుతున్న ప్రేమకు దాసోహం.. మీకు జీవితాంతం రుణపడి ఉంటా.. మీ అభిమానంతో నోట మాట రావటం లేదు' అని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చలించిపోయారు. సోమవారం దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఊహించని విధంగా వేలాదిమంది పాల్గొన్నారు. అశేష జనవాహిని చూసి ఆమె ఉద్వేగానికి గురయ్యారు. ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ 'మీఇంటి ఆడపడుచుగా ఆదరిస్తున్నందుకు పాదాభివందనం.. జీవితాంతం మీకు సేవ చేసే అవకాశం ఇవ్వాల'ని కోరారు. అలాగే ఈ అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గొట్టిపాటి కుటుంబ వారసురాలిగా నిస్వార్థ సేవలందించి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని సభాముఖంగా చెప్పారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలిగా, దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్శయ్య కుమార్తెగా వారి ఆశయాలను కొనసాగిస్తూ నిజాయితీగా, నిబద్ధతతో నడుచుకుంటామని హామీ ఇచ్చారు. బాబాయి గొట్టిపాటి రవికుమార్ ఇస్తున్న ప్రోత్సాహంతో ముందుకు సాగుతామన్నారు. దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగవీటి రాధ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావాలని చెప్పారు. దర్శి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ 'మా కుటుంబ వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన మా అమ్మాయి గొట్టిపాటి లక్ష్మిని, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని' కోరారు. అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని నడిపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ దర్శిలో డాక్టర్ లక్ష్మి విజయం తథ్యమన్నారు. ర్యాలీకి అశేషంగా వేలాదిమంది ప్రజలు హాజరుకావటమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. గొట్టిపాటి కుటుంబంతో గతం నుంచి కూడా తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్పారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోరంట్ల రవికుమార్, మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, జనసేన పార్టీ మాజీ ఇన్‌చార్జ్ బొటుకు రమేష్‌బాబు, బీజేపీ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, గొట్టిపాటి భరత్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

ఏం మాయోపాయం...

బాలినేని నామినేషన్ కోసం నీటి సరఫరా బంద్



ఒంగోలు (కార్పొరేషన్) ఏప్రిల్ 22 : వైసీపీ అధికార పెత్తనం శృతి మించుతుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, మరో ఇరవై రోజుల్లో పోలింగ్ జరగనుండగా ఆ పార్టీ నేతల కనుసన్నల్లోనే పాలన నడుస్తోంది. సోమవారం ఒంగోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ దాఖలు చేయనుండగా, అందుకోసం భారీగా జనసమీకరణ చేశారు. ఆ కార్యక్రమం విజయవంతం చేయడం కోసం ప్రతి డివిజన్ నుంచి 250 మందిని జనసమీకరణ చేయగా, ఒకొక్కరికీ రూ.300 ముట్టజెప్పారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా కానుంది. ఈ కారణంగా మహిళలు నామినేషన్ కార్యక్రమానికి హాజరుకారని తెలుసుకున్న వైసీపీ నేతలు కుయుక్తి పన్ని నీటి సరఫరాను ఒకపూట బంద్ చేయించారు. కార్పొరేషన్ అధికారులు కూడా స్వామి భక్తిని ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు అతిక్రమించి మధ్యాహ్నం 12-30 వరకు నీటిని విడుదల చేయలేదు. ఆ తర్వాత నీటిని సరఫరా చేయగా, మండుటెండలో ప్రజలు తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి ఎదురైంది.

మారిన అభ్యర్థులు

ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్యాండెట్ల మార్పు

పెండింగ్‌లో కొండపి



ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 22 : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ షర్మిలారెడ్డి కనిగిరి, ఒంగోలు అభ్యర్థులను మార్పుచేసి బీఫాంలు అందజేశారు. ఒంగోలు అభ్యర్థిగా తొలుత బుట్టి రమేష్ బాబును, కనిగిరి అభ్యర్థిగా కదిరి భవానీని ప్రకటించారు. సోమవారం జిల్లాకు వచ్చిన షర్మిలా రెడ్డి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దాసరి నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి సుబ్బారెడ్డికి బీఫాంలు అందజేశారు. ఇప్పటివరకు ప్రచారం చేసుకొని నామినేషన్లు దాఖలు చేసిన రమేష్‌బాబు, భవానీలు ఆవేదనకు గురయ్యారు. అదేవిధంగా కొండపి అభ్యర్థిగా శ్రీపతి సతీష్‌ను ప్రకటించినప్పటికీ బీఫాం పెండింగ్‌లో పెట్టారు. అక్కడ కూడా అభ్యర్థిని మార్పు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అక్కడ పసుమర్తి సుధాకర్‌కు టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. జిల్లాలో అనుహ్యంగా జరిగిన మార్పులతో క్యాడర్ కాస్త డీలాపడ్డారు.

ఆనాటి ముచ్చట

అప్పట్లో ఆత్మీయ పోటీ



చప్పిడి వెంగయ్య



నాగార్జునరెడ్డి

కంభం, ఏప్రిల్ 22 : ప్రస్తుతం జరుగుతున్న శాసన సభ ఎన్నికలకు, ముప్పై ఏళ్ల క్రితం జరిగిన ఎన్నికలకు, ఇరు పార్టీల తరఫున అభ్యర్థుల ఎంపికకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. నాడు ఆయా పార్టీల అధిష్టానం అభ్యర్థుల గుణగణాలు, రాజకీయ నేపథ్యం చూసి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేవారు. ఎంత డబ్బు ఖర్చు పెడతాడని ఆలోచించేవారు కాదు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అభ్యర్థి ఎన్ని కోట్లు ఖర్చు పెడతాడు, పార్టీ ఫండ్ ఎన్ని కోట్లు ఇస్తాడన్నదే ప్రధాన అంశంగా మారింది. 1952లో కంభం నియోజకవర్గం ఏర్పడినా.. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత ప్రధానంగా కాంగ్రెస్, టీడీపీల మధ్యే పోటీ నడిచింది. 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున చప్పిడి వెంగయ్య, కాంగ్రెస్ తరఫున కందుల నాగార్జునరెడ్డి పోటీలో ఉన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలే గ్రామాల వారీగా చందాలు వసూలు చేసి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. రాజకీయంగా ప్రత్యర్థులే గాని ఇరువురూ కలుసుకుంటే కుశల ప్రశ్నలు వేసుకుని మాట్లాడుకొనే వారు. 1994 ఎన్నికల ప్రచారంలో భాగంగా కొనకనమిట్లలో ఒకరికొకరు ఎదురైనప్పుడు జరిగిన అంశాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. **టీడీపీ అభ్యర్థి చప్పిడి వెంగయ్య ఎదురు పడగానే కాంగ్రెస్ అభ్యర్థి కందుల నాగార్జునరెడ్డి 'మామా ఈ ఎన్నికల్లో నేను గెలిచేలా ఆశీర్వదించండి..' అని కోరగా 'అలాగే లేవోయ్ ప్రజలు ఎవరిని ఆశీర్వదిస్తారో వారికి గెలుపు ఖాయమని' సరదాగా మాట్లాడుకున్నారని చెబుతారు.** ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చప్పిడి వెంగయ్య విజయం సాధించారు.

ప్రజలా?....రాజకీయ కూలీలా?

నగదు, మందు, బిర్యానీ

నజరానాలతో కూలీలకు ఎర

మేస్త్రీలతో ఒప్పందాలు, పోలీసుల ఒత్తిడి

అయినా వైసీపీ ర్యాలీకి కానరాని స్పందన




ర్యాలీ ప్రారంభం కాకముందే వెనుదిరిగి వెళుతున్న మహిళలు

మార్కాపురం, ఏప్రిల్ 22 : రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం దినసరి కూలీలను రాజకీయ కూలీలుగా మారుస్తున్నారు. జిల్లాలో కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మార్కాపురం డివిజన్ ఉంది. ఇక్కడి ప్రజల అవసరాలను డబ్బున్న రాజకీయ నాయకులు గుర్తించి తమ ప్రచారానికి వినియోగించుకుంటున్నారు.

అధికార వైసీపీపై నానాటికీ తగ్గుతున్న ఆదరణను చూసి నాయకులు భయపడుతున్నారు. ఏ కార్యక్రమాలు చేసినా ప్రజల నుంచి స్పందన ఉండటం లేదు. దీంతో ప్రజల ఆర్థిక అవసరాలను అవకాశాలుగా చేసుకొని వారి కార్యక్రమాలను విజయవంతం చేసుకునేందుకు ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇందుకు మార్కాపురంలో సోమవారం వైసీపీ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు నామినేషన్ సందర్భంగా నెలకొన్న ఘటనలే మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

డబ్బు, మందు, బిర్యానీ ఏర్పాటు

వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు నామినేషన్ సందర్భంగా పట్టణంలోని కళాశాల రోడ్డులోని సెవన్ హిల్స్ లాడ్జి నుంచి కంభం కూడలి వరకూ భారీ ప్రదర్శన ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రత కారణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రారని సందేహించారు. దీంతో ప్రజలను రాజకీయ కూలీలుగా మార్చేశారు. సాధారణంగా పట్టణంలోని శివారు కాలనీలైన డ్రైవర్స్‌కాలనీ, భగత్ సింగ్ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ వంటి చోట్ల దినసరి కూలీలు నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లు, మహిళా మేస్త్రీలను సంప్రదించారు. కూలీలను ర్యాలీకి హాజరు పరిచే విధంగా ఒప్పందాలు చేసుకున్నారు. మగవారికి మందు, బిర్యానీ, ఆడవారికి రూ.300 ఇచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. మందు వద్దన్న మగవారికి రూ.200 నగదు ఇస్తారు. ఇందుకుగాను మేస్త్రీకి రూ.100 కమిషన్ ఇవ్వాలి. ఈ విధంగా పట్టణంలోని శివారు కాలనీల నుంచి సుమారు 5000 మంది రాజకీయ కూలీలను నామినేషన్ ర్యాలీకి తరలించేందుకు ప్రణాళికలు అమలులో పెట్టారు. అందులో భాగం 7వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కొత్త కృష్ణ తన వార్డులోని వారికి డబ్బులు పంచుతూ కెమెరాలకు అడ్డంగా దొరికిపోయాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది.





ఇళ్లకు వెళుతున్న వారిని ర్యాలీకి పంపుతున్న సీఐ అవుల వెంకటేశ్వర్లు

వెనుతిరిగిన కూలీలు

- విశ్వాసం ప్రదర్శించిన పోలీసులు

వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే రాజకీయ కూలీలు వెనుతిరిగారు. ఒప్పందం కుదుర్చుకున్న మేస్త్రీలు, ద్వితీయ శ్రేణి నాయకులను తిట్ల దండకంతో దీవించడం అడుగడుగునా కనబడింది. ఇళ్లకు వెనుతిరిగి వెళుతున్న కూలీలను మార్కాపురం సీఐ అవుల వెంకటేశ్వర్లు వెనక్కు పంపి ర్యాలీ విజయవంతం చేసే ప్రయత్నం చేశారు. అయితే తమకు డబ్బులు ఇవ్వకుంటే పోలీసులు చెప్పినా వినేది లేదంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. మూహుర్తం ప్రకారం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అన్నా రాంబాబు తర్వాత ర్యాలీలో పాల్గొన్నారు. అప్పటికే రాజకీయ కూలీలందరూ వెళ్లిపోయారు.

రాజకీయ చిత్ర విచిత్రాలు

వచ్చామా.. తిన్నామా.. వెళ్లామా?

- భోజనం చేసి వెనుదిరిగిన జనం
- సురేష్ సభకు ఖాళీగా కుర్చీలు
- మీడియా ఏమైనా రాసుకోండన్న సురేష్



మంత్రి సురేష్ మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం, ఖాళీగా కుర్చీలు

కొండపి, ఏప్రిల్ 22 : మంత్రి నామినేషన్ కార్యక్రమం ఉంటుందని అట్టహాసంగా ప్రచారం చేశారు. భారీగా జనం వస్తారు.. బహిరంగ సభ అదిరిపోయేలా ఉంటుందని నేతలు సంబరపడిపోయారు.. అనుకున్నట్లుగానే మంత్రి నామినేషన్ కార్యక్రమానికి వాహనాల్లో జనం చేరుకున్నారు. ఉదయం 12.30 గంటల నుంచే.. వచ్చిన వాళ్లు వచ్చినట్లు భోజనం చేసి తిరిగి వచ్చిన వాహనంలోనే వెనుదిరిగిపోయారు. జనం సభ చూసేందుకు ఆసక్తి కనబరచలేదు. వేదిక మీద నుంచి నాయకులు జనం కూర్చోవాలని, మంత్రి సురేష్ వస్తున్నారని మైకులో పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా జనం ఖాతరు చేయలేదు. వేదిక ముందు తొలి పది వరుస సీట్లలో కూడా కూర్చోలేదు. సింగరాయకొండ నుంచి ర్యాలీగా వచ్చిన మంత్రి జరుగుమల్లి మండలంలోని కొన్ని గ్రామాల వారిని కలుపుకుంటూ కొండపి వచ్చారు. తొలుత నామినేషన్ వేశాక టంగుటూరు రోడ్డులోని పొగాకు వేలం కేంద్రం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన సభా స్థలికి వచ్చారు. సభ 3 గంటల తర్వాత ప్రారంభమైంది. అప్పటికే గ్రామాల నుంచి వచ్చినవారు తిరిగి తమ వాహనాల్లో వెనుదిరిగి వెళ్లిపోయారు. సభా స్థలం వద్ద ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. మీడియా ఏదైనా రాసుకోండి. ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కొండపి ఎమ్మెల్యేగా తాను గెలిచి జగనన్నకు కానుకగా అందిస్తామని ముక్తసరిగా ముగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు. మండలాల నాయకులు పాల్గొన్నారు.

చెరువుకు సాగర్ నీరిచ్చి ఓట్లు అడగండి

ఫ్లెక్సీలు కట్టిన పొట్లపాడు గ్రామ యువత



కురిచేడు, ఏప్రిల్ 22 : కురిచేడు మండలం పొట్లపాడు గ్రామ యువత తమ చెరువుకు నీరిచ్చి మాత్రమే ఓట్లు అడగాలని ఫ్లెక్సీలు కట్టారు. గ్రామానికి నీటిని అందించే పెద్ద చెరువుకు సాగర్ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసి, అక్కడ నుంచి మండలంలోని 24 గ్రామాలకు నీరందంచేలా రూ.12 కోట్లతో మంచినీటి పథకం ఏర్పాటుచేశారు. పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలతో పథకం ప్రారంభానికి నోచుకోకముందే మూలనపడింది. దీంతో చెరువు పాడైంది. దీంతో రూ.12 కోట్ల ప్రజాధనం వృథా అయింది. ఈవిషయంలో పొట్లపాడు యువత, గ్రామస్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రతి ఎన్నికలలో గ్రామస్థులు చెరువుకు నీరు అందించేలా చూడాలని నాయకులకు విజ్ఞప్తి చేసున్నా ఫలితం లేదు. తాజా ఎన్నికలలో గ్రామ యువత ఈ విషయంపై దృష్టి పెట్టింది. గ్రామానికి సాగర్ కాలువ నుంచి నీటిని అందించి ఓట్లు అడగాలంటూ పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కురిచేడు - దొనకొండ ప్రధాన రోడ్డుపై, గ్రామ కూడలిలో, గ్రామంలోకి వచ్చేదారిలో మూడు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

కొండపి గెలుపే నా ఊపిరి

స్వామికి హ్యాట్రిక్ విజయమే నా ఆఖరి కోరిక

కేన్సర్‌తో బాధపడుతూ ప్రచారంలో పాల్గొన్న పాలుగుండ్ల నరసింహారెడ్డి



స్వామిని గెలపించాలని కోరుతున్న కేన్సర్ రోగి, నేత నరసింహారెడ్డి

మర్రిపూడి, ఏప్రిల్ 22 : కేన్సర్ మహమ్మారితో బాధపడుతూ తీవ్ర అనారోగ్యంతో ఉన్నా ఆయనలో తెలుగుదేశం పార్టీపై అభిమానం ఏమాత్రం తగ్గలేదు. కొండపి నుంచి టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్వామి తమ గ్రామానికి ప్రచారానికి వచ్చారని తెలియడంతో ఆయనలో ఎక్కడా లేని ఆనందం, ఉత్సాహం వచ్చింది. ఎండను సైతం లెక్కచేయకుండా స్వామితో కలిసి ప్రచారంలో పాల్గొని పార్టీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనే అంకేపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాలుగుండ్ల వెంకటనరసింహారెడ్డి(75). రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆయన 40 ఏళ్లుగా టీడీపీలోనే ఉన్నారు. మర్రిపూడి మండల కార్యదర్శిగా, టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడిగా, అంకేపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రసుత్తం ఆయన తీవ్ర కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అనారోగ్యంతో ఉన్నా గ్రామంలో స్వామి ప్రచారం సందర్భంగా ఆయన వెంట పాల్గొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచార వాహనంపై నుంచి మాట్లాడారు. నా ఆరోగ్యం బాగాలేకపోయినా టీడీపీపై అభిమానంతో వచ్చానని, ఇది తన ఆఖరి కోరిక అని, స్వామిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, హ్యాట్రిక్ విజయం అందించాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, నియోజవకర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, నాయకులు నేరెళ్ల శ్రీనివాసులు, ఎం. సుధాకర్‌రెడ్డి, రెడ్డయ్య, వనిపెంట కొండారెడ్డి, కొండా కోటిరెడ్డి, మలసాని కోటేశ్వరరావు, మలసాని నాగేశ్వరరావు, మోహన్‌రావు, బూదాల ఏసుదాస్, గురుబ్రహ్మం, నరసయ్య, దాసు పాల్గొన్నారు.

ఆంక్షలు జనానికే.. అధికార పార్టీ వారికి కాదు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ ప్రాంతంలో అధికారుల అస్తవ్యస్త నిబంధనల వల్ల సామాన్యులను కష్టాలు వెంటాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆ ప్రాంతంలో సామాన్య ప్రజానీకం రాకపోకలను నిలిపివేశారు. ఏదైనా అత్యవసరంగా ఆ ప్రాంతం వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ట్రంకురోడ్డు సమీపంలోని హెచ్‌సీఎం కళాశాల వద్ద, మునిసిపల్ కార్యాలయం పైభాగాన, ఇటు నెల్లూరు బస్టాండు ప్రాంతంలో భారీ గేడ్లు ఏర్పాటు చేయడంతో ప్రజానీకం ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతుండగా అధికార పార్టీ నేతలు మాత్రం ఏ సమయంలోనైనాఎక్కడికైనా వెళ్లేందుకు మాత్రం అనుమతులు ఇస్తున్నారు. ఒంగోలులో సోమవారం మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలోకి ఐదుగురిని అనుమతించినప్పటికి ఆ ప్రాంతంలో డజన్లకొద్ది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రావడంపై పలు ఆరోపణలువ్యక్తం అవుతున్నాయి. అదే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఆ విధంగా వస్తే ఊరుకుంటారా అన్నప్రశ్న సామాన్య ప్రజానీకంనుంచి తలెత్తుతున్నది.



ర్యాలీగా వస్తున్న బాలినేని



నామినేషన్ సందర్భంగా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రణీత్‌రెడ్డి

పరారే.. పరారే..!

బాలినేని నామినేషన్‌లో చివరి వరకు ఉండని జనం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం దాఖలు చేసిన నామినేషన్ ర్యాలీలో జనం అష్టకష్టాలు పడ్డారు. ఎండ తీవ్రత దెబ్బకు జనం పరుగులు పెట్టారు. నగరంలో ర్యాలీ కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు, పాత మార్కెట్ సెంటర్ మీదుగా ట్రంకురోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎండ తీవ్రతతో ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజానీకం మధ్యలోనే ఇళ్లకు పరుగులు పెట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సందులుగొందుల్లో నుంచి జారుకున్నారు. నామినేషన్‌కు వైసీపీ నాయకులు ఊహించిన స్థాయిలో ప్రజానీకం రాకపోవడంతో ముఖ్యనేతల్లో అసహనం వ్యక్తమైంది. ర్యాలీలో ఏర్పాటుచేసిన వాహనంపై వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాతతో పాటు పలువురు ఉన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు డబ్బులు పంపిణీ

ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు డబ్బులు పంపిణీ చేయడం కనిపించింది. ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున ఇచ్చినట్లు సమాచారం. ఒంగోలు నగరంతో పాటు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల నుంచి వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి డబ్బులు కూడా పంపిణీ చేశారు.



ర్యాలీ మధ్య నుంచే వెళ్తున్నజనం





అక్కపల్లెకు, రంగాపురానికి చెందిన కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి, తండ్రి కోసం ప్రచారం నిర్వహిస్తున్న దివ్యేష్‌రెడ్డి

చేరికలతో టీడీపీలో నూతనోత్తేజం

- కండువాలు కప్పి ఆహ్వానించిన అశోక్‌రెడ్డి
- తండ్రిని గెలిపించాలని తనయుడి ప్రచారం
- నాటి అభివృద్ధిని గుర్తు చేస్తూ అవగాహన

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 : టీడీపీలోకి చేరికల జోరుతో ఆ పార్టీలో నూతనోత్తేజం వచ్చింది. స్థానిక టీడీపీ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి 90 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. కంభం మండలం దర్గ గ్రామానికి చెందిన నాయకులు దేమా రవి ఆధ్వర్యంలో గ్రామంలోని బ్రహ్మయ్య, నాలి సుబ్బయ్య, గోలి బాలవీరయ్య, పందనబోయిన వెలుగొండు, కాటం గురువయ్య, గొట్టం శ్రీను, కర్ల బసవయ్యతో సహా 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.

అక్కపల్లె నుంచి 20 కుటుంబాల చేరిక

టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు పేదలకు వరంలాంటివని, ఆ పార్టీ సిద్ధాంతాలను నమ్మి తాము వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామని, రాచర్ల మండలం చోళ్లవీడు పంచాయతీలోని అక్కపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు తెలిపారు. గ్రామానికి చెందిన కొనసాల సుబ్బయ్య, పసుపులేటి కాశయ్య, కొత్తకోట నాగిశెట్టి, యరదేశి యోగానంద్, కుప్పాల రంగస్వామి, కుప్పాల జయరామయ్య, కుప్పాల జయరమేష్ చందు, గుమ్మ పులిరాజు, పందరబోయిన రంగనాయకులు, కత్తెరగండ్ల రఘురామిరెడ్డి, గలిజేరుగుల్ల కృష్ణయ్య, గోళ్ల దయానంద్, గోతంమౌళి, తాళ్ల లింగయ్య తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బత్తిని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలకవీడు నుంచి 15 కుటుంబాలు

రాచర్ల మండలం పాలకవీడు గ్రామానికి చెందిన 15న కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. బత్తుల రాజశేఖర్‌గౌడ్, అన్నపురెడ్డి రంగారెడ్డి, కట్టా వెంకటేశ్వర్లు, సాంబయ్య గుడిమెట్ల యలమంద, మిర్రె శ్రీను, మిర్రె వెంకటేశ్వర్లు, కట్టా శ్రీకాంత్, నారాయణ, షేక్ భాషా, శ్రీరామ్‌లు టీడీపీలో చేరారు.

అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు ఆధ్వర్యంలో రంగాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో గంగుల పెద్దకార్తీక్, గంగుల ఎల్లయ్య, కిల్లె పిచ్చయ్య, దేశావత్ చిన్నకాశీనాయక్, గంగుల చిన్న కార్తీక్, గంగుల పెద్దిరాజు, గంగుల చిన్నరాజులు ఉన్నారు.

అర్ధవీడు మండలం పాపినేనిపల్లె గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యుడు పోతిరెడ్డి చలమారెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెంచని గోపాల్, కలగొట్ల తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

బేస్తవారపేట : బేస్తవారపేట పట్టణానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి సోమవారం టీడీపీలో చేరారు. బేస్తవారపేట పట్టణ అధ్యక్షులు దూదెకుల సైదులు ఆధ్వర్యంలో గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో ముత్తుముల అశోక్‌రెడ్డి సమీక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలోదార్ల బాబు, గుళ్ల నాగరాజు, నూలి వెంకటేశ్వర్లు, గుళ్ల దేవదాసు, బండి రంగయ్య, నూలి రంగస్వామి, కొండలు, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకంభం నుంచి 40 కుటుంబాలు

కంభం : మండలంలోని చిన్న కంభానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి సోమవారం రాత్రి కంభంలో అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. అలాగే పట్టణంలోని తెలుగువీధికి చెందిన ఇజ్జారి బాలయ్య, యేలూరి ఏడుకొండలు ఆధ్వర్యంలో 100 బీసీ (జంగమేశ్వర) కుటుంబాలు టీడీపీలో చేరి వైసీపీకి భారీ షాక్‌ఇచ్చాయి. రానున్న ఎన్నికల్లో అశోక్‌రెడ్డిని గెలిపించుకొని గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కంభం మండలం కందులాపురం పంచాయతీలోని పూసల బజారులో ఒంగోలు పార్లమెంట్ నాయకులు కేతం శ్రీనివాసుల ఆధ్వర్యంలో గ్రామానికి నలుగురు వార్డు సభ్యులతో సహా 30 కుంటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

అభివృద్ధి చేసిన అశోక్‌రెడ్డిని గెలిపించండి

బేస్తవారపేట : గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తన తండ్రి ముత్తుముల అశోక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన తనయుడు దివ్యేష్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం బేస్తవారపేట మండలంలోని సలకలవీడు, కలగోట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని టీడీపీ హయంలో ఎంతగానో అభివృద్ధి చేసిన ఘనత ముత్తుముల అశోక్‌రెడ్డికే ఘనత దక్కిందన్నారు. తాగునీరు, సీసీరోడ్లు, పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలుఅందించారని ప్రజలకు గుర్తుకు చేశారు. రానున్న ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డిని, ఎంపీగా పోటీలో ఉన్న మాగుంట శ్రీనివాస రెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు

అవీ.. ఇవీ..

ఐదు నామినేషన్లు దాఖలు

- కూటమి అభ్యర్థిగా కందుల నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న నారాయణరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 22: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా ప్రకటించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి టీడీపీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరపున షేక్ సైదా, భారత చైతన్య యువజన పార్టీ తరపున రావెళ్ల భాగ్యలక్ష్మిలు నామినేషన్లు దాఖలు చేశారు. పొట్లూరి ఇమ్మానియేల్ స్వతంత్ర అభ్యర్థిగా, వైసీపీ అభ్యర్థిగా అన్నా వెంకట రాంబాబులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఐదు నామినేషన్లు దాఖలు

- టీడీపీ డమ్మీ అభ్యర్థిగా పుష్పలీల



నామినేషన్లు దాఖలు చేస్తున్న పుష్పలీల

గిద్దలూరు, ఏప్రిల్ 22 : గిద్దలూరు అసెంబ్లీకి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు వేసిన నామినేషన్ల సంఖ్య 13కు చేరింది. టీడీపీ డమ్మీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సతీమణి పుష్పలీల నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొమరోలు మండలం గోపానిపల్లెకు చెందిన వీరంరెడ్డి ఉషారాణి, కొండేపల్లికి చెందిన పర్సినేని వెంకటేశ్వర్లు, కంభం మండలం రావిపాడుకు చెందిన వరికుంట్ల ప్రసాద్, గిద్దలూరు మండలం బురుజుపల్లి గ్రామానికి చెందిన బట్టపోతుల ఓబులేసు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అజితారావు నామినేషన్

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 22 : ఎర్రగొండపాలెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా బూదాల అజితారావు సోమవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. తన అనుచరులతో కలిసి రిటర్నింగ్ అధికారి శ్రీలేఖకు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెసు పార్టీ నాయకులు చిలకా అనిల్‌కుమార్, జబ్బార్, రువ్వల శ్రీనివాసరావు, ఆరుణ పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు

- ఐదో రోజు భారీగా దాఖలు
- ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు అందజేత
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది 46 సెట్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 42 మంది అభ్యర్థులు 51 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. అందులో ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లను సమర్పించారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది అభ్యర్థులు 46 సెట్లను అందజేశారు. ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తరఫున ఒక సెట్, మాగుంట గీతాలత తరఫున మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు నాలుగు సెట్లు సమర్పించారు. సంతనూతలపాడుకు ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్లను అందజేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొండపి నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు ఏడు సెట్లు సమర్పించారు. మార్కాపురం, గిద్దలూరుకు ఐదుగురేసి, కనిగిరికి ముగ్గురేసి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దర్శి నుంచి టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి లక్ష్మి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ జన జాతరలా సాగింది. ఆమె భర్త కడియాల లలిత్‌సాగర్ కూడా నామినేషన్ పత్రాలను సమర్పించారు. కనిగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి గా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



గరుడగుడ్డ కడుతున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ ధ్వజారోహణ నిర్వహించారు. చెన్నకేశవస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా భేరి మండపం వద్ద వేంచేశారు. నేడు కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రికి చంద్రవాహనంపై ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఉచిత వేసవి శిక్షణ శిబిరం

గిద్దలూరు, ఏప్రిల్ 24 :పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం తమ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జీవనజ్యోతి జూనియర్ కళాశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మేథమాటిక్స్‌లో ప్రతిరోజు ఉదయం 9గంటల నుండి 12 గంటల వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జగనన్న నమ్మించి మోసం చేశాడు

- ర్యాలీలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



షర్మిలతో కరచాలనం చేస్తున్న కార్యకర్తలు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 22: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని 'జగనన్న ప్రజలను నమ్మించి మోసం చేశాడు' అని పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఏపీ న్యాయయాత్రలో భాగంగా వైఎస్ షర్మిల ఎర్రగొండపాలెం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బూదాల అజితారావు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డితో దోర్నాలలో సోమవారం రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ కూడలిలో ఆమె మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు చెప్పిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్ లేరన్నారు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ సాయిరెడ్డి, ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అని విశ్లేషించారు. తమ తండ్రి వైఎస్సార్ వదిలి వెళ్లిన వెలిగొండ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని నాడు జగన్ చెప్పాడన్నారు. నేటికీ పూర్తి చేయలేక పోయాడన్నారు. పోలవరం ఏమైందో కూడా తెలీదని, రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని తూర్పార బట్టారు. వర్షాలు లేక పంటలు నష్టపోతే రైతులకు రూపాయి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. మోదీతో జగన్ అక్రమ సంబంధం పెట్టుకున్నారన్నారు. ఆయనకు ఓటేసినా, చంద్రబాబుకు ఓటేసిన బీజేపీకి వేసినట్లేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. ప్రత్యేక హోదా తెస్తామని, అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తామన్నారు.

కంకిరాని మొక్కజొన్న పైరు

- లబోదిబోమంటున్నరైతు



కంకి రాని మొక్కజొన్న పైరు

బేస్తవారపేట, ఏప్రిల్ 22 : బేస్తవారపేట మండలంలోని పిటికాయగుళ్ల గ్రామంలో ఒక రైతు తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో మొక్కజొన్న కంకి రాకుండానే ఎండిపోయింది. దీంతో లబోదిబోమంటున్నాడు. పిటాకాయగుళ్ల గ్రామానికి చెందిన గోద రమణారెడ్డి గిద్దలూరులోని ఓ సీడ్స్ దుకాణంలో 8 కిలోల మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. రూ.10,800 నగదు రశీదు తీసుకున్నాడు. అయితే విత్తిన నాటి నుండి సకాలంలో భూమికి నీరు అందించినప్పటికీ, పైరుకు కంకిరాలేదు. దీంతో ఆ రైతు వెంటనే గిద్దలూరులోని దుకాణం యజమానికి, వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. డీలరుకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. నకిలీ విత్తనాలు అమ్మి తనను అప్పులపాలు చేశాడని రైతు రమణారెడ్డి వాపోతున్నాడు.

వైసీపీ నామినేషన్ల పర్వంలో ప్రజలకు ఇక్కట్లు



ప్రధాన వీధిలో అడ్డంగా ఏర్పాటు చేసిన మైకులు



మండుటెండలో మందేసి చిందేస్తున్న కార్యకర్త

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22: మార్కాపురం పట్టణంలో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నామి నేషన్ సోమవారం దాఖలు చేసే సందర్భంలో ప్రజల కు పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో ఏ పార్టీ నామినేషన్ చేయని విధంగా వైసీపీ ఆధ్వర్యంలో నాయుడు బజార్, దోర్నాల కూడలి, పాత బస్టాండ్, అమ్మవారిశాల వీధి, కంభంకూడలిలో విపరీతమైన శబ్దాలతో వందల మైకులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే వైసీపీ పాటలతో హోరెత్తించారు. విపరీతమైన శబ్ధ కాలుష్యానికి ప్రజలతో పాటు పోలీసులు కూడా అసహనానికి గురయ్యారు. కంభం కూడలిలో డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారులు పలుమార్లు మైకులను ఆపించినా తిరిగి అదే తంతు మొదలైంది. పట్టణంలో మందు, డబ్బులు పంపిణీ చేశారు. మండుటెండను లెక్కచేయక కొంతమంది తాగితందనాలు ఆడారు. ట్రాఫిక్ ఇష్టారీతిన మరలించటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు



దోర్నాల బస్టాండ్ వద్ద బస్సుల కోసం ప్రజల నిరీక్షణ

మార్కాపురం రూరల్ : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ ర్యాలీ సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించడంతో ట్రాఫిక్ ఆంక్షలతో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. పట్టణంలోని కళాశాల వీధిలోని సప్తగిరి లాడ్జీ వద్ద నుంచి నాయుడు వీధి, రథం బజారు, అమ్మవారిశాల బజారు మీదుగా రీడింగ్ రూమ్ వద్ద నుంచి కంభం బస్టాండ్ సెంటర్ వరకు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో దోర్నాల, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం వైపు వెళ్లే ప్రయాణికులు పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్ వద్ద సుమారు గంటపాటు బస్సుల కోసం నిరీక్షించారు. ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో వెళ్లేందుకు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యం



మార్కాపురంలో అభివాదం చేస్తున్న కార్యకర్తలు



ప్రచారం నిర్వహిస్తున్న కందుల వసంతలక్ష్మి

మార్కాపురం, ఏప్రిల్ 22: మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యమౌతుందని టీడీపీ నాయకులు కందుల వసంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజాగళంలో భాగంగా ఇంటింటికీ మీ కందుల కార్యక్రమం నిర్వహించారు. టీడీపీతోనే మహిళలకు స్వాలంబన చేకూరుతుందన్నారు. సీఎం జగన్ నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. 'జే' బ్రాండ్ లిక్కర్‌తో పేదల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కందుల నారాయణరెడ్డిలను రాన్ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మాజీకౌన్సలర్ మర్రి ఝాన్సీరాణి కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ కొండారెడ్డి పల్లెలో 25 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వీరికి మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగం రవికుమార్, పి.నారాయణ, బుడిగ శీను, బుడిగ రమేష్, నాగం వెంకట్రావ్, నాగం నాగయ్య, నాగం వెంకటేశ్వర్లు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఉడుముల చిన్నపురెడ్డి, పి.ఏసు దాసు, తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి :పట్టణంలోని వైసీపీని వీడి సోమవారం రాత్రి పలువురు టీడీపీలో చేరారు. మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలానితోపాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారిని కందుల నారాయణరెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలో 3, 4 వార్డుల్లో, నగరపంచాయతీ పరిధిలోని బుచ్చన పాలెం గ్రామంలోనూ పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరితో పాటు మస్తాన్‌భాష, అహమ్మద్, జాకీర్‌ల ఆధ్వర్యంలో వైసీపీని వీడి 80 ముస్లిం కుటుంబాలు కందుల నారాయణరెడ్డి సమక్షంలో సోమవారం టీడీపీలో చేరాయి. వీరికి కందుల నారాయణ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. వారిలో మస్తాన్‌భాష, మహమ్మద్, జాకీర్, షాజహాన్, ఖాదర్‌వలి, బాజీ, మస్తాన్, బాబు, బాజీ, సయ్యద్ మలాంగ్, గోపి, షేక్ ఆరీఫ్ తదితరులున్నారు.

కొనకనమిట్ల : మండలంలోని చౌటపల్లి గ్రామంలో సోమవారం 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో మాలపాటి ఎర్రారెడ్డి, కళ్లం రమణారెడ్డి, కారుమూరి వెంకటరెడ్డి, చిరుపూరి మలకయ్య, ఇజ్రాయేల్, యేసు, అబ్రహం, నాని, కానయ్య, గుంటు లక్ష్మయ్య, భాస్కర్ తదితరులు పార్టీలో చేరారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

మార్కాపురం : పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇంచార్జి కందుల రామిరెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు.

టీడీపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు



ప్రచారం నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్రలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 22 : నియోజకవర్గంలో గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ పలాలు ప్రజలకు చేరువకావాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటుతో ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రవీంద్రలు అభ్యర్థించారు. మండలంలోని పాత గోళ్లవీడపి, కొత్తగోళ్ల వీడపి గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా చేసి, రాజధానిలేని రాష్ట్రంగా ఉంచిన వైసీపీకి బుద్ధి చెప్పాలని గ్రామస్థులను కోరారు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుల్లలచెరువు : మండలంలోని చెన్నపాలెం చెంచుగూడేం లో వైసీపీ నుంచి 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భం గా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం తాండలో తట్ట మట్టి పోయలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య. కే.కుమార్, మేడికొండ లక్ష్మినారాయణ. పల్లపాటి బాదరయ్య , వేముల క్రిష్ణయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

పొదిలి, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ బాలుర ఉన్న పాఠశాల విద్యార్థిని టీ.వీరాంజలి 563 మార్కులతో, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఎస్కే. రాములేటి సమీర 555, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ వెంకటనందిని 518, కేజీబీవి పాఠశాల విద్యార్థిని వి.రూప 515, ఉప్పలపాడు జడ్పీహెచ్ఎస్ 497 మార్కులతో నిలిచారు. అదే విధంగా నిర్మలా కాన్వెంట్ విద్యార్థిని జి కృషితా ఏంజల్ 580 మార్కులు సాధించింది. గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎస్కే. మహమ్మద్ ఇమ్రాన్ 595 మార్కులతో, ఆల్ఫాస్కూల్ విద్యార్థి ఎస్కే ఇస్మత్ 589 మార్కులతో నిలిచారు. వారిని ఎంఈవో శ్రీనివాసరెడ్డి, పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

పెద్ద దోర్నాల : మండలంలోని పదో తరగతి ఫలితాల్లో 90శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ప్రభుత్వ మొత్తం 651మందికి గానూ 584 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం స్పందన 600లకు 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

త్రిపురాంతకం : మేడపిలోని వాణిరమ పాఠశాల నుంచి 84 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 83 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన జి.నాగప్రవళిక 587 మార్కులు సాధించారు. త్రిపురాంతకంలోని సాయిచైతన్య పాఠశాల నుంచి బి.కీర్తన 564 మార్కులు సాధించింది. గణపవరం గురుకుల పాఠశాలకు 62 మందికి 62 మంది ఉత్తీర్ణత సాధించగా ఈ.హనుమంతు 589 మార్కులు సాధించారు. దూపాడు బాలికల గురుకుల పాఠశాలలో 79 మంది 79 మంది ఉత్తీర్ణత సాధించగా బినిస్సీ 568 మార్కులను సాధించింది. దూపాడు జడ్‌పి పాఠశాలలో 20 మంది 19 మంది ఉత్తీర్ణత సాధించగా, గొల్లపల్లి జడ్‌పి పాఠశాలలో 37 మంది 34 విద్యార్థులు పాసై డి.మస్తాన్‌బి 501 మార్కులు సాధించారు. రామసముద్రం జడ్‌పి పాఠశాలలో 23 మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించారు. గణపవరం జడ్‌పి పాఠశాలలో ఈ.అశ్విత 563 మార్కులు, మేడపి జడ్‌పి పాఠశాలలో 66 కి 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా జి.భరద్వాజ్ 558 మార్కులు సాధించారు. త్రిపురాంతకం జడ్‌పి పాఠశాలలో 169కు 138 మంది ఉత్తీర్ణత సాధించగా టి.బలరామకృష్ణారెడ్డి 568, విద్యాభారతి పాఠశాలలో 24కు 24 మంది ఉత్తీర్ణత సాధించగా జి.రంగశ్రావణ్‌కుమార్ 565 మార్కులు సాధించారు, కస్తూరిబా పాఠశాలలో 31 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించగా కె.శిరీష 509 మార్కులు సాధించారు. కంకణాలపల్లి జడ్పీ పాఠశాలలో 27 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించగా బి.కార్తీక్ 558 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కొమరోలు : మండలంలోని పదవ తరగతి పరీక్షల్లో సర్వైట్ హైస్కూల్ విద్యార్థి షేక్ ఆసీఫ్ 580 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచి సత్తాచాటారు. ద్వితియ స్థానంలో ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు గర్రె అజయ్ కుమార్, జి చందన కీర్తిలు 578 మార్కులు సాధించారు. తృతీయ స్థానంలో సర్వైట్ హైస్కూల్ విద్యార్థి పసుపులేటి సౌమ్యశ్రీ 574 మార్కులు, ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థి కేవీ సాయి నిఖిల్, ఎ జ్యోతిలు 576మార్కులు సాధించారు. ఈ ఏడాది ఉత్తీర్ణతశాతం పెరిగిందని ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రెడ్డిచర్ల గ్రామానికి చెందిన బందేల స్టాన్లీ సెబిస్టీన్ 584మార్కులు సాధించారు. మదనపల్లి జిల్లా న్యాయమూర్తి బందేల అబ్రహం కుమారుడు స్టాలిన్ కావటంతో స్థానికులు విద్యార్థిని అభినందిస్తున్నారు.

రాచర్లలోని స్పందన ఉన్నత పాఠశాలలో సి.ఎల్.నరసింహ 588 మార్కులు, సయ్యద్ అఫ్రిన్, ఎస్.శ్రావణిలు 580 మార్కులు, రామ్‌దీపక్ 577 మార్కులు సాధించగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి సన్మానించారు.

గిద్దలూరు : 10వ తరగతి పరీక్ష ఫలితాలలో. పట్టణంలోని సూర్యవిద్యా నికేతన్‌కు చెందిన షేక్ అంజుమ్ 592 మార్కులు సాధించారని, 166 మంది విద్యార్థులు 540కి పైగా మార్కులు సాధించారని, 99 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ డి.జి.బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ పద్మావతి తెలిపారు. అరుణోదయ పాఠశాలకు చెందిన ఎం.భాగ్యరేఖ 584 మార్కులు, సి.హెచ్.శోభారాణి 584 మార్కులు, నాగ యశ్వంత్ 583 మార్కులు సాధించారని కరస్పాండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. గీతాంజలి హైస్కూల్‌కు చెందిన వి.గిరీషచారి 583 మార్కులు, కె.సైమన్ 565 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, హెచ్.ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వినూత్న విద్యానికేతన్‌కు చెందిన మోక్షిత 581 మార్కులు, ఆరిఫ్ 571 మార్కులు, 500కు పైగా 18 మంది మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ఖాజావలి తెలిపారు. నారాయణ హైస్కూలుకు చెందిన డి.వెంకటవైష్ణవి 595 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు.

కంభం : సోమవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో కంభం వాసవి పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావడమేకాక టి.వి.రామ్‌చరణ్ 595/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించినట్లు పాఠశాల చైర్మన్ గోళ్ళ రత్నం (బాబు) తెలిపారు. మొత్తం 214 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 214 ఉత్తీర్ణత సాధించారన్నారు.

కంభం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. రావిపాడు జడ్పీ హైస్కూలులో వై.నాగపుష్ప 585/600, కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కె.చరణ్ 570/600, తురిమెళ్ల ప్రభుత్వ హైస్కూలులో జి.లక్ష్మీమంజుల 567/600, కంభం బాలికోన్నత పాఠశాలలో బి.ఆయేషా 569/600, జంగంగుంట్ల జడ్పీ హైస్కూల్‌లో శివలక్ష్మి 552/600, ఎల్.కోట జడ్పీ హైస్కూలులో కె.అఖిల్‌కుమార్ 530/600, కంభం బాలికల గురుకుల పాఠశాలలో వై.సంజనరాణి 566/600, పెద్దనల్లకాల్వ జడ్‌పి హైస్కూలులో శివశంకర్ 479/600, యర్రబలెం జడ్‌పి హైస్కూలులో ఐ.అభిషేక్ 425/600 మార్కులు వచ్చినట్లు తెలిపారు.

గిద్దలూరు, ఏప్రిల్ 22 : గిద్దలూరులోని విశ్వభారతి ఐఐటి ఫౌండేషన్ పాఠశాలకు చెందిన ఎ.ప్రీతి, వై.సంతోష్‌కుమార్‌రెడ్డిలు 587 మార్కులు, పి.కుసుమకుమారి 580 మార్కులు, సి.హెచ్.ఇందు, జి.తులసిలు 578 మార్కులు, పి.హర్షిత 577 మార్కులు, షేక్ అఫ్రీద్, నందినిలు 570 మార్కులు సాధించగా 500కు పైగా 51 మంది మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఆదిలక్ష్మి, డైరెక్టర్ రంగస్వామిరెడ్డి తెలిపారు.

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 22 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మార్చి నెలలో జరిగిన 10 వతరగతి పరీక్షల్లో 660 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 594మంది ఉత్తీర్ణులై 90 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో పి ఆంజనేయులు తెలిపారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 194మంది విద్యార్థులకు గాను 178 మంది ఉత్తీర్ణులై 91 శాతం ఉత్తీర్ణత, జడ్పీపాఠశాలలో 91 మంది గాను 82 మంది ఉత్తీర్ణులై 90శాతం, యంజెపిఎస్ పాఠశాల 32 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించారు.

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22: పది పరీక్షల ఫలితాలలో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రంగశివనాయుడు 571, మహమ్మద్ అలీ 567, నరవరాజు 560 మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రావు తెలిపారు. వాసవీ విద్యానికేతన్‌లో తాటి శివాంజనేయులు 590 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రంగయ్య తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఫలితాల్లో సత్తాచాటారు.

దర్శిలో బార్ అండ్ రెస్టారెంట్ సీజ్

దర్శి, ఏప్రిల్ 22: దర్శి పట్టణంలోని కేబీ బార్ అండ్ రెస్టారెంట్‌ను అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ నుంచి మద్యాన్ని తరలించటంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. రెస్టారెంట్ నుంచి ఆదివారం 133 మద్యం బాటిల్స్ బయటి వ్యక్తులకు విక్రయిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేయగా, పట్టుకున్న మద్యం బాటిల్స్ రెస్టారెంట్‌లో నుంచి బయటకు వచ్చినట్లు నిర్ధారించారు. నిబంధలకు విరుద్ధంగా బయటి వ్యక్తులకు మద్యం విక్రయించినట్లు నిర్ధారణ అయినట్లు పోలీసులు నివేదికను ఎక్సైజ్ అధికారులకు పంపారు. ఈమేరకు ఎక్సైజ్ అధికారులు సోమవారం బార్ అండ్ రెస్టారెంట్‌ను సీజ్ చేశారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

పీసీపల్లి, ఏప్రిల్ 22: పొలం పనుల కోసం కూలీలను తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడడంతో పలువురు గాయపడ్డారు. ఈసంఘటన సోమవారం ఉదయం మండలంలోని వెంగళాయపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఇర్లపాడు వెళ్లి మిరప కాయలు కోసేందుకు కూలీలను తీసుకువస్తున్నారు. ఈక్రమంలో వెంగళాయపల్లి గ్రామంలోకి వచ్చేసరికి రోడ్డుపైకి వచ్చిన శునకాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సుబ్బరత్తమ్మ, గోవిందమ్మ, ఐ.జయమ్మ, సంపూర్ణ, వెంకటలక్ష్మీ, రమణమ్మ, బి.జయమ్మ, మాలకొండయ్య, జయమ్మ, లక్ష్మమ్మలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పీసీపల్లి వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం 108లో కనిగిరి వైద్యశాలకు తరలించారు.

మంచు దుప్పట్లో కురిచేడు



ఎదురుగా వచ్చే వాహనాలు కనడకుండా కురుస్తున్న మంచు

కురిచేడు, ఏప్రిల్ 22: కురిచేడును సోమవారం మంచు దుప్పటి కమ్మేసింది. తెల్లవారుజాము వరకు వాటి ఆనవాలు లేవు. తెలవారుతుండగా ఒక్కసారిగా మంచు కురిచేడుతో పాటుగా పరిసర ప్రదేశాలను కమ్మేసింది. ఎదురుదుగా వచ్చే వాహనాలు సైతం కనపడలేదు. వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణం చేశారు. లారీలను అయితే పెట్రోలు బంకుల్లో నిలుపుకున్నారు.

ఉగ్ర నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పామూరు, ఏప్రిల్ 22: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పేర్కొన్నారు. కనిగిరిలో ఈనెల 24న జరిగే ఈకార్యక్రమంలో టీడీపీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సోమవారం మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో ఆయన విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ఏలూరి నరసింహారావును కలుసుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం గ్రామ టీడీపీ నాయకులతో చర్చించారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

పీసీపల్లి, ఏప్రిల్ 22: టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆపార్టీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య అన్నారు. మండలంలోని శంకరాపురంలో సోమవా రం రాత్రి జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కొండపనాయుడు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మూలె బుజ్జిరెడ్డి, కొండారెడ్డి, చినశివరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

కురిచేడు, ఏప్రిల్ 22: కురిచేడు మండలం పడమరగంగవరం ఎస్సీ కాలనీకి చెందిన 40 కుటుంబాలు సోమవారం ఆగ్రామ టీడీపీ నాయకుడు దాసరి ఏడుకొండలు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వితలాపురంలో 5 కుటుంబాలు..

తాళ్లూరు, ఏప్రిల్ 22: మండలంలోని వితలాపురం ఎస్సీకాలనీకి చెందిన ఐదు వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పాలెపోగు ఇమ్మానియేల్, పాలెపోగు బాలయ్య, గొళ్లపూడి బుల్లెయ్య, కోటయ్య కుటుంబాలకు వితలాపురంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, నాగేశ్వరరావు, నవులూరి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

దర్శి.. పసుపుమయం

- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భారీ ర్యాలీ
- కిటకిటలాడిన పట్టణ వీధులు
- అట్టహాసంగా నామినేషన్

దర్శి, ఏప్రిల్ 22: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నామినేషన్ దాఖలు సందర్భంగా సోమవారం దర్శిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉప్పొంగిన జనసంద్రంతో పట్టణం దద్దరిల్లింది. ప్రధాన వీధులన్నీ పసుపుమయమయ్యాయి. ఊహించని విధంగా వేలాది మంది ప్రజలు రావడంతో గడియారస్తంభం సెంటర్ కిటకిటలాడింది. గతంలో ఎన్నడూలేని విధంగా మండుటెండను సహితం లెక్కచేయకుండా అధికసంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు తొలుత రాజంపల్లి పంచాయతీలోని ముసీనది తీరానగల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడనుంచి సుమారు 12 గంటల సమయంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగవీటి రాధ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ ఇన్‌చార్జ్ గోరంట్ల రవికుమార్, మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, తెలుగుమహిళ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోత్స్న జనసేన, బీజేపీ నాయకులతో కలిసి గొట్టిపాటి లక్ష్మి ర్యాలీతో బయలుదేరారు. ప్రజలు ఇరువైపులా పోటెత్తడంతో కిలోమీటర్ ర్యాలీ ముందుకు సాగ డానికి రెండుగంటల సమయం పట్టింది. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతు లిచ్చి పూలవర్షం కురిపించారు. దర్శి గడియార స్తంభానికి మధ్యాహ్నం 2.20 గంటలకు ర్యాలీ చేరుకుంది. అనంతరం ఈ ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.



ఉప్పొంగిన ఉత్సాహంతో గడియారస్తంభం ఎక్కి జెండాలు ప్రదర్శిస్తున్న యువకులు

అధికసంఖ్యలో పాల్గొన్న మహిళలు

గతంలో ఎన్నడూలేనివిధంగా ర్యాలీలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు. ప్రత్యేకంగా కొంతమంది పచ్చ టోపీలు ధరించి, పసుపు జెండాలు పట్టుకొని యూనిఫాంలా పసుపురంగు బట్టలు వేసుకొని వందలాదిమంది మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు గడియారస్తంభం సెంటర్ నుంచి పార్టీ కార్యాలయం వైపునకు పెద్ద వాహనాలను వెళ్లనీయకపోవటంతో వందలాదిమంది మహిళలు మండుటెండను సహితం లెక్కచేయక నడుచుకుంటూ కార్యాలయం వద్దకు వెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీకి తరలివచ్చిన మహిళలు

ఉప్పొంగిన ఉత్సాహంతో కేరింతలు కొట్టిన యువత

ఉప్పొంగిన ఉత్సాహంతో కేరింతలు కొడుతూ వందలాది మంది మోటార్‌సైకిళ్లతో ర్యాలీ చేశారు. అధికశాతం మంది యువకులు టీడీపీ, జనసేన, బీజేపీ భారీ జెండాలను మోటార్‌సైకిళ్లకు కట్టుకొని పురవీధుల్లో తిరుగుతూ ఉత్సాహం నింపారు. ర్యాలీని చూసేందుకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావటంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. దీంతో వందలాది మంది ఇరువైపులా భవనాలు ఎక్కి ర్యాలీని తిలకించారు. కొంతమంది యువకులు గడియాస్తంభం ఎక్కి విక్టరీ సింబల్ చూపుతూ జెండాలు ప్రదర్శించారు. ర్యాలీకి అన్నిప్రాంతాల నుంచి అన్నివర్గాల ప్రజలు అధికసంఖ్యలో తరలిరావటతో పార్టీ శ్రేణులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు.

రాష్ట్రంలో అసమర్థపాలనను సాగనంపాలి

- కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 20: రాష్ట్రంలో వైసీపీ అసమర్థ పాలనను సాగనంపాలని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి కనిగిరి, వెలిగండ్ల, పామూరు, పీసీపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 83 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం పట్టణంలోని 1వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు, హనుమంతునిపాడు మండలంలోని వీరరామాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఆయన టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలనే కాకుండా సంపన్న వర్గాలను కూడా జగన్ నానా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను పక్కదోవ పట్టించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. ఓపవక్క సంక్షేమం, మరోవక్క అభివృద్ధి చేయగలిగే సమర్థుడైన చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), తదితరులు పాల్గొన్నారు.



పామూరు: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన గోపాలపురం వాసులు



వైసీపీ నుంచి టీడీపీ చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఉగ్ర

రాక్షస పాలనకు చరమగీతం తప్పదు!

పామూరు, ఏప్రిల్ 22: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. సోమవారం మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో ఆయన నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. వైసీపీ పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలవారు అధికార వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఉగ్ర సమక్షంలో 16 కుటుంబాలు చేరిక

పామూరు మేజర్ పంచాయతి గోపాలపురం గ్రామానికి చెందిన 16 కుటుంబాలు సోమవారం కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్ర మాల్లో మాజీ ఎంపీపీ జి.ద శరథరామయ్య, బొల్లా నరసింహారావు, ఎం.హుసేన్‌రావుయాదవ్, గద్దె గంగయ్యచౌదరి, దాసరి మాలకొండయ్య, దారపనేని కొండబాబు, వై.బాల పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలంలో టీడీపీలోకి భారీగా వలసలు

వెలిగండ్ల, ఏప్రిల్ 22: వెలిగండ్ల మండలంలో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి కవ్వంపాడుకు చెందిన 15 కుటుంబాలు, చోడవరం పంచాయతీకి చెందిన ఆరు కుటుంబాలు, పూలికుంట్ల రాళ్ళపల్లికి చెందిన 31 కుటుంబాలు, గన్నవరం పంచాయతీ నుంచి ఏడు కుటుంబాలు సోమవారం కనిగిరిలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాశీరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, ఇంద్రభూపాల్ రెడ్డి, గవదకట్ల హరి, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న డాక్టర్ లలిత్‌సాగర్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి అసెంబ్లీకి ఐదు నామినేషన్లు దాఖలు

దర్శి, ఏప్రిల్ 22: దర్శి అసెంబ్లీకి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భారీ ర్యాలీతో ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆమెతో పాటు భర్త డాక్టర్ లలిత్‌సాగర్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకుడు వీరపనేని రంగ పాల్గొన్నారు. అలాగే, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ టీడీపీ తరుపున ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ నాయకుడు కేవీ రెడ్డి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తరుపున ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ మీనా రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.

కనిగిరిలో మూడు నామినేషన్‌లు..

కనిగిరి ఏప్రిల్ 22: కనిగిరి అసెంబ్లీకి ఇప్పటివరకు నాలుగు నామినేషన్‌లు అందినట్లు అధికారులు తెలిపారు. సోమవారం టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి రెండు నామినేషన్ సెట్లు వేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ ఒక నామినేషన్ వేయగా, సోమవారం మరో నామినేషన్ వేసినట్లు తెలిపారు.

రేపు భారీ జనవాహినితో నామినేషన్ వేస్తా: ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 22: భారీ జనవాహినితో ఈనెల 24న మరో నామినేషన్ సెట్ వేస్తున్నట్టు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆయన సతీమణి డాక్టర్ ముక్కు కవిత, తనయుడు జయసింహారెడ్డి, కుటుంబసభ్యులతో కలసి వెళ్ళి రెండు నామినేషన్‌లు వేశారు. అనంతరం ఉగ్ర విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ ముఖ్యనేతలతో కలసి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడను పారద్రోలేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా టీడీపీ గెలుపును ఆపలేరన్నారు. ఉగ్ర వెంట ఆయన సతీమణి డాక్టర్ కవిత, తనయుడు జయసింహారెడ్డి, ఆయన సోదరి, నాయకులు పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డిలు ఉన్నారు.



నామినేషన్ పత్రాలను ఆర్ఓ జాన్‌ఇర్విన్‌కు అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర, సతీమణి డాక్టర్ కవిత, తదితరులు



గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలోకి అనుచరులతో చేరుతున్న ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య

ఏఎంసీ మాజీ చైర్మన్ సుబ్బయ్య టీడీపీలో చేరిక

దర్శి ఏప్రిల్ 22: దర్శి పట్టణానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బయ్య 300 మంది అనుచరులతో వైసీపీని వీడి ఆదివారం రాత్రి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అసమర్థ, అరాచకపాలన పట్ల విసుగు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీలో బీసీలకు ఆదరణ లేదు!

- అక్కడ గౌరవం లేనందునే టీడీపీలో చేరా
- ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, ఏప్రిల్ 22: వైసీపీలో బీసీలకు ఆదరణ లేదని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. అన్నారు. దర్శిలో సోమవారం టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నామినేషన్ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావుకు టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బహిరంగ సభ నుద్దేశించి ఎంపీపీ తాటికొండ మాట్లాడుతూ బీసీ(రజక)సామాజిక వర్గానికి చెందిన తానొక్కడినే రాష్ట్రంలో ఎంపీపీగా ఉన్నానని చెప్పారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేశానన్నారు. జగన్ మాత్రం నా బీసీ అంటున్నారే కాని, ఈ నియోజకవర్గంలో వైసీపీలో కష్టపడుతున్న బీసీలు అణచివేతకు గురవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యేగా గొట్టిపాటి లక్ష్మిని అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి అధికారంలోకిరాగానే చంద్రబాబు పాలనలో బీసీలకు మరింత మేలు జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వంగవీటి రాధకు ఘనసన్మానం

ముండ్లమూరు, ఏప్రిల్ 22: దర్శిలో సోమవారం జరిగిన టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి నామినేషన్ కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర నాయకుడు వంగవీటి రాధ, గొట్టిపాటి భరత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మండలంలోని శంకరాపురం వద్ద మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాధ మాట్లాడుతూ టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

పదిలో మెరిసిన విద్యార్థులు

పామూరు, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభచాటారు. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో పామూరు ఆల్ఫా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జయరామిరెడ్డి తెలిపారు. హివదుస్థాని సోహేల్ 588 మార్కులు, ఎల్.లక్ష్మీ పూజిత 587, పి.త్రిపుర 585, ఎం.నాగచందన 583 మా ర్కులు సాధించినట్లు తెలిపారు. సేయింట్‌మార్క్ హైస్కూల్‌లో షేక్ రీహాన్ 584 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ఎం.జయకుమార్ తెలిపారు.

కాగా, మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని ఎంఈవో-2 కరుణకుమారి తెలిపారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 168 మంది పరీక్షలు రాయగా 139 మంది ఉత్తీర్ణత సాధించారు.

పీసీపల్లిలో 99.7శాతం ఉత్తీర్ణత

పీసీపల్లి, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పీసీపల్లి మండలంలో 99.7శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఏడాది 336 మంది పరీక్షలు రాయగా, 335మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎం ఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ముండ్లమూరులో 424 మంది ఉత్తీర్ణత

ముండ్లమూరు, ఏప్రిల్ 22: ముండ్లమూరు మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 463 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 424 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడు పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం పట్ల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

దొనకొండలో 96.64శాతం..

దొనకొండ, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షలకు మండలంలో 535 మంది విద్యార్థులు హాజరుకాగా 517 మంది పాసై 96.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కురిచేడులో 90 శాతం..

కురిచేడు, ఏప్రిల్ 22: కురిచేడు మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 90.85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. మూడు పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

తాళ్లూరులో 65శాతం ఉత్తీర్ణత

తాళ్లూరు, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 65శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. 316 మంది విద్యార్థులకు గాను 205 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు.


ఒకే రూపమే కాదు.. ఒకే మార్కులు సాధించారు..!



574 మార్కులు సాధించిన కవలలు

కనిగిరి, ఏప్రిల్ 22: రూపులోనే కాదు.. పది ఫలితాల్లో కూడా ఒకే మార్కులు సాధించిన కవలలు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూలులో చదువుతున్న ఇద్దరు కవలలు షేక్ అల్తాఫ్, ఆసిఫ్‌లు 574 మార్కులు సాధించారు. ఇద్దరూ ఒకే మార్కులు సాధించటం పట్ల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే, ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. నాయుడు నిత్యశ్రీ 593 మార్కులు, కాకర్ల వెంకట లక్ష్మీరిషిత 590 మార్కులు, అంగులూరి వెంకట అఖిలేష్ 587 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమేష్, చైర్మన్ ఉన్నం బాస్కర్, సెక్రటరీ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు షియాజుద్దీన్, రాంబాబు, బాలభాస్కర్, నరేంద్ర, తదితరులు అభినందించారు. అలాగే, కొత్తఏరువారిపల్లి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం మహబూబ్ ముంతాజ్‌బేగం తెలిపారు. మండలంలోని కొత్తఏరువారిపల్లి హైస్కూల్ నుంచి 42 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. అలాగే, ఆదర్శ పాఠశాలకు చెందిన 84 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 79 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ రమణయ్య తెలిపారు.







వేమూరులో ఆర్‌ఓకు నామినేషన్ పత్రం అందజేస్తున్న నక్కా ఆనందబాబు ఆలపాటి రాజా తదితరులు

వేమూరు.. జనసందోహం

- అట్టహాసంగా నక్కా ఆనందబాబు నామినేషన్
- టీడీపీ, జనసేన శ్రేణుల భారీ ప్రదర్శన

వేమూరు, ఏప్రిల్ 22: కూటమి తరపున వేమూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సోమవారం నామినేషన్ వేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అశేష జనసందోహం మధ్య ఆయన నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉదయం 10గంటలకు ఐదు మండలాల పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పార్టీ జెండాలు, ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వేమూరు ఎన్టీఆర్ పుర వేదిక వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తొలుత మహిళలు గుమ్మడి కాయలతో ఆనందబాబుకు దిష్టితీసి కర్పూర హారతులు ఇచ్చారు. బాణసంచా, రాజస్థాన్ బ్యాండ్, జయ జయ ధ్వానాలతో యువత ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఎన్టీఆర్, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లూరు-తెనాలి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించగా అడుగడుగునా పార్టీశ్రేణులు స్వాగతం పలికాయి. మార్గమధ్యలో మహిళలు ఆపి ఆనందబాబుకు తిలకం దిద్ది పూలమాలలు వేసి హారతులతో ఆశీర్వదించారు. తహసీల్దారు కార్యాలయ సమీపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనందబాబు తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆనందబాబుకు జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, నాయకులు బట్టు మల్లికార్జున, షాలెంరాజు, తమ్మా శివారెడ్డి, శరత్‌చంద్ర, డాక్టర్ కనగాల మధుసూదన్‌ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబు, ఎల్లారెడ్డి, ఎలవర్తి బ్రహ్మానందం, శరణుగిరి, విష్ణుమొలకల శ్రీనివాసరావు, దండే సుబ్బారావు, చలమయ్య, షేక్ హనీఫ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.



వేమూరులో ప్రచార రథంపై నుండే ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనందబాబు

- పండించిన పంటకు గిట్టుబాటు దక్కక అన్నదాతల అవస్థలు
- జిల్లాలో నాలుగేళ్లుగా ఏటికేడు తీసికట్టుగా ధాన్యం సేకరణ
- నామమాత్రంగానే మార్క్‌ఫెడ్ పాత్ర
- దిగుబడులకు, సేకరణలకు పొంతనే ఉండని వైనం
- రైతుల ఆక్రందన పట్టని వైసీపీ ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తుంది.. పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచే ఏర్పాటు చేస్తాం.. ఇలా ఒకటేమిటి ఎన్నో వాగ్దానాలు 2019కు ముందు సీఎం జగన్ గుప్పించారు. అయిదేళ్ల తర్వాత సీన్ కట్‌చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించే సంగతి దేవుడెరుగు.. ఏటికేడు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే ధాన్యం పరిమాణం పడిపోతూ వస్తోంది. పైగా కొనుగోలు కేంద్రాలూ అందుబాటులో ఉండవు.

అరకొరగా కొనుగోలు చేసిన ధాన్యం విషయంలో డబ్బులు పడడం మరో ప్రహసనం. ఇక వాణిజ్య పంటలైన మినుము, పెసరతో పాటు మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు విషయంలో మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రం. మొక్కుబడి తంతుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్పితే జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పంటల సంగతి అడిగితే నీళ్లు నమలడం అధికారుల వంతవుతోంది. పైగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల పంపిణీ విషయంలో మార్క్‌ఫెడ్‌ను చేర్చి దాని అసలు ఉద్దేశం నీరుగార్చే ప్రక్రియకు తెరలేపిన ఘనత వైసీపీది. ఈ విధంగా ఐదేళ్లలో జిల్లాలోని రైతాంగానికి అడుగడుగునా అన్యాయం చేసిన ప్రభుత్వంగా వైసీపీ ప్రభుత్వం మిగిలిపోయిందని రైతులు విమర్శిస్తున్నారు.

మద్దతు ధర.. ఎండమావే!

బాపట్ల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో ఏటికేడు తీసికట్టే అన్నట్లు ఉంటోంది. 2023-24కు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ముగింపుకొచ్చేసరికి అదికాస్తా 28,500 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. గతేడాది ఖరీఫ్‌లో అయితే 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకుంటే ఇది కాస్తా 75,000 మెట్రిక్ టన్నుల దగ్గరే ఆగింది. తాజా ఖరీఫ్‌లో సేకరణ గతంతో పోలిస్తే దారుణంగా పడిపోయింది. రబీ సీజన్‌లోనూ ఇదే తంతు. పెట్టుకున్న లక్ష్యాలకు సేకరణకు హస్తిమశకాంతరం ఉంటోంది. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా ధాన్యం సేకరణ పరిమాణం పెరగకపోగా సీజన్, సీజన్‌కు తగ్గుదల నమోదవడం గమనార్హం.

సొమ్ము జమ చేయడంలోనూ నిర్లక్ష్యమే..

అరొకరగా సేకరించిన ధాన్యానికి సొమ్ము జమ చేయడంలోనూ వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెట్టింది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి తప్పితే రైతులకు కష్టాలు తప్పలేదు. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఈ అయిదేళ్లలో డబ్బు జమ విషయంలో వైసీపీ వేసిన పిల్లిమొగ్గలు అన్నీఇన్నీ కావు. ధాన్యం సేకరణ విషయంలోనూ ఏకీకృతం అనే కొత్త ఎత్తుగడకు వైసీపీ ప్రభుత్వం తెరతీసింది. ధాన్యం సేకరణను గుత్తాధిపత్యం చేసే ఆలోచనలో భాగంగా ఒకే మిల్లరుకు అప్పగించేలా టెండర్లను కూడా పిలిచింది. ఇది ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో రైతు లు ఊపిరిపీల్చుకున్నారు.

పంట పండించుకుంటున్న దళారులు...

ప్రభుత్వం మద్దతు ధర విషయంలో రైతులకు చేస్తున్న అన్యాయం దళారులకు వరంగా మారుతోంది. ముఖ్యంగా ధాన్యం మద్దతు ధర విషయంలో ప్రభుత్వం విధించే అలవిమాలిన నిబంధనలు అన్నదాతలకు గుదిబండగా మారి కొనుగోలు కేంద్రాల వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇక ధాన్యం డబ్బుల జమ విషయంలో నెలల తరబడి జరుగుతున్న జాప్యం కూడా వారిని దళారుల వైపు మళ్లేలా పురిగొల్పుతోంది. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలా ఈ ఐదేళ్లలో మద్దతు ధర విషయంలో రైతులు నిలువునా మోసానికి గురయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ ఉందో పాలకులకే తెలియాలి. ఇక మిర్చి రైతుల గోడు వినేవారే కరువ య్యారు. జిల్లాలో ధాన్యం తర్వాత ఉద్యాన పంట అయినా మిర్చి వైపు అన్నదాతలు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. కేంద్రం మద్దతు ధర ఇవ్వని పంటలకు తన ప్రభుత్వం ఇస్తుందని జగన్ చెప్పిన మాటలను ఎన్నికల వేళ సీఎంకు రైతులు గుర్తు చేస్తున్నారు.

మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రమే...

జిల్లా ఆవిర్భావం తర్వాత మార్క్‌ఫెడ్ బాపట్లలో కొలువుదీరడానికే దాదాపు ఏడాది పట్టింది. వచ్చిన తర్వాత అయినా పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టిందా అంటే అదీ లేదు. ఏదో మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు తెరిచి మమ అనిపించడం మినహా అన్నదాతల నుంచి సేకరించిన దిగుబడులు తీసికట్టే. జిల్లాలో మినుము సాగు దాదాపు 50,000 హెక్టార్లలో అవుతుండగా, పెసర, శనగ కలిపి దాదాపు 35,000 హెక్టార్ల వరకు సాగు విస్తీర్ణం ఉంది. వీటికి తోడు జొన్న, మొక్కజొన్న, శనగ సేకరణ కూడా మార్క్‌ఫెడ్ బాధ్యతే. మద్దతు ధర మినుము క్వింటాలకు రూ.6,950 ఉండగా, పెసర క్వింటాకు రూ.8,558గా ఉంది. సాగైన విస్తీర్ణంతో పోల్చుకుంటే మొక్కజొన్నతో కూడా కలుపుకుని కనీసం 30,000 టన్నులైనా మార్క్‌ఫెడ్ సేకరించాల్సి ఉంటుంది. కానీ ఈ రెండేళ్లలో మార్క్‌ఫెడ్ పట్టుమని పదివేల టన్నులైనా సేకరించిన దాఖలాలు లేవు. దిగుబడులు దాదాపు లక్ష మెట్రిక్ టన్నులపైన ఉంటే మార్క్‌ఫెడ్ విధించుకునే సేకరణ లక్ష్యాలు పదిశాతం లోపే. దానిని చేరడానికి కూడా ఆపసోపాలు పడే పరిస్థితి ప్రభుత్వానిది.

రకరకాల సాకులు

మద్దతు ధర విషయంలో అన్నదాతలకు జరుగుతున్న అన్యాయం విషయంలో ప్రభుత్వం ఏవో కుంటిసాకులు చెబుతూనే వస్తోంది. ఆర్బీకేలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనే మార్క్‌ఫెడ్ మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోతున్నాయి. ఏదో మొక్కుబడిగా ఒకటిరెండు రోజులు ఏర్పాటు చేయడం తర్వాత సర్దేయడం రివాజుగా మారింది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల మద్దతు ధరకు అమ్ముకోవడానికి అన్నదాతలు ఆసక్తి చూపించడం లేదని చెబుతారు. ఇది కొంతమేర వాస్తవమే అయినప్పటికీ సమాంతరంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరచి ఉంటేనే బయటి మార్కెట్‌లో ధర స్థిరంగా ఉంటుందనే ప్రాథమిక సూత్రాన్ని కూడా మరచి అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఇక పత్తి కొనుగోలు విషయంలో సీసీఐది కీలక పాత్ర. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలో ప్రతినిధులెవరో, కార్యాలయమెక్కడో ఎవరికీ తెలియదు.

పర్చూరు జన జాతర



బొమ్మల సెంటర్‌లో మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసాద్

- ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి నామినేషన్
- జనసంద్రంగా మారిన బొమ్మల సెంటర్
- గజమాలతో స్వాగతం పలికిన జన సైనికులు

పర్చూరు, ఏప్రిల్ 22: కూటమి తరపున పర్చూరు అసెంబ్లీ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివచ్చాయి. డప్పు వాయిద్యాలు, మహిళా నృత్యాలతో పర్చూరు బొమ్మల సెంటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మార్టూరు మండలం ఇసుక దర్శి క్యాంపు కార్యాలయం నుంచి పర్చూరు వరకు సాగిన భారీ ర్యాలీలో గ్రామగ్రామాన ప్రజ లు ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. పర్చూరు చేరుకున్న ఏలూరి స్థానిక సాయిబాబా ఆల యంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం బొమ్మల సెంటర్‌కు చేరుకున్న ఏలూరికి జనసైనికులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావడంతో పర్చూరు బొమ్మల సెంటర్ కిక్కిరిసిపోయింది. మండుటెండను కూడా లెక్కచేయకుండా గంటల తరబడి నిరీక్షించిన జనం ఏలూరిపై అభిమానం చాటుకున్నారు. ఏలూరి సాంబశివరావు, బాపట్ల లోక్‌సభ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కూడలిలో జరిగిన బహిరంగ సభలో ఏలూరి మాట్లాడుతూ జగన్ అక్రమ సంపాదన కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. జగన్ దుర్మార్గపు పాలనలో ప్రజాప్రతినిదులు కూడా దాచుకో దోచుకో అన్నట్లుగా మారిపోయారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానని యువ తను మోసం చేసిందని, దీంతో ఉద్యోగాలు లేక యువత కూలీలు, ఆటో డ్రైవర్లుగా మారారన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టిందన్నారు. అరాచక విధ్వంస వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు.



జన సందోహంతో కిక్కిరిసిన పర్చూరు బొమ్మల సెంటర్

బాలికలదే హవా

పది ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

బాపట్ల టౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా చూపారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పది పరీక్షలకు సంబంధించి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో అబ్బా యిల కంటే అమ్మాయిలే ఉత్తీర్ణతలో ముదు ఉన్నారు. గుంటూరు జిల్లా నుంచి 27,178 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 23,955 మంది (88.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాపట్ల జిల్లా నుం చి 16718 మంది హాజరు కాగా 14,743 మంది (89.19 శాతం) సాధించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 11 శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాలో అబ్బాయిలు 86.32, అమ్మాయిలు 91.11 శాతం ఉత్తీ ర్ణత సాధించారు. గుంటూరు జిల్లాలో అబ్బాయిలు 86.46, అమ్మాయిలు 89.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు 14వ స్థానం దక్కింది. పల్నాడు జిల్లా నుంచి 24,959 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 21,477 మంది (86.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

అయ్యో హనిమిరెడ్డి

- జనం లేక కళ తప్పిన నామినేషన్
- ముందస్తు ప్రచారం చేసినా స్పందన కరువే



ర్యాలీలో తక్కువగా ఉన్న వైసీపీ శ్రేణులు

అద్దంకి/బాపట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని ఏరులై పారించారు.. పెద్దఎత్తున నగదూ పం చారు.. ముందస్తుగా భారీగా ప్రచారం చేశారు.. అయినా కనీస స్థాయిలో కూడా జనం లేక అద్దంకి వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి నామినేషన్ ర్యాలీ వెలవెలబోయింది. సోమవారం ఆయన నామినేషన్ దాఖ లు సందర్భంగా సొంత పార్టీ శ్రేణుల నుంచే మద్దతు కరువైంది. ఓ దశలో సింగరకొండ దేవస్థానంలో పూజలు పూర్తయ్యాక జనం లేక ఆయన కాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సమాచారం. గ్రామస్థాయిలో జనసమీకరణ చేపట్టే నాయకులే కరువవడంతో నామినేషన్ కార్యక్రమానికి కనీస స్థాయిలో స్పందన లేకుండా పోయింది. భారీ ర్యాలీతో నామినేషన్ వేయనున్నట్లు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించినా కేడర్ అంతంతమాత్రంగానే హాజరైంది. నియోజకవర్గం మొత్తం నుంచి వైసీపీ శ్రేణులు భారీగా హాజరవుతారని భావించినా తక్కువగా వచ్చారు. పట్టణంలోకి ప్రవేశించే సమయానికి కొంత మేర కేడర్ చేరింది. అనంతరం హనిమిరెడ్డితో పాటు ఆయన సతీమణి ఆదిలక్ష్మి నామినేషన్ వేశారు. ర్యాలీలో ఎంపీ అభ్యర్థి సురేష్, వైవీ భద్రారెడ్డి, మారం వెంకారెడ్డి, కాకాని రాధాకృష్ణమూర్తి, కోట శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

అయిష్టంగానే బరిలో...

అద్దంకి నుంచి పోటీలో ఉండడంపై ఓదశలో హనిమిరెడ్డి చేతులెత్తేశారన్న ప్రచారం గతంలో జరిగింది. తాడేపల్లి పెద్దల సర్దుబాటుతో ఆయన అయిష్టంగానే పోటీకి సిద్ధమై సోమవారం నామినేషన్ వేసినట్లు తెలిసింది. హనిమిరెడ్డి వ్యవహారశైలిపై అసంతృప్తితో ఇప్పటికే ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు పార్టీకి దూరం జరిగారు. ఈ ఫలితమే పెద్దఎత్తున డబ్బు ఖర్చు పెట్టినా కనీస స్థాయిలో కూడా నామినేషన్‌కు జనం హాజరుకాలేదని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం.



పర్చూరులో ర్యాలీ సందర్భంగా కిక్కిరిసిన రోడ్డు

ఉరూవాడా కదిలింది

గతం కన్నామూడింతలు పెరిగిన జనసందోహం

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి శిబిరంలో ఆనందోత్సాహాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజాదరణ భారీగా పెరిగింది. అందుకు సోమవారం ఆయన నామినేషన్ కార్యక్రమం సందర్భంగా దారిపొడవునా గ్రామగ్రామానా ప్రజలు ఎదురేగిఆశీర్వదించడం, చివరకు పర్చూరుకు అశేష జనవాహిని తరలిరావడం దర్పణం పడుతోంది. అందుకు ఆయన నిత్య ప్రజాసంబంధాలు, సేవా కార్యక్రమాలతోపాటు ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై పెరిగిన వ్యతిరేకత మరో కారణంగా భావిస్తున్నారు. జనసేన, బీజేపీల మద్దతు కూడా ఇంకో కారణం. వీటన్నింటికీ మించి ఇటీవల కాలంలో వైసీపీ నుంచి, అలాగే తటస్త వాదులు పోలోమని టీడీపీలో చేరడం కూడా ఇంకో కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మార్టూరుకు సమీపంలోని ఇసుక దర్శి వద్ద ఉన్న తన క్యాంపు కార్యాలయంలో నుంచి సోమవారం ఉదయం నామినేషన్ వేసేందుకు బయలుదేరిన ఎమ్మెల్యే సాంబశివరావు పర్చూరు చేరే సరికి మధ్యాహ్నం అయింది. అక్కడ బొమ్మల సెంటరలో ఆశీర్వదించడానికి వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఆ తర్వాత మండలరెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. బొమ్మలసెంటర్ నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న కార్యాలయం వరకు ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. బొమ్మలసెంటర్‌లో ఆయన నామినేషన్ ప్రక్రియ దృశ్యాలను చిత్రీకరించేందుకు వచ్చిన మీడియా ప్రతినిధులు అంత జనాన్ని దాటుకుని వెళ్లే లోపు రెవెన్యూ కార్యాలయంలో ఏలూరి నామినేషన్ వేయడం పూర్తవడం గమనార్హం. నియోజకవర్గం మొత్తంగా చూస్తే ఊరూవాడా కదిలింది అన్నట్లుగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు ఈ కార్యక్రమానికి రావడం కనిపించింది. ప్రతి గ్రామంలోనూ కార్యక్రమానికి తరలివచ్చే కూటమి పార్టీల శ్రేణులు, ఏలూరి అభిమానులకు గ్రామంలో మిగిలిన వారు మద్దతు పలుకుతూ వారిని సాగనంపడం విశేషం. ఆ రకంగా చూస్తే కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారికన్నా రెట్టింపు సంఖ్యలో ప్రజలు వచ్చినట్లు కనిపిస్తుంది.

ముచ్చటగా మూడోసారి

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన మూడో సారి నామినేషన్ దాఖలు చేశారు. మూడు పర్యాయాలు ప్రజలతో కలిసివెళ్లి నామినేషన్ వేశారు. తొలి సారి రాజకీయ ఆరంగేట్రం చేసిన మొదటిసారి, రెండో సారి అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి నామినేషన్ వేశారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా నామినేషన్‌వేశారు. విశేషమేమిటంటే ఆ రెండు పర్యాయాలు కన్నా ఇప్పుడు మూడింతలకుపైగా ప్రజలు ఆయన నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజలు అలా వచ్చి- ఇలా వెళ్లకుండా ర్యాలీలో ఆయనతో సాగడం, సభలో ఆయన ప్రసంగానికి చేతులెత్తి జేజేలు పలపకడం కనిపించింది. దీంతో నియోజకవర్గంలో ఇటీవల అటు వైసీపీతోపాటు తటస్తవాదులు ఆయా వర్గాల ప్రముఖులు భారీగా టీడీపీలో చేరిన విషయాన్ని విశ్లేషకులు వ్యక్తీకరిస్తున్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలతోపాటు వైసీపీకి గుడ్‌బై చెప్పి మైనార్టీలు, కాపు, రెడ్డి సామాజిక వర్గాల వారు ఏలూరి సమక్షంలో ఇటీవల టీడీపీలో అధికంగా చేరారు. ఈ చేరికల ప్రభావమే కాబోలు నియోజకవర్గంలో టీడీపీ పట్టు భారీగాపెరిగిన విషయాన్ని ఈ కార్యక్రమం తేటతెల్లం చేసిందని అంచనావేస్తున్నారు.

ఏం మాయోపాయం...

బాలినేని నామినేషన్ కోసం నీటి సరఫరా బంద్



ఒంగోలు (కార్పొరేషన్) ఏప్రిల్ 22 : వైసీపీ అధికార పెత్తనం శృతి మించుతుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, మరో ఇరవై రోజుల్లో పోలింగ్ జరగనుండగా ఆ పార్టీ నేతల కనుసన్నల్లోనే పాలన నడుస్తోంది. సోమవారం ఒంగోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలినేని శ్రీనివాస రెడ్డి నామినేషన్ దాఖలు చేయనుండగా, అందు కోసం భారీగా జనసమీకరణ చేశారు. ఆ కార్యక్రమం విజయంతం చేయడం కోసం ప్రతి డివిజన్ నుంచి 250 మందిని జనసమీకరణ చేయగా, ఒకొక్కరికీ రూ.300 ముట్టజెప్పారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా కానుంది. ఈ కారణంగా మహిళలు నామినేషన్ కార్యక్రమానికి హాజరుకారని తెలుసుకున్న వైసీపీ నేతలు కుయుక్తి పన్ని నీటి సరఫరాను ఒకపూట బంద్ చేయించారు. కార్పొరేషన్ అధికారులు కూడా స్వామి భక్తిని ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు అతిక్రమించి మధ్యాహ్నం 12-30 వరకు నీటిని విడుదల చేయలేదు. ఆ తర్వాత నీటిని సరఫరా చేయగా, మండుటెండలో ప్రజలు తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి ఎదురైంది.

మారిన అభ్యర్థులు

ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్యాండెట్ల మార్పు

పెండింగ్‌లో కొండపి



ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 22 : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ షర్మిలారెడ్డి కనిగిరి, ఒంగోలు అభ్యర్థులను మార్పుచేసి బీఫాంలు అందజేశారు. ఒంగోలు అభ్యర్థిగా తొలుత బుట్టి రమేష్ బాబును, కనిగిరి అభ్యర్థిగా కదిరి భవానీని ప్రకటించారు. సోమవారం జిల్లాకు వచ్చిన షర్మిలా రెడ్డి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దాసరి నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి సుబ్బారెడ్డికి బీఫాంలు అందజేశారు. ఇప్పటివరకు ప్రచారం చేసుకొని నామినేషన్లు దాఖలు చేసిన రమేష్‌బాబు, భవానీలు ఆవేదనకు గురయ్యారు. అదేవిధంగా కొండపి అభ్యర్థిగా శ్రీపతి సతీష్‌ను ప్రకటించినప్పటికీ బీఫాం పెండింగ్‌లో పెట్టారు. అక్కడ కూడా అభ్యర్థిని మార్పు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అక్కడ పసుమర్తి సుధాకర్‌కు టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. జిల్లాలో అనుహ్యంగా జరిగిన మార్పులతో క్యాడర్ కాస్త డీలాపడ్డారు.

ఆనాటి ముచ్చట

అప్పట్లో ఆత్మీయ పోటీ



చప్పిడి వెంగయ్య



నాగార్జునరెడ్డి

కంభం, ఏప్రిల్ 22 : ప్రస్తుతం జరుగుతున్న శాసన సభ ఎన్నికలకు, ముప్పై ఏళ్ల క్రితం జరిగిన ఎన్నికలకు, ఇరు పార్టీల తరపున అభ్యర్థుల ఎంపికకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. నాడు ఆయా పార్టీల అధిష్టానం అభ్యర్థుల గుణగణాలు, రాజకీయ నేపథ్యం చూసి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేవారు. ఎంత డబ్బు ఖర్చు పెడతాడని ఆలోచించేవారు కాదు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అభ్యర్థి ఎన్ని కోట్లు ఖర్చు పెడతాడు, పార్టీ ఫండ్ ఎన్ని కోట్లు ఇస్తాడన్నదే ప్రధాన అంశంగా మారింది. 1952లో కంభం నియోజకవర్గం ఏర్పడినా.. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత ప్రధానంగా కాంగ్రెస్, టీడీపీల మధ్యే పోటీ నడిచింది. 1994 ఎన్నికల్లో టీడీపీ తరపున చప్పిడి వెంగయ్య, కాంగ్రెస్ తరపున కందుల నాగార్జునరెడ్డి పోటీలో ఉన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలే గ్రామాల వారీగా చందాలు వసూలు చేసి అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. రాజకీయంగా ప్రత్యర్థులే గాని ఇరువురూ కలుసుకుంటే కుశల ప్రశ్నలు వేసుకుని మాట్లాడుకొనే వారు. 1994 ఎన్నికల ప్రచారంలో భాగంగా కొనకనమిట్లలో ఒకరికొకరు ఎదురైనప్పుడు జరిగిన అంశాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. **టీడీపీ అభ్యర్థి చప్పిడి వెంగయ్య ఎదురు పడగానే కాంగ్రెస్ అభ్యర్థి కందుల నాగార్జునరెడ్డి 'మామా ఈ ఎన్నికల్లో నేను గెలిచేలా ఆశీర్వదించండి..' అని కోరగా 'అలాగే లేవోయ్ ప్రజలు ఎవరిని ఆశీర్వదిస్తారో వారికి గెలుపు ఖాయమని' సరదాగా మాట్లాడుకున్నారని చెబుతారు.** ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చప్పిడి వెంగయ్య విజయం సాధించారు.

ప్రజలా?....రాజకీయ కూలీలా?

నగదు, మందు, బిర్యానీ నజరానాలతో కూలీలకు ఎర

మేస్త్రీలతో ఒప్పందాలు, పోలీసుల ఒత్తిడి

అయినా వైసీపీ ర్యాలీకి కానరాని స్పందన



ర్యాలీ ప్రారంభం కాకముందే వెనుతిరిగి వెళుతున్న మహిళలు

మార్కాపురం, ఏప్రిల్ 22 : రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం దినసరి కూలీలను రాజకీయ కూలీలుగా మారుస్తున్నారు. జిల్లాలో కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మార్కాపురం డివిజన్ ఉంది. ఇక్కడి ప్రజల అవసరాలను డబ్బున్న రాజకీయ నాయకులు గుర్తించి తమ ప్రచారానికి వినియోగించుకుంటున్నారు.

అధికార వైసీపీపై నానాటికీ తగ్గుతున్న ఆదరణను చూసి నాయకులు భయపడుతున్నారు. ఏ కార్యక్రమాలు చేసినా ప్రజల నుంచి స్పందన ఉండటం లేదు. దీంతో ప్రజల ఆర్థిక అవసరాలను అవకాశాలుగా చేసుకొని వారి కార్యక్రమాలను విజయవంతం చేసుకునేందుకు ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇందుకు మార్కాపురంలో సోమవారం వైసీపీ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు నామినేషన్ సందర్భంగా నెలకొన్న ఘటనలే మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

డబ్బు, మందు, బిర్యానీ ఏర్పాటు

వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు నామినేషన్ సందర్భంగా పట్టణంలోని కళాశాల రోడ్డులోని సెవన్ హిల్స్ లాడ్జి నుంచి కంభం కూడలి వరకూ భారీ ప్రదర్శన ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రత కారణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రారని సందేహించారు. దీంతో ప్రజలను రాజకీయ కూలీలుగా మార్చేశారు. సాధారణంగా పట్టణంలోని శివారు కాలనీలైన డ్రైవర్స్‌కాలనీ, భగత్ సింగ్ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ వంటి చోట్ల దినసరి కూలీలు నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లు, ముఠా మేస్త్రీలను సంప్రదించారు. కూలీలను ర్యాలీకి హాజరు పరిచే విధంగా ఒప్పందాలు చేసుకున్నారు. మగవారికి మందు, బిర్యానీ, ఆడ వారికి రూ.300 ఇచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. మందు వద్దన్న మగ వారికి రూ.200 నగదు ఇస్తారు. ఇందుకుగాను మేస్త్రీకి రూ.100 కమిషన్ ఇవ్వాలి. ఈ విధంగా పట్టణంలోని శివారు కాలనీల నుంచి సుమారు 5000 మంది రాజకీయ కూలీలను నామినేషన్ ర్యాలీకి తరలించేందుకు ప్రణాళికలు అమలులో పెట్టారు. అందులో భాగం 7వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కొత్త కృష్ణ తన వార్డులోని వారికి డబ్బులు పంచుతూ కెమెరాలకు అడ్డంగా దొరికిపోయాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది.



వెనుతిరిగిన కూలీలు

- విశ్వాసం ప్రదర్శించిన పోలీసులు

వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే రాజకీయ కూలీలు వెనుతిరిగారు. ఒప్పందం కుదుర్చుకున్న మేస్త్రీలు, ద్వితీయ శ్రేణి నాయకులను తిట్ల దండకంతో దీవించడం అడుగడుగునా కనబడింది. ఇళ్లకు వెనుతిరిగి వెళుతున్న కూలీలను మార్కాపురం సీఐ అవుల వెంకటేశ్వర్లు వెనక్కు పంపి ర్యాలీ విజయవంతం చేసే ప్రయత్నం చేశారు. అయితే తమకు డబ్బులు ఇవ్వకుంటే పోలీసులు చెప్పినా వినేది లేదంటూ ఇళ్లకు వెళ్లి పోయారు. మూహర్తం ప్రకారం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అన్నా రాంబాబు తర్వాత ర్యాలీలో పాల్గొన్నారు. అప్పటికే రాజకీయ కూలీలందరూ వెళ్లిపోయారు.

ఇళ్లకు వెళుతున్న వారిని ర్యాలీకి పంపుతున్న సీఐ అవుల వెంకటేశ్వర్లు



రాజకీయ సిత్ర విసిత్రాలు

వచ్చామా.. తిన్నామా.. వెళ్లామా?

- భోజనం చేసి వెళ్లిపోయిన జనం
- సురేష్ సభకు ఖాళీగా కుర్చీలు
- మీడియా ఏమైనా రాసుకోండన్న సురేష్



మంత్రి సురేష్ మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం, ఖాళీగా కుర్చీలు

కొండపి, ఏప్రిల్ 22 : మంత్రి నామినేషన్ కార్యక్రమం ఉంటుందని అట్టహాసంగా ప్రచారం చేశారు. భారీగా జనం వస్తారు.. బహిరంగ సభ అదిరిపోయేలా ఉంటుందని నేతలు సంబరపడిపోయారు.. అనుకున్నట్లుగానే మంత్రి నామినేషన్ కార్యక్రమానికి వాహనాల్లో జనం చేరుకున్నారు. ఉదయం 12.30 గంటల నుంచే.. వచ్చిన వాళ్లు వచ్చినట్లు భోజనం చేసి తిరిగి వచ్చిన వాహనంలోనే వెనుదిరిగిపోయారు. జనం సభ చూసేందుకు ఆసక్తి కనబరచలేదు. వేదిక మీద నుంచి నాయకులు జనం కూర్చోవాలని, మంత్రి సురేష్ వస్తున్నారని మైకులో పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా జనం ఖాతరు చేయలేదు. వేదిక ముందు తొలి పది వరుస సీట్లలో కూడా కూర్చోలేదు. సింగరాయకొండ నుంచి ర్యాలీగా వచ్చిన మంత్రి జరుగుమల్లి మండలంలోని కొన్ని గ్రామాల వారిని కలుపుకుంటూ కొండపి వచ్చారు. తొలుత నామినేషన్ వేశాక టంగుటూరు రోడ్డులోని పొగాకు వేలం కేంద్రం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన సభా స్థలికి వచ్చారు. సభ 3 గంటల తర్వాత ప్రారంభమైంది. అప్పటికే గ్రామాల నుంచి వచ్చినవారు తిరిగి తమ వాహనాల్లో వెనుదిరిగి వెళ్లిపోయారు. సభా స్థలం వద్ద ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. మీడియా ఏదైనా రాసుకోండి. ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కొండపి ఎమ్మెల్యేగా తాను గెలిచి జగనన్నకు కానుకగా అందిస్తామని ముక్తసరిగా ముగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు. మండలాల నాయకులు పాల్గొన్నారు.

చెరువుకు సాగర్ నీరిచ్చి ఓట్లు అడగండి

ఫ్లెక్సీలు కట్టిన పొట్లపాడు గ్రామ యువత



కురిచేడు, ఏప్రిల్ 22 : కురిచేడు మండలం పొట్లపాడు గ్రామ యువత తమ చెరువుకు నీరిచ్చి మాత్రమే ఓట్లు అడగాలని ఫ్లెక్సీలు కట్టారు. గ్రామానికి నీటిని అందించే పెద్ద చెరువుకు సాగర్ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసి, అక్కడ నుంచి మండలంలోని 24 గ్రామాలకు నీరందంచేలా రూ.12 కోట్లతో మంచినీటి పథకం ఏర్పాటుచేశారు. పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలతో పథకం ప్రారంభానికి నోచుకోకముందే మూలనపడింది. దీంతో చెరువు పాడైంది. దీంతో రూ.12 కోట్ల ప్రజాధనం వృథా అయింది. ఈవిషయంలో పొట్లపాడు యువత, గ్రామస్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రతి ఎన్నికలలో గ్రామస్థులు చెరువుకు నీరు అందించేలా చూడాలని నాయకులకు విజ్ఞప్తి చేసున్నా ఫలితం లేదు. తాజా ఎన్నికలలో గ్రామ యువత ఈ విషయంపై దృష్టి పెట్టింది. గ్రామానికి సాగర్ కాలువ నుంచి నీటిని అందించి ఓట్లు అడగాలంటూ పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కురిచేడు - దొనకొండ ప్రధాన రోడ్డుపై, గ్రామ కూడలిలో, గ్రామంలోకి వచ్చేదారిలో మూడు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

కొండపి గెలుపే నా ఊపిరి

స్వామికి హ్యాట్రిక్ విజయమే నా ఆఖరి కోరిక

కేన్సర్‌తో బాధపడుతూ ప్రచారంలో పాల్గొన్న పాలుగుండ్ల నరసింహారెడ్డి



స్వామిని గెలపించాలని కోరుతున్న కేన్సర్ రోగి, నేత నరసింహారెడ్డి

మర్రిపూడి, ఏప్రిల్ 22 : కేన్సర్ మహమ్మారితో బాధపడుతూ తీవ్ర అనారోగ్యంతో ఉన్నా ఆయనలో తెలుగుదేశం పార్టీపై అభిమానం ఏమాత్రం తగ్గలేదు. కొండపి నుంచి టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్వామి తమ గ్రామానికి ప్రచారానికి వచ్చారని తెలియడంతో ఆయనలో ఎక్కడా లేని ఆనందం, ఉత్సాహం వచ్చింది. ఎండను సైతం లెక్కచేయకుండా స్వామితో కలిసి ప్రచారంలో పాల్గొని పార్టీపై తన కున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనే అంకేపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాలుగుండ్ల వెంకటనరసింహారెడ్డి(75). రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆయన 40 ఏళ్లుగా టీడీపీలోనే ఉన్నారు. మర్రిపూడి మండల కార్యదర్శిగా, టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడిగా, అంకేపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రసుత్తం ఆయన తీవ్ర కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అనారోగ్యంతో ఉన్నా గ్రామంలో స్వామి ప్రచారం సందర్భంగా ఆయన వెంట పాల్గొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచార వాహనంపై నుంచి మాట్లాడారు. నా ఆరోగ్యం బాగాలేకపోయినా టీడీపీపై అభిమానంతో వచ్చానని, ఇది తన ఆఖరి కోరిక అని, స్వామిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, హ్యాట్రిక్ విజయం అందించాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, నియోజవకర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, నాయకులు నేరెళ్ల శ్రీనివాసులు, ఎం. సుధాకర్‌రెడ్డి, రెడ్డయ్య, వనిపెంట కొండారెడ్డి, కొండా కోటిరెడ్డి, మలసాని కోటేశ్వరరావు, మలసాని నాగేశ్వరరావు, మోహన్‌రావు, బూదాల ఏసుదాస్, గురుబ్రహ్మం, నరసయ్య, దాసు పాల్గొన్నారు.

ఆంక్షలు జనానికే.. అధికార పార్టీ వారికి కాదు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ ప్రాంతంలో అధికారుల అస్తవ్యస్త నిబంధనల వల్ల సామాన్యులను కష్టాలు వెంటాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆ ప్రాంతంలో సామాన్య ప్రజానీకం రాకపోకలను నిలిపివేశారు. ఏదైనా అత్యవసరంగా ఆ ప్రాంతం వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ట్రంకురోడ్డు సమీపంలోని హెచ్‌సీఎం కళాశాల వద్ద, మునిసిపల్ కార్యాలయం పైభాగాన, ఇటు నెల్లూరు బస్టాండు ప్రాంతంలో భారీ గేడ్లు ఏర్పాటు చేయడంతో ప్రజానీకం ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతుండగా అధికార పార్టీ నేతలు మాత్రం ఏ సమయంలోనైనాఎక్కడికైనా వెళ్లేందుకు మాత్రం అనుమతులు ఇస్తున్నారు. ఒంగోలులో సోమవారం మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలోకి ఐదుగురిని అనుమతించినప్పటికి ఆ ప్రాంతంలో దజన్లకొద్ది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రావడంపై పలు ఆరోపణలువ్యక్తం అవుతున్నాయి. అదే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఆ విధంగావస్తే ఊరుకుంటారా అన్నప్రశ్న సామాన్య ప్రజానీకంనుంచి తలెత్తుతున్నది.



ర్యాలీగా వస్తున్న బాలినేని



నామినేషన్ సందర్భంగా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రణీత్‌రెడ్డి

పరారే.. పరారే..!

బాలినేని నామినేషన్‌లో ఎండ తీవ్రతకు పరుగులుపెట్టిన జనం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం దాఖలు చేసిన నామినేషన్ ర్యాలీలో జనం అష్టకష్టాలు పడ్డారు. ఎండ తీవ్రత దెబ్బకు జనం పరుగులు పెట్టారు. నగరంలో ర్యాలీ కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు, పాత మార్కెట్ సెంటర్ మీదుగా ట్రంకురోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎండ తీవ్రతతో ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజానీకం మధ్యలోనే ఇళ్లకు పరుగులు పెట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సందులుగొందుల్లో నుంచి జారుకున్నారు. నామినేషన్‌కు వైసీపీ నాయకులు ఊహించిన స్థాయిలో ప్రజానీకం రాకపోవడంతో ముఖ్యనేతల్లో అసహనం వ్యక్తమైంది. ర్యాలీలో ఏర్పాటుచేసిన వాహనంపై వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాతతో పాటు పలువురు ఉన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు డబ్బులు పంపిణీ

ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు డబ్బులు పంపిణీ చేయడం కనిపించింది. ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున ఇచ్చినట్లు సమాచారం. ఒంగోలు నగరంతో పాటు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల నుంచి వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి డబ్బులు కూడా పంపిణీ చేశారు.



ర్యాలీ మధ్య నుంచే వెళ్తున్నజనం



తిమ్మాయపాలెంలో పథకాలను వివరిస్తున్న గొట్టిపాటి

గుండ్లకమ్మ ఇసుకతో వైసీపీ నేతల వ్యాపారం


● టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 22 : గుండ్లకమ్మ నదిలోని ఇసుకను అక్రమంగా తవ్వి వైసీపీ నేతలకు వ్యాపారం చేస్తున్నారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెంలో సోమవారం రాత్రి గొట్టిపాటి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందన్నారు. ఐదేళ్లలో ఇసుక తవ్వకాల ద్వారా జగన్‌రెడ్డి రూ.40వేల కోట్లను దోసుకున్నారన్నారు. ఇసుక ధరను ఇష్టానుసారం పెంచి సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు జగన్ తీరని ద్రోహం చేశారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్‌ల విషయంలో, గులకరాయి విషయంలో జగన్ డ్రామాలను ప్రజలు ఛీకొట్టారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, యువత బంగారు భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలిసిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, పరిటాల పవన్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏ ఒక్క హామీని నెరవేర్చని జగన్ రెడ్డి

● టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్దన్

సంతమాగులూరు, ఏప్రిల్ 22 : జగన్‌రెడ్డి మైనారిటీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. మళ్లీ గెలిచేందుకు కూటమిపై విషప్రచారం చేస్తున్నారని, జగన్‌రెడ్డి మాటలు ముస్లింలు నమ్మొద్దని కోరారు. ప్రజలంతా విజ్ఞతతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గాడిపర్తి వెంకట్రావు, ఏసోబు, రమేష్, వాసిరెడ్డి, ఏడుకొండలు, రామారావు, శ్రీరామమూర్తి, కోటేశ్వరరావు, గురుయాదవ్ సుజాత, కృష్ణ, రామాంజి, మురళి, అంకమ్మరావు పాల్గొన్నారు.



లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర నేతలు

సమస్యలు పరిష్కరించండి

● లోకేష్‌కు రేషన్ డీలర్ల సంఘ నేతల విజ్ఞప్తి

అద్దంకి, ఏప్రిల్ 22 : రేషన్ డీలర్ల సమస్యలు పరిషరించి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయానలి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రేషన్ డీలర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు ఉండవల్లిలో రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు ఎల్.మాధవరావు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డీలర్లకు నెలకు రూ.7500 గౌరవవేతనం ఇవ్వాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ డీలర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. గౌరవవేతనం తెలంగాణ కంటే అధికంగా ఇస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ సెక్రటరీ పిన్నింటి గోపీకృష్ణ, గంగాధర్‌గౌడ్, బోడపాటి ఫణికుమార్ తదితరులు లోకేష్‌ను కలిశారు.

5వ రోజు 9 నామినేషన్లు దాఖలు

చీరాల, ఏప్రిల్ 22 : ఎన్నికల వేళ నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. 5వ రోజు సోమవారం 9 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి సూరనారాయణరెడ్డి తెలిపారు. అందులో పలువురు ఆయా పార్టీల అభ్యర్థులు వారే స్వయంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కొందరివి వారి తరపువారు నామినేషన్లు దాఖలు చేశారు. స్వంతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. కరణం వెంకటేష(యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), కరణం బలరామకృష్ణమూర్తి(యవువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, ప్రత్యామ్నాయం), శ్రీనివాసరావు పోలిశెట్టి (స్వతంత్ర), కాటి మార్క్ (బహుజన్ సమాజ్ పార్టీ), తన్నీరు విజయ్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా), తేళ్ల రాంబాబు (స్వతంత్ర) వారే స్వయంగా నామినేషన్ పత్రాలు ఆర్వోకు అందజేశారు. మద్దులూరి మాలకొండయ్య (తెలుగుదేశం పార్టీ) బాలకొండమ్మ మద్దులూరి (తెలుగుదేశం పార్టీ, ప్రత్యామ్నాయం), ఆమంచి కృష్ణమోహన్ (కాంగ్రెస్)కు వారి ప్రతినిధులు నామినేషన్ పత్రాలు ఆర్వోకు అందజేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వారివారి పేరు బలాల ప్రకారం మంచి ముహూర్తాల రోజు, సమయాలలో బలనిరూపణలతో మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారని పార్టీల వర్గాలు తెలిపాయి.

అద్దంకి : భారత చైతన్య యువజన (బీసీవై) నుంచి అద్దంకికి చెందిన మీసాల సామ్రాజ్యం అద్దంకి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. సోమవారం ఆమె బీఫాం అందుకున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) చికిత్స పొందుతున్న స్నేహలతారెడ్డి

కాటేసిన మృత్యువు

● స్కూటీని ఢీకొన్న లారీ

● అమ్మమ్మ మనవరాలు మృతి ● చికిత్స పొందుతున్న కుమార్తె

వేటపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 22 : చినగంజాంలో బంధువుల శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న వారిపై ఒక్కసారిగా గుర్తుతెలియని వాహన రూపంలో మృత్యువు కాటేసింది. వివరాల్లోకి వెళితే బాపట్లకు చెందిన స్నేహలత తన కుమార్తె (2సం.), తల్లి బద్దు సుబ్బరావమ్మ (55)ను స్కూటీపై సోమవారం చినగంజాంలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి తీసుకువెళ్లింది. బంధువులతో సంతోషంగా గడిపి రాత్రి సమయంలో తిరిగి జాతీయ రహదారి మీదుగా బాపట్లకు వెళుతున్నారు. లక్ష్మీపురం సమీపంలో గుర్తుతెలియని లారీ వీరిని ఢీకొంది. ప్రమాదంలో రెండేళ్ల కుమార్తె, తల్లి అక్కడికక్కడే మృతిచెందగా స్నేహలత రెడ్డి గాయాలతో కొట్టుమిట్టాడుతోంది. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రురాలిని చీరాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్ల సభలు వెలవెల

వైసీపీ అభ్యర్థుల మాటలు వినేందుకు జనం ఇష్టపడని వైనం

డబ్బులు ఇచ్చారు.. ఇలా వచ్చి, అలా వెళ్లారు

మూడు గంటలకు, రూ.300 నుంచి రూ.500 ఇచ్చిన వైనం

జనం లేని సభలో మంత్రి సురేష్ అసహనం

ఎంపీ అభ్యర్థితో సహా ముఖ్యనాయకులు డుమ్మా

రాంబాబు కార్యక్రమానికి గిద్దలూరు వాసులు

కౌన్సిలర్లు డబ్బులు పంచినా కదలని జనం

ఒంగోలు ర్యాలీలో సగంలోనే శ్రేణులు మాయం

జనం జంప్!

అధికార వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, ఆరంభంలోనే బయటపడింది. అందుకు ఆ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలే నిదర్శనం. డబ్బులు, మద్యం ఇచ్చి, వాహనాలు పంపితే ఇలా వచ్చి అలా వెళుతున్నారే తప్ప నాయకుల కోసం వేచి ఉండటం లేదు. దీంతో నామినేషన్ల సందర్భంగా ఏర్పాటుచేసిన సభలు వెలవెలబోతున్నాయి. సోమవారం కొండపి, ఒంగోలు, మార్కాపురంలలో సురేష్, బాలినేని, అన్నా రాంబాబుల కార్యక్రమాలు చూస్తే పరిస్థితి అర్థమవుతోంది. అట్టహాసంగా నామినేషన్లు వేసినా వెలవెలపోయిన సభలతో వైసీపీ శ్రేణులు నీరసపడిపోయారు. మరోవైపు టీడీపీ అభ్యర్థులు వేలాదిమంది మధ్య సభల్లో మాట్లాడుతుంటే వైసీపీ వారు మాత్రం జనం లేని సభల్లో మాట్లాడలేక తూతూమంత్రంగా ముగిస్తున్నారు. ఒంగోలులో బాలినేని నామినేషన్ అనంతరం బయటకు వచ్చేసరికి జనం వెళ్లిపోగా ప్రసంగాలు లేకుండా మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. అయితే ఈ నామినేషన్ల సందర్భంగా భారీగా నగదు, లిక్కర్ పంపిణీతో హడావుడి చేయటం, కొండపిలో భోజనాల పెట్టినా ఫలితం దక్కలేదు.



మంత్రి సురేష్ మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం, ఖాళీగా ఉన్న కుర్చీలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్నికల సంగ్రామంలో భాగంగా ప్రధానపార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసే కార్యక్రమం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలో టీడీపీ పక్షాన కొండపి, వైపాలెం, అద్దంకి అభ్యర్థుల నామినేషన్లు పూర్తికాగా సోమవారం దర్శి, పర్చూరు అభ్యర్థులు భారీ జనసందోహం మధ్య నామినేషన్లు వేశారు. మిగిలిన అభ్యర్థులు రానున్న మూడు రోజుల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారు. అధికార వైసీపీలో ఇప్పటికి దర్శి, గిద్దలూరు అభ్యర్థులు ముందుగా నామినేషన్లు వేయగా సోమవారం అద్దంకి అభ్యర్థి నామినేషన్ వేశారు. నామినేషన్ల కార్యక్రమాల తీరుతెన్నులను పరిశీలిస్తే.. వైసీపీ అభ్యర్థులు డబ్బులతో అడపాదడపా జనాన్ని తీసుకొచ్చుకున్నా చివరివరకు ఉండి మిమ్మల్ని ఆశీర్వదించలేమన్న చందంగా వెళ్లిపోవటం చర్చనీయాంశమైంది.

మంత్రి సురేష్‌కు చుక్కెదురు

వైపాలెం, నుంచి బదిలీపై కొండపి వచ్చి పోటీచేస్తూ కులరాజకీయాలకు శ్రీకారం పలికిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు సోమవారం నామినేషన్ సందర్భంగా ప్రజల నుంచి చుక్కెదురైంది. నామినేషన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. మధ్యాహ్నానికే తిరిగి వెళ్లొచ్చని చెప్పి కూలీపనులకు వెళ్లిన వారికి కూలీ ఇచ్చి సమీకరించేందుకు ప్రయత్నాలు చేశారు. గ్రేడింగ్ కూలీలకు రూ.200, ఇతరులకు రూ.400 ప్రకారం ఆయా ప్రాంతాలకు డబ్బులు పంపారు. మగవారికి క్వార్టరు బాటిల్, అవి వద్దనుకుంటే రూ.150 ప్రకారం డబ్బులు కూడా ఇచ్చారు. ఎక్కడికక్కడ వాహనాలు ఏర్పాటు చేశారు. వీటికితోడు కొండేపిలో మంచి భోజనం అంటూ ప్రచారం చేశారు. సింగరాయకొండ నుంచి ర్యాలీగా వచ్చిన ఆయనకు మధ్యలో కలిసేవారు కలుస్తుంటే, ఆగిపోయేవారు ఆగిపోతూనే ఉన్నారు. తీరా నామినేషన్ వేసి సభావేదిక వద్దకు వచ్చేసరికి ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది. ఆయన ర్యాలీతో కొండపి వరకు వచ్చినవారు మధ్యలోనే జారిపోయారు. మిగిలిన కొద్దిమంది కూడా ఏర్పాటు చేసిన భోజనం చేసి తిరిగి వెళ్లిపోయారు. మొత్తంగా ర్యాలీ నుంచి సభ వరకు ఏదిచూసినా టీడీపీ అభ్యర్థి స్వామి నామినేషన్‌కు వచ్చిన వారిలో సగం మది కూడా లేరు. సభా వేదికను చూసిన సురేష్ అసహనానికి గురై మీడియా వారు ఏం రాసుకుంటారో రాసుకోండని



ఒంగోలులో వైసీపీ ర్యాలీ మధ్యలోనే వెళ్లిపోతున్న ప్రజలు

దండం పెట్టి రెండు ముక్కలతో ప్రసంగాన్ని ముగించారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి వచ్చి కూడా ముఖం కూడా చూపించలేదు. బయట నుంచి వచ్చిన ముఖ్యుల్లో ఎమ్మెల్సీ పోతుల సునీత మాత్రమే కనిపించారు. ఇక డాక్టర్ వెంకయ్య, జూపూడి ప్రభాకర్‌రావు లాంటి వారు గైర్హాజరయ్యారు. వేమూరులో పోటీలో ఉన్న అశోక్‌బాబు వద్దకు ఆయన అనుచరులు వెళ్లగా కొన్ని గ్రామాల నుంచే నాయకులు రావటం కనిపించింది. గ్రామసీమలతో నిండిన నియోజకవర్గంలో కుల రాజకీయాలకు శ్రీకారం పలికిన సురేష్ వైఖరితో అసంతృప్తిగా ఉన్న పలు సామాజికవర్గాల వారు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. చివరకు ఆయన ఆశించిన మాదిగ దండోరా వర్గం వారు నామమాత్రమే.

ఒంగోలులో నీటిసరఫరా బంద్.. మీడియాతో మాటలకే బాలినేని పరిమితం

ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి భారీ సమీకరణ ప్రయత్నాలు జరిగాయి. డబ్బు, మద్యం పంపిణీతోపాటు మధ్యాహ్నం వరకు మంచినీటి సరఫరా కార్యక్రమానికి బ్రేకు వేసినా ఆశించిన ఫలితం లభించలేదు. కొన్నిప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.400లు నుంచి రూ.500లు చొప్పున ఆయా డివిజన్ల బాధ్యులు చెల్లించి జన సమీకణకు ప్రయత్నం చేశారు. ఆటోలు, ఇతర వాహనాలను సమకూర్చారు. ఉదయం 10 గంటల సమయంలో ర్యాలీలో కనిపించిన ప్రజలు కలెక్టరేట్ వద్దకు వచ్చేసరికి మాయం అయ్యారు. నామినేషన్ అనంతరం లేదా ముందు వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడాల్సిన బాలినేనికి ప్రజలు ఆ అవకాశం ఇవ్వలేదు. ఆయన నామినేషన్ వేసి కలెక్టరేట్ వద్ద బయటకు వచ్చేసరికి జనం వెళ్లిపోయారు. మీడియా పాయింట్లో బాలినేనితోపాటు కొందరు స్థానిక నాయకులు మాట్లాడేందుకే పరిమితమయ్యారు. ఇంకా నగరంలోని ఆయా శివారు ప్రాంతాల నుంచి డబ్బులు ఇచ్చి లేక పార్టీలో ఉన్న శ్రేణులను సమీకరించటం కనిపించిందే తప్ప ఇతర వర్గాల వారి నుంచి స్పందన కరువైంది. వ్యాపార, ఉద్యోగ, హైస్థాయి, మధ్యతరగతి వారు కదలలేదు. మూడు ప్రధాన సామాజికవర్గాల వారు నివసించే ప్రాంతాల్లో సమీకరణకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయనే చెప్పవచ్చు. ర్యాలీకి వచ్చేవారికి ఇబ్బంది అవుతుందని నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉదయం 7.30కు ఇవ్వాల్సిన మంచినీటి సరఫరాను నిలిపివేసి మిట్టమధ్యాహ్నం 12 గంటల తరువాత ఇవ్వటం చర్చనీయాంశమైంది.

మార్కాపురంలో బహిరంగంగా డబ్బులు పంపిణీ

మార్కాపురంలో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నామినేషన్ కార్యక్రమం ప్రదర్శన చివర్లో సభాకార్యక్రమం కూడా తుస్సుమంది. మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్లు, కొందరు ముఖ్యనాయకులు, ఎక్కడికక్కడ డబ్బు పంచుతూ బాబు రండి, బాబు రండి అంటూ తిరగటం కనిపించింది. 7వ వార్డు కౌన్సిలర్ కృష్ణ డబ్బులు పంపిణీ చేస్తూ రండి బాబు రండి అంటూ కోరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. పట్టణంలో జనసమీకరణకు రూ.500 చొప్పున చెల్లించటం విశేషం. ముందుగానే నామినేషన్ పత్రాలు ఇచ్చేందుకు రాంబాబు ఎన్నికల అధికారి వద్ద కూర్చోగా బయట ర్యాలీ నిర్వహణలో నిబంధనలకు తూట్లు పొడిచారు. పోలీసులు చేతులెత్తేసి సహకరించగా కొద్దిపాటి ర్యాలీతో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు నరకం చూశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అన్ని ప్రాంతాల్లో మైకులు ఏర్పాటుచేసినా వినేందుకు కూడా జనం బయటకు రాలేదు. కాగా గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఆయన మద్దతుదారులు ఇక్కడకు వచ్చి పాల్గొనటం, హంగామా చేయటం స్పష్టంగా కనిపించింది. ఓ కల్యాణ మండపానికి ముందుగా కూలీ ఇచ్చిన మహిళలను సమీకరించి అక్కడ నుంచి తీసుకురావటం చర్చనీయాంశమైంది. నామినేషన్ అనంతరం గడియార స్తంభం సెంటర్లో జనం పెద్దగా కనిపించకపోవటంతో రాంబాబు తన ప్రసంగం అంతా ప్రత్యర్థి కందులపై విమర్శలు చేసేందుకే పరిమితమైంది. నియోజకవర్గంలో రాంబాబు సామాజికవర్గం ఓటర్లలో అత్యధిక భాగం ఆరంభం నుంచి టీడీపీతో ఉన్నారు. కులపరంగా వారిని ఆకర్షించేందుకు రాంబాబును గిద్దలూరు నుంచి మార్చారనే ప్రచారం ఉంది. అయితే రాంబాబు కులపరమైన ప్రలోభాలు చెల్లవంటూ మాట్లాడటం ఆ పార్టీశ్రేణుల్లోనే చర్చనీయాంశంగా మారింది. ఒంగోలు నుంచి కొండపి వెళ్లకుండా నేరుగా మార్కాపురం వచ్చిన ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరెడ్డి జగన్ కోసం ఓట్లేయండంటూ ఏక వాక్యంతో దండంపెట్టి ప్రసంగం ముగించేశారు.

అసెంబ్లీ మారితే అవినీతి పోతుందా?

● పీసీసీ చీఫ్ సూటి ప్రశ్న

● మంత్రి సురేష్, ఎమ్మెల్యే సుధాకర్‌బాబులు కలెక్షన్ కింగ్‌లు అంటూ విమర్శ

● ఏం చేశారని జగన్‌కు ఓటేస్తారు

● ఆలోచించుకోమని ఓటర్లకు విజ్ఞప్తి

● షర్మిల ప్రసంగం పట్ల ఆసక్తి కనబరిచిన ప్రజలు



అద్దంకిలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల సందర్భంలో జగనన్న వదిలిన బాణాన్ని అని చెప్పుకున్న జగన్ సోదరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి నేడు జగన్‌పై సూటి ప్రశ్నల బాణాలు వదిలారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోమవారం జిల్లాకు వచ్చిన ఆమె మాట్లాడిన ప్రతిచోట క్లుప్తంగా సూటిగా వినేవారికి అర్థమయ్యేలా ప్రసంగించి ఆకట్టుకున్నారు. స్థానిక సమస్యలు, వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని ప్రస్తావిస్తూ జగనన్నా నీకెందుకు ఓటేయాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంకా జగన్‌కు ఓటేయాలనుకుంటున్న వారు తనమాటల్లోని అక్షరసత్యాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. మంత్రి సురేష్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబుల అవినీతి వ్యవహారాలను ప్రస్తావించారు. వైపాలెంలో సురేష్ చేసిన అవినీతి కొండపి వెళ్లేసరికి నీతి అవుతుందా అంటూ వేసిన ప్రశ్న సభికులను విశేషంగా ఆకట్టుకుంది. తొలుత వైపాలెం, ఆతర్వాత చీమకుర్తి, రాత్రికి అద్దంకిలోను జరిగిన రోడ్‌షోలలో పాల్గొని ప్రసంగించారు. వైపాలెం సభలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికీ అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి సురేష్ బాగా సంపాదించాడంట కదా అని వ్యాఖ్యానించారు. అన్ని కమీషన్లు ఆయనవే కదా మొత్తం దోచేశారని చెప్తున్నారు అంటూ వ్యాఖ్యానాలు చేశారు. ఆయన మంచోడైతే ఇక్కడ నుంచి కొండపి ఎందుకు మార్చారని సురేష్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. వైపాలెంలో అవినీతి కొండపి వెళ్లాక నీతి అవుతుందా అని వ్యాఖ్యానిస్తూ ప్రజలు ఆలోచించాలని కోరారు. చీమకుర్తి సభలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన కలెక్షన్ కింగ్ అంట కదా.. గ్రానైట్ క్వారీలలో కలెక్షన్‌పై కలెక్షన్ చేశారంట కదా, ఆయన కలెక్షన్ చేస్తుంటే చూసీచూడనట్లు వదిలేసి ఇప్పుడు అభ్యర్థిని మార్చాం, ఓట్లేయండని అడగటం ఏమి నీతని ప్రశ్నించారు. అవినీతిపరులను ప్రోత్సహించిన జగన్‌కు ఓటేస్తే మళ్లీ అవినీతే కదా వచ్చేదని వ్యాఖ్యానించారు. వెలిగొండ విషయంలో మిమ్మల్ని మోసం చేశారు, గుండ్లకమ్మ ప్రాజెక్టుకు కొట్టుకుపోయిన గేట్లునే పెట్టలేకపోయారు. వైఎస్ వారసుడినని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని తుంగలో తొక్కాడు. అందుకే ఆయన్ను నమ్మి మరోసారి మోసపోకండి. ఆయన అధికారంలోకి వస్తే చెప్పింది చేయడు, అవినీతిపరులను ప్రోత్సహిస్తాడు తల్లిని, చెల్లినే చూడని వాడు మీ బాగోగులు ఏమి చూస్తాడనేదే నా బాధ అంటూ ఆమె ప్రజలను ఆకట్టుకునే విధంగా మాట్లాడారు.

కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థులు సుధాకరరెడ్డి, జేడీశీలం పాల్గొన్నారు. కాగా తన సమీప బంధువు బాలినేని పోటీచేస్తున్న ఒంగోలు నియోజకవర్గం మార్గమధ్యంలోనే ఉన్నా ఆమె ఆగకపోవటం, అద్దంకిలో ఆ నియోజకవర్గానికి చెందిన తన బాబాయ్ వైవీ సుబ్బారెడ్డికి సంబంధించి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మాట్లాడకపోవటం రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

నామినేషన్ల జోరు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 42 మంది అభ్యర్థులు 51 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. అందులో ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లను సమర్పించారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 38 మంది అభ్యర్థులు 46 సెట్లను అందజేశారు. ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తరఫున ఒక సెట్, మాగుంట గీతాలత తరఫున మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు నాలుగు సెట్లు సమర్పించారు. సంతనూతలపాడుకు ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్లను అందజేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొండపి నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు ఏడు సెట్లు సమర్పించారు. మార్కాపురం, గిద్దలూరుకు ఐదుగురేసి, కనిగిరికి ముగ్గురేసి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కనిగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

బాలికలు భళా!

● పదో తరగతి ఫలితాల్లో బాలురకంటే అధిక ఉత్తీర్ణత

● రాష్ట్రంలో ఏడోస్థానంలో జిల్లా గత ఏడాది కంటే మెరుగు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బాలికలు మెరిశారు. బాలురకంటే పైచేయి సాధించారు. ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే జిల్లా ఏడోస్థానంలో నిలిచింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండా అందరూ పాసైనట్లు ప్రకటించారు. 2022 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2023లో 12వ స్థానానికి పడిపోయారు. ప్రస్తుతం ఏడోస్థానంలో నిలిపి ఫర్వాలేదనిపించారు. పదో తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 29,195 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 26,630 (91.92శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణతతో పోల్చుకుంటే ఇది సుమారు ఐదుశాతం ఎక్కువ. గత ఏడాది కేవలం 73.74శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది 18.5శాతం అధికంగా పాసయ్యారు. బాలుర కంటే బాలికలు సుమారు మూడుశాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. బాలురు 14,684 మంది పరీక్షకు హాజరు కాగా 13,208 మంది (89.95శాతం) పాసయ్యారు. బాలికలు 14,511 మంది హాజరు కాగా 13,422 మంది (92.5శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం పాసైన 26,630 మందిలో 21,316 మంది ప్రథమ శ్రేణి, 3,618 మంది ద్వితీయ శ్రేణి, 1,696 మంది తృతీయ శ్రేణిలో నిలిచారు. పాఠశాలల వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. ఉత్తమ ఫలితాలు సాధించిన స్కూళ్ల యాజమానులు బాణ సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

30 లోపు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు పాఠశాల హెచ్ఎంల .ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫి కేషన్‌కు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించారు. రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థికి జవాబు పత్రాన్ని పంపుతారు.

పురవాసులపై పన్ను బాదుడు

● గత ఏడాది డిమాండ్ రూ.9.88 కోట్లు

● ఈసారి 15 శాతం పెంపు

● ఇప్పటి వరకు వసూలైంది రూ.1.34 కోట్లు

చీరాల, ఏప్రిల్ 22 : చీరాల మున్సిపల్ పరిధిలో 23,063 నివాస గృహాలు, షాపులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి ఏడాది పురపాలక సంఘానికి టాక్స్(పన్ను) చెల్లించాలి. ఈ ఏడాది తమపై పన్నుల భారం మోయలేనివిధంగా పెంచారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది పుర పరిధిలోని మొత్తం దుకాణాలు, నివాసాలకు సంబంధించి రూ.9.88 కోట్లు డిమాండ్ నోటీసులు ఇచ్చారు వసూలు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ప్రతి చెల్లింపుదారునికీ గత ఏడాది డిమాండ్‌పై సుమారు 15 శాతం పెంపుతో కొత్త డిమాండ్‌లను అందజేస్తున్నారు. దీంతో చెల్లింపుదారులు పన్నుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది సోమవారం సాయంత్రానికి పన్ను రూపేణా వసూలైన మొత్తం రూ.1.34 కోట్లు మాత్రమే. సాధారణంగా చెల్లింపులు, వసూళ్లలో పురపాలక సంఘంలో మెరుగైన ఫలితాలు ఉంటున్నాయి. పన్ను పెంపును చెల్లింపుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో పన్ను పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని చెల్లింపుదారులు డిమాండ్ చేస్తున్నారు.

దేవాలయాల అధికారి సస్పెన్షన్

ఇంకొల్లు, ఏప్రిల్ 22 : ఇంకొల్లు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. మండలంలోని గంగవరం గ్రామంలో కోదరండరామస్వామి దేవాలయ పునఃనిర్మాణం, కూల్చివేత పనులకు ప్రభుత్వ అనుమతులు లేకుండా, పురాతన దేవాలయాన్ని కూల్చివేయడంతో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కమిషనర్ విచారణ చేపట్టారు. విచారణలో తేలిన వాస్తవాల ఆధారంతో ఇంకొల్లు గ్రూపు దేవాలయాల కార్యానిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావును సస్పెండు చేస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

విజయోస్తు ఏలూరి

- ఆశీర్వదించిన మహిళలు
- నామినేషన్‌కు తరలిన శ్రేణులు
- దారిపొడవునా నీరజనాలు

మార్టూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి అభిమానులు భారీ ర్యాలీగా పర్చూరుకు తరలివెళ్లారు. మండలం లోని క్యాంప్ కార్యాలయంలో ఏలూరి తన సోదరి, తనయుడితో కలిసి ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బయలు దేరిన ఏలూరికి మహిళలు హారతులిచ్చి, దిష్టితీసి ఆశీర్వదించారు. ఆయన వెంట కార్యకర్తలు కార్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీగా కదిలారు. పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఏలూరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి జెండాను ఎగురవేశారు. కోనంకి, రాజుగారిపాలెం, ఇసుకదర్శి, వలపర్ల తదితర గ్రామాలకు చెందిన యువకులు, జనసేన, అభిమానులు, బీజేపీ శ్రేణులు చేరుకోగా ఏలూరి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లగా ప్రధాన సెంటరు, గన్నవరం రోడ్డు మీదుగా బొడ్డురాయి సెంటర్‌కు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు పూలతో హారతులతో బ్రహ్మరథం పట్టారు. ఆయనను పూల మాలలతో ముంచెత్తారు. అనంతరం వినాయకుని గుడి వద్దకు చేరుకున్న ఏలూరి వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

యనమదల ఆంజనేయస్వామికి పూజలు

వినాయకుని గుడి నుంచి బొబ్బేపల్లి దండుదారి మీదగా యనమదల ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకున్న ఏలూరికి చింత పల్లిపాడు, యనమదల, అనంతవరం గ్రామ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ పూజ లు ముగించి, యద్దనపూడి వచ్చిన ఏలూరి ర్యాలీకి యద్దనపూడి మండల నాయకులు స్వాగతం పలికారు. మహిళలు విజయోస్తు ఏలూరి అంటూ నినాదాలు చేశారు. జాగర్లమూడి వెళుతున్న ఏలూరి కాన్వాయ్‌ని పోలూరు రోడ్డు వద్ద నాయకులు ఎదురెళ్లి పూలమాలలతో స్వాగతించారు. మహంకాళి ఆలయం, పెద్దివారిపాలెంలోని ఆంజనేయ స్వామికి ఏలూరి పూజలు చేశారు. అక్కడకు ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం మండలాలకు చెందిన యువకులు బైక్ ర్యాలీగా ఎదురు రావడంతో కిటకిటలాడి సందడిగా మారింది. అనంతరం భారీ ర్యాలీగా పర్చూరుకు తరలివెళ్లారు. ఆ యన వెంట మార్టూరు. యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఇంకొల్లు : ఏలూరి నామినేషన్‌కు వందలాది వాహనాల్లో శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంత రావు, డాక్టరు శ్యాంసుందర్, వీరగంధం ఆంజనేయులు, పాలేరు రామకృష్ణ పాల్గొన్నారు. నక్కలపాలెం, గంగవరం, ఇడుపులపాడు, నాగండ్ల, పావులూరు, భీమవరం, దుద్దుకూరు, గొల్లపాలెం, హనుమోజిపాలెం నుంచి పెద్ద సంఖ్యలో తరళివెళ్లారు.

చినగంజాం : ఏలూరి నామినేషన్ కార్యక్రమానికి 12 గ్రామ పంచాయతీల నుంచి కూటమి శ్రేణులు టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేసి బస్సులు, కార్లలో పర్చూరుకు వెళ్లారు.



జనసంద్రమైన పర్చూరు

కదంతొక్కిన పసుపు సైన్యం

పర్చూరు : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి నామినేషన్ కార్యక్రమంలో పసుపు సైన్యం కదంతొక్కారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రసంగం అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి బయలు దేరారు. వేలాదిగా తరలివచ్చిన నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల రాకతో ర్యాలీ ముందుకు సాగని పరిస్థితి కన్పించింది. నామినేషన్ సమయం అయిపోనుండడంతో ఎమ్మెల్యే ఏలూరి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి బయలుదేరారు. అయితే ఎమ్మెల్యే ద్విచక్ర వాహనం వద్దకు ప్రజలు భారీగా రావడంతో ముందుకు కదలలేదు. ముహూర్త సమయానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజేయ్‌కుమార్, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుంజి వెంకట్రావు, అడ్వకేట్ కొల్లా నరేంద్రకుమార్ ఏలూరి తరఫున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.



ఏలూరి తరపున నామినేషన్ అందజేస్తున్న కూటమి నేతలు

అంచనాలకు మించి..

ఎమ్మెల్యే ఏలూరి నామినేషన్ మహోత్సవానికి పార్టీ శ్రేణులు వేసుకున్న అంచనాలకు మించి భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. దీంతో పర్చూరు పురవీధులు, ప్రధాన రోడ్లు పసుపుమయం అయ్యాయి. పర్చూరు మార్కెట్ యార్డ్ నుంచి బొమ్మల సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు జనసునామీని తలపించింది. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు నానా అవస్థలు పడ్డారు. ఏలూరి నాయకత్వం వర్థిల్లాలి అంటూ యువత నినాదాలతో పర్చూరు ప్రాంతం దద్దరిల్లింది.

మహంకాళీ అలయంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసిన ఏలూరి

యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఏలూరి నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి అమ్మవారి ఆశీస్సులను కోరారు.

కోలలపూడిలో వైసీపీకి షాక్

సర్పంచ్‌తో పాటు 9 మంది వార్డు సభ్యులు టీడీపీలో చేరిక


మార్టూరు, ఏప్రిల్ 22 : మండలంలోని కోలలపూడి గ్రామ సర్పంచ్ మోరపాకుల సతీష్ కుమార్, 9 మంది వార్డు సభ్యులు వైసీపీకి షాక్ ఇచ్చారు. వారంతా టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి కోలలపూడిలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో సర్పంచ్ సతీష్ కుమార్ పార్టీలో చేరారు. చేరినవారిలో వార్డు సభ్యులు తాతా శివనాగార్జున, చేబ్రోలు లక్ష్మి, ఎడవల్లి వెంకటస్వామి, అమరేసు నాగమణి, గాలి నాగేంద్ర, బొబ్బేపల్లి అంజమ్మ, గాలి మేరీ, బొడ్డు యలమంద, బొడ్డు మోహనరావుతోపాటు వైసీపీ నాయకులు తాతా వెంకట్రావు, కొమ్మాలపాటి సుబ్బారావు, గాలి శ్రీనివాసరావు, ఎడవల్లి నాగార్జున,దాసరి వెంకట నారాయణ, గాలి పోలయ్య, రవిబాబు, చేబ్రోలు హనుమంతరావు, నక్క నాగేశ్వరరావు, బుజ్జి, సుబ్బారావు, కుంచాల అంజిబాబు, గొర్రెపాటి నాగయ్య, అల్లరి పిచ్చారావు, పరస రామారావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, కంది మళ్ల కొండలరావు పాల్గొన్నారు. జడ్పీ మాజీ సీఈవో రాజశేఖర్ ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా సంక్షేమానికి కృషి చేసిన రాజశేఖర్ టీడీపీలో చేరడం వైసీపీ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు.



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కోలలపూడి సర్పంచ్, వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు

వైభవంగా పోలేరమ్మ వార్షిక తిరునాళ్ల

సంతమాగులూరు, ఏప్రిల్ 22 : మండలంలోని కామేపల్లి గ్రామంలో భక్తుల కోర్కెలు తీర్చే బంగారు తల్లి పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ మహోత్సవం సందర్భంగా ఆలయంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామేపల్లి గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పొంగళ్లు ఒండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పోలేరమ్మ

నేడు వీర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్ల

కోడ్‌తో నిలిచిన విద్యుత్ ప్రభలు

బల్లికురవ, ఏప్రిల్ 22 : వీర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్ల నేడు మంగళవారం జరుగనుంది. నక్క బొక్కలపాడు గ్రామ పరిధిలో బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో ఉన్న వీర్ల గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరగనున్నాయి. క్రీస్తు శకం 11వ శతాబ్దపు కాలంలో అప్పటి రాజులు ప్రతిష్ఠించిన వీర్ల గంగమ్మ అంటే ప్రజలకు ఎంతో నమ్మకం. గంగమ్మ తల్లి నలువైపులా గ్రానైట్ క్వారీలు ఉండడంతో జిల్లా నలు మూలల ఉంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. గత ఏడాది పది విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఎన్నికల కోడ్‌తో విద్యుత్ ప్రభలు నిలిచిపోయాయి. దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



వీర్లగంగమ్మ మూలవిరాట్

నేడు కొణిదెన, కొత్తపాలెంలో స్వామి కల్యాణ వేడుకలు

మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం, కొణిదెన గ్రామంలో ఉన్న చెన్నకేశవ స్వామి వారి కల్యాణ వేడుకలు మంగళవారం జరుగుతాయని ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

77 మంది వలంటీర్ల రాజీనామా

చినగంజాం, ఏప్రిల్ 22 : మండలం పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 222 మంది వలంటీర్లు గాను 77 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో ఆఫీస్‌లో చినగంజాం గ్రామ సచివాలయం-1లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు వలంటీర్లు సోమవారం ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందజేశారు. మోటుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఒకరు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 77 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ.. ఒకరికి గాయాలు

మేదరమెట్ల, ఏప్రిల్ 22 : జాతీయ రహదారిలో అద్దంకి ఫ్లై ఓవర్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో బైకిస్టుకు గాయాలయ్యాయి. సోమవారం ఒంగోలు వైపు నుంచి కారంపూడి వెళ్తున్న మాచర్ల కాంత్రికుమార్ తన కారును మేదరమెట్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చి అద్దంకి వైపు తిరగడం మరచిపోయి ఫ్లైఓవర్ ఎక్కి వెనక్కి తిరిగారు. అదే రోడ్డులో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న మోటర్ సైకిలిస్ట్ గోనుగుంట సాయి కుమార్ ఆపోజిట్ రోడ్డులో వస్తున్న కారును ఢీకొట్టారు. దీంతో సాయికుమార్ గాయపడ్డారు. గాయపడిన సాయికుమార్‌ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్‌ఐ చంద్రశేఖర్ సంఘనట స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయిని ఉదయలక్ష్మికి సన్మానం

ఇంకొల్లు, ఏప్రిల్ 22 : ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను చూపిన ఉపాధ్యాయిని వడ్డవల్లి ఉదయలక్ష్మి అని దగ్గుబాటి విద్యా సంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు అ న్నారు. ఎస్ఆర్ & వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో 36 సంవత్సరాలు పని చేసి హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ అయిన ఉదయలక్ష్మిని సోమవారం ఘ నంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు ఆమె సేవలను కొనియాడారు. యూటీఎఫ్‌లో కూడా పనిచేసి ఉపాధ్యాయ సమస్యలపై పోరాడిన మహిళా కార్యకర్త ఉదయలక్ష్మి అన్నారు. అనంతరం విశ్రాంత ప్రిన్సిపాల్ కుర్రా హనుమంతరావు, ఉదయలక్ష్మి దంపతులను ఉపాధ్యాయ బృంధం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎం ఈవోలు జయరాజ్, హరిబాబు, రాఘవరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరావు, స్టేట్ కబాడి అసోసియేషన్ సెక్రటరీ కుర్రా భాస్కరావు, డాక్టరు బొర్రా నాగజ్యోతి, కె.వీరాంజనేయులు, సమత, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి, మద్దినేని పాల్గొన్నారు.



ఆరికట్టవారిపాలెంలో ఝాన్సీ ప్రచారం

కూటమి వస్తేనే కష్టాలు తీరుతాయి

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 22 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలు కష్టాలు తీరుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గొట్టిపాటి రవి కుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో సోమవారం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలతో మహిళలకు మేలు చేకూరుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, అమ్మకు వందనం కింద చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15000 సాయాన్ని అందించనున్నట్లు ఆమె వివరించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక జరిగిన నష్టాన్ని ప్రజలు తెలుసుకొని ఈ సారి ఎన్నికల్లో విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, మహిళలు పాల్గొన్నారు.



ఆరికట్టవారిపాలెంలో ఝాన్సీ ప్రచారం

ఏలూరి ఆస్తుల విలువ రూ.19.99కోట్లు

పర్చూరు, ఏప్రిల్ 22 : పర్చూరు నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల్లో ఆయన తన ఆస్తులు, అప్పుల వివరాలను అఫిడవిట్‌లో చూపించారు. ఆస్తుల విలువ రూ.19.99 కోట్లు, భార్య మాలతి అస్తులు రూ.187కోట్లు, పెద్దకుమారుడు దివ్యేష్ రూ.41.58కోట్లు, చిన్న కుమారుడు షైనాంక్ తారక్ రూ.41.40కోట్లుగా అఫిడివిట్‌లో పేర్కొన్నారు. తనకు ఎలాంటి అప్పులుగానీ, వాహనాలుగానీ లేవని, తన భార్యకు రూ.8.87కోట్ల అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏలూరిపై గతంలో ఎలాంటి కేసులు నమోదు లేకపోయినా ప్రస్తుత వైసీపీ పాలనలో ఉద్దేశపూర్వకంగా 6 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటికి ఎలాంటి చార్జిషీట్‌లు లేవని తెలిపారు.

నేతన్న.. మా నేస్తం

కొండయ్య కోసం కుమార్తె ప్రచారం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్య నాయకులు వేర్వేరుగా ముందుకు సాగుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఇంటింటి ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగేవిధంగా ప్రణాళిబద్ధంగా కొండయ్య చేస్తున్న దిశానిర్దేశం మేరకు వారు అడుగులు వేస్తున్నారు. సోమవారం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్యకు మద్దతుగా ఆయన కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి, సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలను అర్థమయ్యేలా వివరించారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను పోల్చుకుంటే రోజుకు రూ.500 సంపాదించినా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి మారాలంటే సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రం అభివృద్ధి వైపు నడవాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించడం ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా ఆమె నేత కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మగ్గంపై తాను కూడా పనిచేసి వృత్తిలో పడే కష్టాన్ని స్వయంగా చవిచూశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నేతనేస్తున్న శివనారాయణదేవి

టీడీపీలోకి చేరికలు

మండలంలోని కొత్తపేట ప్రసాదనగరంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి కొండయ్య కుమారుడు మహేంద్రనాథ్ కండువాలువేసి పార్టీలోకి స్వాగతించారు. చీరాల మండలం బుర్లవారిపాలెంలో పలువురు టీడీపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకోటేశ్వరస్వామికి న్యాయాధికారి పూజలు

చినగంజాం, ఏప్రిల్ 22 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలోని శ్రీలలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఒంగోలు స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి రామరాజు వెంకటేశ్వరశర్మ సోమవారం సందర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయాధికారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు తెలియజేశారు.



రాజకోటేశ్వరస్వామి ఆలయంలో న్యాయాధికారి రామరాజు కుటుంబం

పది ఫలితాల్లో మెరిసిన బాలికలు

మండలాలవారీగా ఉత్తీర్ణత శాతాన్ని వెల్లడించిన ఎంఈవోలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 22 : పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలోను, ప్రైవేట్ పాఠశాలలోను మంచి ఉత్తీర్ణత సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో బాలికలు నిలిచారు. విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాయపాలెం జడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన ఎస్‌వీ పార్థసాయి 577/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ధేనువకొండ జడ్పీహెచ్‌ఎస్ చెందిన అరవిందబాబు, తృతీయ స్థానంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.పూజితాంజలి నిలిచారు. గురుకుల బాలిక జూనియర్ కళాశాలకు చెందిన జ్యోత్స్న 566 శంఖవరప్పాడు జడ్పీహెచ్‌ఎస్‌కు కోటేశ్వరరావు 562, ధర్మవరం జడ్పీహెచ్‌స్ నుంచి శ్రీనిజా 546, బొమ్మనంపాడు జడ్పీ హెచ్ఎస్ నుంచి ఏ.కల్యాణ్ 539, చక్రాయపాలెం జడ్పీహెచ్ఎస్ నుంచి కె.అభిలాష్ 534, కాకానిపాలెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.శ్రీను 522, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కె.చరణ్ 510 మార్కులు, గురకాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన గంగయ్య 508, మైలవరం జడ్పీ స్కూల్ అభిషేక్ 498, ఎస్టీ గురుకులంలో శ్రీలం రాజు 486 మార్కులు సాధించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలలు హోలిపెయింత్‌కు చెందిన కె.జహ్నవి 593తో ప్రథమ, భాష్యంలో జి.లక్ష్మిశృతి 592, శ్రీ చైతన్య నిహిత 591, బెల్ అండ్ బెనెట్‌లో ఎన్.సాత్విక 587, భవిష్య స్కూల్ షేక్ ఫౌజియా 586, ఆర్క్విడ్స్‌కు చెందిన ఎన్.శ్యామలదేవి 583, గ్రావిటీగ్లోబల్ ముకుందా మణిదీప్, సెయింట్ జోసెఫ్‌లో ఆశీష్ నిహాల్ 581, శ్రీ నాగార్జున స్కూల్ కె. నవ్యశ్రీ 575, వి శ్వభారతి కామినేని పవన్ కల్యాణ్ 531 మార్కులు సాధించారు. మండలంలో మొత్తం 1189 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1109 మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పర్చూరు : పదవ తరగతి ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. సోమవారం విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో పర్చూరు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి గ్రామీణ ప్రాంత ఖ్యాతిని చాటారు. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ఒగ్గిశెట్టి అక్షయ 594/600తో ప్రథమ స్థానంలో నిలవగా, వల్లభరెడ్డి హిమజ 592, శ్యామలా తనూజ 591, జి.యామిని 590 సాధించారు. మొత్తం 190కి 187 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు లక్ష్మయ్య తెలిపారు. శారదాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాంటెండ్ కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు తెలిపారు. అందులో వి.నందిని 591కి వచ్చినట్లు చెప్పారు. శ్రీ శాతవాహనలో మొత్తం 47కు 46 మంది ఉత్తీర్ణత సాధించటం జరిగిందని పాఠశాల డైరెక్టర్ తేళ్ల రాము తెలిపారు. ఏఎన్‌వీఎస్ బాలికల పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిట్లు క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో మొత్తం 43 మంది పాసయ్యారు. బత్తుల నందిని 591 సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. గురుకుల పాఠశాలలో మొత్తం 81 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విశ్వరాణి తెలిపారు.

చీరాలటౌన్ : టెన్త్ ఫలితాల్లో చీరాల సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎస్.అక్షయ 590, పి.సాలెహా 590 సాధించారు. 45 మందిలో 43 మంది పాసయ్యారు. వీరిలో 17 మంది 500కు పైగా సాధించారు. స్కూల్ వ్యవస్థాపకుడు డా.టి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వై.అనంత లక్ష్మి, ఉపాధ్యాయులు లావణ్య, ఉమాదేవి, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

బల్లికురవ : పదో తరగతి పరీక్షల ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. బల్లికురవ మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయంలో 439 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 414 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల స్థాయిలో 94 శాతం లభించింది. కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన జీ లక్ష్మీలావణ్య 585 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. బల్లికురవ ఉన్నత పాఠవాలకు చెందిన విద్యార్థి సీహెచ్.సత్యసాయి జతిన్ 582 మార్కులు సాధించి రెండో నిలిచాడు. కొణిదెన ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ అంజనినీకుమారి 567 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. బల్లికురవ ఉన్నత పాఠశాలలో 92 శాతం, కొమ్మినేనివారిపాలెం పాఠశాల 92 శాతం, కొణిదెన 93 శాతం, కొప్పెరపాడు, 97 శాతం, పెద అంబడిపూడి 98 శాతం, ఉప్పుమాగులూరు 98 శాతం, వైదన, 96 శాతం, కూకట్లపల్లి, 70 శాతం, కేజీబీవీ విద్యాలయం 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆయా పాఠశాలలో పాసైన విద్యార్థులను ఎంఈవోలు వస్రాం నాయక్, రమేష్, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పంగులూరు : టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల బాలికలు మంచి మార్కులు సాధించారు. పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పూల నాగప్రణతి 585 ప్రథమ, బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ గౌస్‌బాషా 578, చందలూరు ఉన్నత పాఠశాల బాలికలు జాహ్నవి, చంద్రిక 576తో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలవలపాడు విద్యార్థులు నూరుశాతం సాధించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో 72 మంది రాయగా 71 మంది ఉత్తీర్ణత సాధించారు. చందలూరులో 129కి 127 మంది పాసయ్యారు. కొండమంజులూరు 64కు 62 మంది, ముప్పవరంలో 43కి 42 మంది, బూదవాడలో 41కి 40 మంది, బూదవాడలో 15 మంది, అలవలపాడు పాఠశాలలో ఇద్దరు, పంగులూరులో 13 మంది, చందలూరులో 10 మంది 550కి పైగా, 34 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. అలవలపాడు విద్యార్థిని నస్నేబీ 561, కొండమంజులూరు పి. యశ్వంత్ 537 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో 585 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థిని పూల నాగ ప్రణతిలో పాటు ఆ బాలిక తల్లిదండ్రులు కృష్ణప్రసాద్, నప్పలను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు అభినందించారు.

మార్టూరు : పదవతరగతి పరీక్షల ఫలితాలలో మార్టూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు చెందిన విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. మండలంలో 1012 విద్యార్థులు పరీక్షలు రాయగా 974 మంది ఉత్తీర్ణులయ్యారు. వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్‌కె నాగూర్ వలి 591తో మండలంలో మొదటి స్థానంలో నిలవగా, ద్రోణాదుల హైస్కూల్‌కు చెందిన పీ పూజిత 585 రెండో స్థానం సాధించింది. రాయల్ హైస్కూల్‌కు చెందిన మహేష్‌బాబుకు 590 వచ్చాయి. 8 ప్రభుత్వ జడ్పి హైస్కూల్స్ లో 5 జడ్పి హైస్కూల్స్ లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా నాగూర్‌వలిని ఉపాధ్యాయులు అభినందించారు. యద్దనపూడి గురుకులంలో 76కు 76 మంది పాసయ్యారు. రోజశ్రీ 574 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈవో సుబ్రమణ్యే శ్వరరావు, చిలుకూరి గోపీ తెలిపారు.

ఇంకొల్లు, ఏప్రిల్ 22 : టెన్త్ ఫలితాల్లో ఎంఆర్ఆర్ ప్రకాశం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తోటకూర అంకబాబు తెలిపారు. మాగులూరి శ్రీముఖి 593 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, గూండావరపు వెంకటనిశాంత్ 578, సయ్యద్ ముభ్షరిన్ 570, షేక్ కౌసర్ 568 సాధించినట్లు చెప్పారు. మొత్తం 37కు గాను 27 మంది 500పైగా, 12 మందికి 550 మార్కులు వచ్చినట్లు అంకబాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీముఖిని ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ అంకబాబు కృతజ్ఞతలు తెలియజేసారు. పూసపాడు అడ్డరోడ్డులోని డ్రీమ్స్ మరియు యూనివర్సల్ విద్యార్థులు మోదుగుల శైలేశ్వరి 593, నిఖిత 593, సాయిహర్షితారెడ్డి 590 మార్కులు సాధించగా 550పైగా 119 మంది మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ పేర్ని సతీష్‌చంద్ర తెలిపారు. దుద్దుకూరు ఆచార్యరంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో 39కి 38 మంది పాసయ్యారు. పాదర్తి ప్రణీత 550 మా ర్కులు సాధించిందని హెచ్‌ఎం శ్రీనివాసాచార్యులు తెలిపారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలో 449 మంది పరీక్షలు రాయగా, 406 మంది పాసయ్యారు. 90.42శాతం ఉత్తీర్ణత సాధించారు. దైవాలరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 26 మంది హాజరు కాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. రావినూతల హైస్కూల్‌కు చెందిన ఎం.మనీషా 574, మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉమామహేశ్వరి 572 మార్కులు సాధించింది. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన ఇద్దరు బాలికలు 589, 588 మార్కులు సాధించారు. పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 49 మందికి 44 మంది పాసయ్యారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులతో పోటీ పడడం పట్ల ప్రజలు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పదివ తరగతి ఫలితాలను ఎంఈవో ఎల్.వున్నయ్య తెలిపారు.

సంతమాగులూరు : టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ జడ్పీ హైస్కూలు విద్యార్థులు సత్తాచాటారని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. ఏల్చూరు హైస్కూల్ విద్యార్థి సాత్విక 588, 580, వెల్లలచెరువు హైస్కూల్‌లో భాను ప్రకాష్ 577, మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో సూర్యనారాయణ 572, వైష్ణవి 565, 563 మార్కులు సాధించగా, కేజీబీవీ ఏల్చూరులో ప్రశస్త 558 మార్కులు సాధించినట్లు ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 475 మంది పరీక్షలు రాయగా, 443 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి



ఉదయగిరిలో టీడీపీ శ్రేణుల ప్రదర్శన

నామినేషన్ల కోలాహలం

● ఒక్కరోజునే 32 మంది..
43 సెట్ల నామినేషన్ల దాఖలు

నెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ అడపా దడపా మాత్రమే నామినేషన్లు దాఖలవుతూ వచ్చాయి. అయితే సోమవారం ఒక్కరోజునే భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 32 మంది అభ్యర్థులు.. 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.



నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి



నగర కమిషనర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నగర అభ్యర్థి నారాయణ, పక్కన కోటంరెడ్డి



ఉదయగిరిలో కాకర్ల సురేష్.



నెల్లూరు నగరంలో టీడీపీ కార్యకర్తల ప్రదర్శన

నెల్లూరు ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి హరినారాయణన్‌కు అందజేశారు. ఆయన 2 సెట్లు వేశారు. నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ కూడా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నారాయణకు డమ్మీగా ఆయన సతీమణి రమాదేవి ఒక సెట్ నామినేషన్ వేశారు. నెల్లూరు సిటీ వైసీపీ అభ్యర్థి మహ్మద్ ఖలీల్ అహ్మద్ తరపున ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నామినేషన్ వేశారు. నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. సర్వేపల్లి వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు వేశారు.



ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి

ఆయనకు డమ్మీగా కుమార్తె కాకాణి పూజిత రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అలానే వైసీపీ అభ్యర్థి మేక పాటి విక్రమ్‌రెడ్డి తరఫున ప్రొపోజర్లు ఒక సెట్ నామినేషన్ వేశారు. కందుకూరులో వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా వైసీపీ తరపున తాడికొండ రాంబాబు నామినేషన్ దాఖలు చేశారు. వీరితోపాటు ఇతర పార్టీల తరపున అభ్యర్థులు, స్వతంత్రులు నామినేషన్లు వేశారు.

అరె.. పత్రాలేవీ!?

● ఉదయగిరిలో వెనుతిరిగిన కాంగ్రెస్ అభ్యర్థి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22 : సరియైన పత్రాలు లేకపోవడంతో ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థి సోము అనిల్ కుమార్‌రెడ్డి ఆర్వో కార్యాలయం నుంచి వెనుతిరగాల్సి వచ్చింది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల రాజు, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిలతో కలిసి అనిల్ తహసీల్దారు కార్యాలయానికి చేరుకొన్నారు. అయితే సరైన పత్రాలు లేకపోవడం, సమయం ముగియడంతో నామినేషన్ వేయకుండానే అక్కడ నుంచి వెనుతిరగాల్సి వచ్చింది.

అఫిడవిట్లలో ఏమున్నాయంటే!

నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు

నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ కుటుంబ ఆస్తులు రూ.824 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నారాయణ పేరు మీద రూ.78.66 కోట్లు, ఆయన సతీమణి రమాదేవి పేరు మీద రూ.100.87 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అలానే నారాయణ పేరుపై రూ.207.50 కోట్ల స్థిరాస్తులు, రమాదేవి పేరుపై రూ.437.02 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు చూపించారు. ఇక నారాయణకు రూ.62.43 కోట్లు, రమాదేవికి రూ.127.16 కోట్ల అప్పులు ఉన్నాయి. అదేవిధంగా నారాయణపై 8 కేసులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రస్తావించారు.

● వేమిరెడ్డి ఆస్తులు రూ.716 కోట్లు

నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబ ఆస్తులు రూ.716 కోట్లు. అందులో వీపీఆర్ పేరుపై రూ.464.43 కోట్లు, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి పేరుపై రూ.46.94 కోట్ల చరాస్థులు ఉన్నాయి. అలానే ప్రభాకర్‌రెడ్డి పేరు మీద రూ.174.83 కోట్లు, ప్రశాంతిరెడ్డి పేరు మీద రూ.30.11 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. అదే విధంగా వీపీఆర్‌కు రూ.153.81 కోట్ల అప్పులు, ప్రశాంతి రెడ్డికి రూ.43.48 కోట్ల అప్పులు ఉన్నట్లు వేమిరెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటితోపాటు వీపీఆర్‌పై ఆరు కేసులు కూడా ఉన్నాయి.

● ఆదాల ఆస్తులు రూ.312 కోట్లు

నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి రూ.312 కోట్లు ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో ఆదాల పేరుపై రూ. 41.11 కోట్లు, ఆయన సతీమణి వింధ్యావళి పేరుపై రూ.85.46 కోట్లు చరాస్తులు ఉన్నట్లు చూపించారు. అలానే ఆదాల పేరుపై రూ.136.66 కోట్లు, సతీమణి పేరుపై రూ.48.70 కోట్లు స్థిరాస్తులున్నాయి. అదేవిధంగా ఆదాలకు రూ.12.16 కోట్లు, ఆయన సతీమణికి రూ.3.48 కోట్ల అప్పులు ఉన్నట్లు ప్రస్తావించారు.

● ఆనం ఆస్తులు రూ.26 కోట్లు

ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి ఉమ్మడి కుటుంబం ఆస్తులు రూ.26 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. ఆనం పేరు మీద రూ.45.04 లక్షలు, ఆయన సతీమణి శిరీష పేరుపై రూ.32.84 లక్షలు చరాస్తులు ఉన్నాయి. అలానే ఆనం పేరుపై రూ15.80 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.9.70 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా రామనారాయణరెడ్డి పేరుపై రూ.29.58 లక్షల అప్పులు కూడా ఉన్నాయి. ఇక రామనారాయణరెడ్డిపై ఒక కేసు ఉంది.

● సురేష్ ఆస్తులు రూ. 27 కోట్లు

ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకార్ల సురేష్ కుటుంబం ఆస్తుల విలువ రూ.27.44 కోట్లుగా అఫిడవిట్‌లో నమోదు చేశారు. అందులో చరాస్తులు సురేష్ పేరుపై రూ.4.29 కోట్లు, ఆయన సతీమణి లక్ష్మీ ప్రవీణ పేరుపై రూ.4.90 కోట్లు ఉన్నాయి. అలానే సురేష్‌కు రూ.10.85 కోట్లు విలువైన స్థిరాస్తులు, ఆయన సతీమణికి రూ.7.40 కోట్ల స్థిరాస్తులున్నట్లు చూపించారు. అదేవిధంగా సురేష్ పేరుపై రూ.3.28 కోట్ల అప్పు కూడా ఉంది. ఇక జలదంకి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు సురేష్‌పై నమోదై ఉంది.

● కాకాణిపై ఏడు కేసులు

సర్వేపల్లి వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఏడు కేసులు నమోదై ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక కాకాణి కుటుంబం ఆస్తులు రూ.28.66 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో గోవర్ధన్‌రెడ్డి పేరు మీద రూ.2.43 కోట్లు, ఆయన సతీమణి విజిత పేరు మీద రూ.2.36 కోట్ల విలువైన చరాస్తులున్నట్లు చూపించారు. అలానే గోవర్ధన్‌రెడ్డిపై రూ.13.70 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.10.17 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వీరికి ఎటువంటి అప్పులు లేవు.

● విక్రమ్‌రెడ్డిపై ఎనిమిది కేసులు

ఆత్మకూరు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై దేశవ్యాప్తంగా ఎనిమిది కేసులు ఉన్నాయి. ఇక విక్రమ్‌రెడ్డిపై రూ.76.71 కోట్లు, ఆయన సతీమణి వైష్ణవి రెడ్డిపై రూ.15.32 కోట్లు చరాస్తులు ఉన్నాయి. అలానే విక్రమ్‌రెడ్డి పేరు మీద రూ. 114.62 కోట్లు, ఆయన సతీమణి పేరు మీద రూ.2.57 కోట్ల విలువైన స్థిరాస్తులు కూడా ఉన్నాయి. వీరికి రూ.34 కోట్లు అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు.

● ఖలీల్ అహ్మద్ ఆస్తులు 22 లక్షలు

నెల్లూరు సిటీ వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ కుటుంబం ఆస్తులు రూ. 22.18 లక్షలు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఖలీల్ పేరుపై రూ.16.25 లక్షలు, ఆయన సతీమణి పేరుపై రూ.4.26 లక్షలు, కుమారుడి పేరుపై రూ.1.67 లక్షల విలువైన చరాస్తులు ఉన్నాయి. అయితే రూపాయి విలువ చేసే స్థిరాస్తి కూడా లేదని చూపించారు.

‘పది’లో 15వ స్థానం

- టెన్త్‌లో 27,788 మంది పాస్
- జిల్లాలో ఉత్తీర్ణత శాతం 88.17
- ఈ ఏడాది కూడా బాలికలదే హవా
- గతేడాది కంటే దిగజారిన ఫలితాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. గత ఏడాది జిల్లాకు 9వస్థానం రాగా, ఈ ఏడాది దిగజారి 15వ స్థానంలో నిలిచింది. అయితే గత ఏడాది సాధించిన 75.61 శాతం ఉత్తీర్ణత కంటే కొంత మెరుగుపడి 88.17 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలికలు తమ హవా చాటారు. జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్ 2, ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 4, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 2, ఏపీటీడబ్ల్యుఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 2, కేజీబీవీలు 4, జిల్లా పరిషత్ 23, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 143 కలిపి మొత్తం 180 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. అలాగే 8,591 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించగా 20,201 మంది ప్రథమస్థానం, 3,019 మంది ద్వితీయస్థానం, 1,268 మంది తృతీయస్థానం సొంతం చేసుకున్నారు.

● 88.17 శాతం ఉత్తీర్ణత

పదోతరగతి పరీక్షలకు ఈ ఏడాది జిల్లాలో 27,788 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా, 24,500 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 13,926 మంది హాజరు కాగా 12,003 మంది ఉత్తీర్ణతతో 86.19 శాతం ఫలితాలు సాధించారు. బాలికల్లో 13,862 మంది హాజరుకాగా 12,497 మంది ఉత్తీర్ణతతో 90.15 శాతంగా నమోదైంది. బాలుర కంటే బాలికలే కొంత మెరుగైన ఫలితాలు దక్కించుకున్నారు. మొత్తం మీద బాల, బాలికలు కలిపి జిల్లాలో 88.17 శాతం ఉత్తీర్ణత పొందారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా అంతా ఊహించిన విధంగానే పదిలో జిల్లా స్థానం తగ్గుతుందని భావించారు. డీఈవో గంగాభవాని గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది సైతం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి డీఈవో ఆదేశాలకు అనుగుణంగా కట్టుదిట్టం చేశారు. అయితే ముందుగానే పరీక్షలు పకడ్బందీగా ఉంటాయని భావించిన ఆయా యాజమాన్యాల విద్యార్థులు తమ శక్తి మేరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో గతంలో కంటే ఈ ఏడాది అత్యధికంగా ప్రథమస్థానంలో ఉత్తీర్ణత పొందారు..

● అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు..

జిల్లాలో ఈ ఏడాది 16 మంది విద్యార్థులు అత్యధిక మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. చలువాది వెంకట సుభాష్‌చంద్ర 598, రాపూరు గణేష్, కందుకూరు మహిక 597, చల్లా చాతుర్య, గుణపాటి ధనుష్, తలిశెట్టి హేమశ్రీ, వీరబొమ్మ నిరూపమ, వేలూరు భవ్య, గూడూరు అక్షిత, యెండ్లూరి చరణ్‌లు 596, రెడ్డప్పగారి శ్రీనిధి, ఓకారం యశస్విని, బొక్కసం సాయిహర్షిణి, శంకవరం లక్ష్మీశ్రీ, షేక్.సాయికిరణ్, నంబూరి సాయిచరణ్‌లు 595 మార్కులు సాధించారు. అలాగే ఈ ఏడాది జడ్పీ, మున్సిపాలిటీ, ప్రభుత్వ పాఠశాలల్లో జడ్పీ విభాగంలో బుచ్చి ఎంపీపీ పాఠశాలకు చెందిన షేక్.ఆయేషా సిద్దిక్, చింతల లక్ష్మీకీర్తనలు 592 మార్కులు, మునిసిపల్ విభాగంలో నగరంలోని బీవీనగర్ మునిసిపల్ పాఠశాలకు చెందిన కె.స్వాతి శ్రీనిధి 594, పప్పులవీధి మునిసిపల్ పాఠశాల విద్యార్థి ఎం.జశ్వంత్‌రెడ్డి 592 మార్కులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇందుకూరుపేట ఎంకేఆర్ పాఠశాలకు చెందిన బి.ఉమేష్‌చంద్ర 591, ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన పఠాన్‌సోనీ 586 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు.

● 20,201 మందికి ప్రథమస్థానం..

జిల్లాలో గత ఏడాది 16,466 మంది ప్రథమస్థానం సాధించగా ఈ ఏడాది 20,201 మంది ప్రథమస్థానం దక్కించుకున్నారు. అలాగే 3,019 మంది ద్వితీయస్థానం, 1,268 మంది తృతీయస్థానం దక్కించుకున్నారు. వీరిలో తెలుగులో 314, ఇంగ్లీష్‌లో 47 మంది, మ్యాథ్స్‌లో 1714 మంది, సైన్స్‌లో 271 మంది, సోషల్‌లో 520 మంది వందశాతం మార్కులు సాధించారు. అలాగే 500-550లోపు 5,086 మంది, 551-560లోపు 969 మంది, 561-570లోపు 932 మంది, 571-580 లోపు 903 మంది, 581-590 లోపు 598 మంది, 591-600 లోపు 103 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు దక్కించుకున్నారు. అలాగే ఏపీఎంఎస్‌లో 213 మంది, ఏపీఆర్‌లో 142 మంది, ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌లో 174 మంది, ఏపీటీడబ్ల్యుఆర్‌లో 9 మంది, సెంట్రల్ స్కూల్స్‌లో 2, కేజీబీవీల్లో 62 మంది, జడ్పీలో 1,283మంది, మునిసిపాలిటీల్లో 316 మంది, ఎయిడెడ్‌లో ఏడుగురు, ప్రభుత్వ పాఠశాలల్లో 77 మంది, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్‌లో 6,306 మంది కలిపి మొత్తం 8,591 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు.

● మెరుగైన ఫలితాలు సాధించాం : డీఈవో

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాం. తమ శక్తి మేరకు నాణ్యమైన ఫలితాలు వెలువడ్డాయి. వచ్చిన ఫలితాలన్నీ కూడా నిజాయితీగా విద్యార్థులు సాధించుకున్నవే. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.వారి ప్రతిభ ఆధారంగా దక్కించుకున్న ఫలితాలు సంతృప్తినిచ్చాయి.మున్ముందు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

● రీకౌంటింగ్-రీవెరిఫికేషన్‌కు సూచనలు.

విద్యార్థులు జవాబుపత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 23 నుంచి 30వతేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500లు, జవాబు పత్రాల రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000లను చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో, సంబంధిత పాఠశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

● మే 24 నుంచి సప్లిమెంటరీ

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 3 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 23వతేదీ నుంచి 30వతేదీలోగా ఎలాంటి అపరాధ ఫీజు చెల్లించాలన్నారు. అలాగే రూ.50ల అపరాధ రుసుంతో మే 1 నుంచి 23వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

కావలి
కందుకూరు

మీ ఊరివాడిని.. మీలో ఒకడిని..

● గెలిపిస్తే ఇందుపూరును నెంబర్‌వన్ చేస్తా : ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి


వేమిరెడ్డికి గజమాలతో స్వాగతం పలికిన ప్రజలు

అల్లూరు, ఏప్రిల్ 22 : మీ ఊరి వాడిని.. మీలో ఒకడిని.. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపిస్తే ఇందుపూరును నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుపూరులో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక ఆలయాల్లో విశేష పూజలు, మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బీద గిరిధర్, వేమిరెడ్డి కోటారెడ్డి, వాకాటి బినీత్‌రెడ్డిలతో కలసి రోడ్‌షో నిర్వహించారు. స్థానికులు ఆయనకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి వస్తే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయని, గ్రామంలో ఒక కమిటీ వేసుకొని అవసరమైన అభివృద్ధి పనుల గురించి తెలియజేస్తే సొంత నిధులతో ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా టీడీపీ తరఫున తాను ఎంపీ అభ్యర్థిగా, కావ్య కృష్ణారెడ్డి కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నామని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపిస్తే వెంటనే ఈ గ్రామానికి వచ్చి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, భవానీ శంకర్‌రెడ్డి, పాపనబోయిన రత్తయ్య, రాజేంద్ర, హరికృష్ణ, బిట్రగుంట చైతన్యరెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక నాయకులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు నామినేషన్

కందుకూరు, ఏప్రిల్ 22: కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేస్తారు. ఈ ర్యాలీలో ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అజీజ్ పాల్గొననున్నారు. ఉదయం పది గంటలకు ర్యాలీ ప్రారంభమై పామూరు రోడ్డు జంక్షన్, ఎన్టీఆర్ విగ్రహం, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్‌ల మీదుగా సబ్ కలెక్టరు కార్యాలయంకు చేరుకోనుండగా 12 గంటల తర్వాత నామినేషన్ పత్రాలను సబ్ కలెక్టరు కార్యాలయంలో అందజేసేలా నాయకులు ఏర్పాట్లు చేశారు. మార్గమధ్యంలో గ్రామదేవత అంకమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

టీడీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు : పట్టణంలోని 7, 10, 16 వార్డులకు చెందిన సుభానీ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆరిఫ్, అబ్దుల్ రహీం, ఫయాజ్, ఆసిఫ్, సుభాని, నాయబ్‌రసూల్, మాలిక్‌బాషా, రఫి, మహమూద్, కాలేమా, ఆరీఫ్ తదితరులు సోమవారం వైసీపీని వీడి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బాషా, రాబీ, గౌస్ బాషా, షేక్ మున్నా, బాషావలి, సరిద్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరి వంశీకృష్ణ దంపతుల చేరిక : కందుకూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త చెరుకూరి వంశీకృష్ణ దంపతులు టీడీపీలో చేరారు. ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, కాకుమాని హర్ష, పాల్గొన్నారు.

శింగరపాలెంలో..

లింగసముద్రం: వైసీపీకి కంచుకోటగా ఉన్న మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పంచాయతీ శింగరపాలెంలోని ఆది ఆంధ్ర కాలనీవాసులు బారీగా ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ పంచాయతీకి చెందిన గ్రామ పార్టీ అధ్యక్షుడు కేశంరెడ్డి మధు, నాయకులు పోలిమేర నాగిరెడ్డి, నీలం బ్రహ్మారెడ్డిల ఆధ్వర్యంలో కాలనీకి చెందిన వైసీపీ నాయకులు కాకి ప్రసాద్, తిరిపాలు, గుంటుపల్లి జేమ్స్, పౌలు, యెహోవా, డేవిడ్, డొక్కా సైమన్, తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీ.బాలకోటయ్య, నాయకులు వరికూటి ప్రసాద్, పోలిమేర పెద్దిరెడ్డి, కొండ్రెడ్డి మాల్యాద్రి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదపవనిలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, రామిశెట్టి మాలకొండయ్యల ఆధ్వర్యంలో వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ సారథ్యంలో 100కు పైగా ముస్లిం కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాగేశ్వరరావు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.


లింగసముద్రం : పార్టీలో చేరిన వారితో ఇంటూరి

ఉలవపాడు : మండలంలో పలు గ్రామాలకు చెందిన 350 వైసీపీ కుటుంబాలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కరేడు, అలగాయపాలెం, మన్నేటికోట ఎస్టీ కాలనీ, రామాయపట్నం ఎస్టీ కాలనీ, ఉలవపాడులో భారీగా ముస్లింలు టీడీపీలోకి వలస వచ్చారు. ఉలవపాడు వచ్చిన ఆయన బైపాస్ అడ్డరోడ్డు నుంచి బైక్ ర్యాలీతో పార్టీ కార్యాలయం వరకు వచ్చారు. ఉలవపాడుకు చెందిన ఎస్ఎం బాషా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఇంటూరిని గుర్రంపై అంబేడ్కర్ విగ్రహం వరకు ఊరేగించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి నామినేషన్

కావలిటౌన్, ఏప్రిల్ 22: కావలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కలుగోళశాంభవి ఆలయంలో పసుపులేటి తన సతీమణి సుగుణమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించి అభిమానులు అనుచరులతో కలిసి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. ఎన్నికల అధికారి శీనా నాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట పీ.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులుగౌడ్, శ్యామ్‌సన్ ఉన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఏప్రిల్ 22: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం విజ్ఞాన్ విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ గట్టమనేని హరిబాబు సోమవారం రూ.25వేలు విరాళాన్ని ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుడు మంచిరాజు మురళీమోహన్‌కు అందజేశారు.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 : మండలంలోని నూకవరం గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు బద్దిపూడి శ్రీకాంత్, బద్దిపూడి అరుణ, చల్లా వంశీకృష్ణ, నత్తా చక్రవర్తి, మధులూరి రాము, సంగా మౌనికలు సోమవారం రాజీనామా చేశారు. వారిలో ఐదుగురు పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌కునేరుగా రాజీనామా పత్రాలు అందించగా ఒక వలంటీర్ వాట్సాప్‌లో రాజీనామా పత్రం పంపించినట్లు పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు.

ఎన్నికల కోడ్‌కు లూటు్లు
గోడలకు జగన్ పోస్టర్లు


మొగిలిచెర్లలో గోడకు అంటించిన జగన్ పోస్టర్లు

లింగసముద్రం, ఏప్రిల్ 22 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ గోడలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. లింగసముద్రంలోని వాకమళ్లవారిపాలెం, మొగిలిచెర్లలో పోస్టర్లు గోడలకు అంటించి ఉన్నాయి. వీటిని గుర్తించిన మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య మరికొందరు నేతలు తొలగించాలని స్థానిక ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో యు శేషుబాబు వెంటనే సిబ్బందిని పంపించి ఈ పోస్టర్లను తొలగింప చేసినట్టు చెప్పారు.

5వ రోజు 5 నామినేషన్లు

కావలి, ఏప్రిల్ 22: కావలి అసెంబ్లీకి 5వ రోజైన సోమవారం ఐదుగురు తమ నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందచేశారు. ప్రధాన పార్టీలకు తానే పోటీ అని ప్రచారం చేస్తున్న పసుపులేటి సుధాకర్, ఆయన సతీమణి పసుపులేటి సుగుణ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ముప్పసాని నరేంద్ర తమ నామినేషన్‌ను దాఖలు చేశారు. రాచూరు వెంకట సుబ్బారావు, అనుమలశెట్టి హరిప్రసాద్‌రావులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి గౌస్ మొహిద్దీన్ నామినేషన్ దాఖలు

కందుకూరు, ఏప్రిల్ 22: కందుకూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టరు విద్యాధరికి ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కూడా సోమవారం ఒక సెట్ నామినేషన్‌ను సబ్ కలెక్టరుకు అందజేశారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

● కావలిలో ఖాళీ అవుతున్న వైసీపీ ● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య


టీడీపీలో చేరిన 40వ వార్డు ముస్లిం మహిళలతో అభ్యర్థి కావ్య

కావలి, ఏప్రిల్ 22: కావలి నియోజకవర్గంలో పలువురు వైసీపీని వీడి సోమవారం కావలి పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బోగోలు మండలం బోగోలు బిట్-3 ఎంపీటీసీ వల్లాకి స్వరూప వైసీపీని వీడి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, బోగోలు ఎన్నికల పరిశీలకులు పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే తాళ్లూరు 7వ వార్డు వైసీపీ సభ్యుడు కొణిజేటి హజరత్తయ్య బోగోలు టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, బోగిరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు మండలం చింతగుంటకు చెందిన 10 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అల్లూరు టీడీపీ నేతలు మేడా క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డిలు పాల్గొన్నారు. అదేవిధంగా కావలి పట్టణం 40 వార్డుకు చెందిన వైసీపీ సీనియర్ నేత ముస్లిం మైనార్టీ మహిళా విభాగంకు చెందిన షేక్ హసీఫా పలువురు ముస్లీం మహిళలు, అబ్దుల్ అన్సర్, 10వ వార్డుకు చెందిన షేక్ అల్‌హర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరందరిని పార్టీలోకి ఆహ్వానించిన అభ్యర్థి క్రిష్ణారెడ్డి ముస్లింల పట్ల టీడీపీ చూపుతున్న ఆదరణ చూసి టీడీపీలో చేరారన్నారు.

పాతబిట్రగుంటలో టీడీపీ ప్రచారం

బిట్రగుంట, ఏప్రిల్ 22: బోగోలు మండలం పాతబిట్రగుంట పంచాయతీలో తెలుగు తమ్ముళ్లు ఆర్.విజయ్‌కుమార్ యాదవ్, బసిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే చిలకపాటి వెంకటేశ్వర్లు, బోగిరి ప్రభాకర్, బొద్దులూరి ప్రభాకర్‌లు అరవపాలెం, అక్కరాజు కండ్రికలో ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడును సీఎం చేయడమే ప్రధాన లక్ష్యమంటూ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు.


టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ స్వరూప్‌కు పార్టీ కండువా కప్పుతున్న కావ్య


వైసీపీ నాయకులు బలవంతంగా కండువాలు వేశారు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 : వలేటివారిపాలెంలోని వడ్డెపాలెంలో స్థానిక వైసీపీ నాయకులు బలవంతంగా ఆపార్టీ కండువాలు వేశారని కాలనీ వాసులు చల్లా హనుమంతరావు, బత్తుల సుబ్బారావు, కందనూల వెంకటేశ్వర్లు తదితరులు వాపోయారు. వడ్డెపాలెం రామాలయం వద్ద కూర్చొని ఉన్న మా వద్దకు వైసీపీ నాయకులు వచ్చి హడావుడిగా బలవంతంగా మా మెడలో కండువాలు వేసి ఫొటోలు తీశారని తెలిపారు. మాతో పాటు అక్కడ ఉన్న 10 మంది మహిళల మెడలో కూడా కండువాలు వేసినట్లు తెలిపారు. ఇదేంటని ప్రశ్నించగా రెండు నిమిషాలు మౌనంగా ఉండండి, మాకు పరువు పోతుందని ప్రాధేయపడినట్లు తెలిపారు. మేము ఎప్పటికీ టీడీపీని వీడే ప్రసక్తే లేదని తెలిపారు. పార్టీ మారినట్లు ప్రచారం చేసుకోవడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జన కేతనం



ప్యాకేజీల కోసం పాకులాట !



ఓ వైపు ఎండలు దంచేస్తుంటే.. మరోవైపు ఉదయగిరి రాజకీయం అంతకన్నా హీటెక్కి స్తోంది. అందుకు ప్రధాన కారణం టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఇద్దరూ తొలిసారిగా బరిలో నిలవడమే. ఉదయగిరి పెద్దనియోజకవర్గం కావడంతో అభ్యర్థులకు ఆయా మండలాలపై పూర్తిస్థాయిలో పట్టు లేదు. అంతేకాక ద్వితీయ శ్రేణి నాయకుల తీరుతెన్నులపై కూడా అవ గాహన లేదు. దీంతో ప్రతినిత్యం అభ్యర్థుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమదైన శైలిలో గ్రామ, మండల నేతలు గొప్పలు చెప్పుకుంటున్నరు. ఓటర్లను ప్రభావితం చేసే సత్తా లేనివారు కూడా నాయకులుగా చెలామణీ అవుతూ ప్యాకేజీల కోసం పాకులాడు తున్నారు. బరిలో నిలిచిన వారు ఆర్థికంగా బలమైనవారు కావడంతో గెలుపు కోసం ఒక్కొక్కరు రూ. 100 కోట్లకుపైగా ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం ఆశావాదులకు కలిసొచ్చింది. నాలుగేళ్ల కుపైగా ఎక్కడా కనిపించని కొంతమంది నాయకులు ప్రస్తుతం అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏ గ్రామంలో ఎవరికి ప్రాధాన్యత కల్పించాలో, ఎంతమేర ఖర్చు పెడితే ఎన్ని ఓట్లు పడవచ్చనే తాపత్ర యం అభ్యర్థులను వెంటాడుతుంది. ఈ నేప థ్యంలో ఓట్ల కోసం అభ్యర్థులు, ప్యాకేజీల కోసం నా యకులు ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటూ ముందుకు సాగు తున్నారు.ఈ తరుణంలో ఓటర్లు మాత్రం ఎటువైపు మొగ్గు చూపాలో తెలియక అయోమయంలో ఉన్నారు.

- వరికుంటపాడు

బూత్‌లో 1400 ఓట్లే ఎందుకు ?

ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లే ఉండేలా అధికారులు ఏర్పాటు చేస్తారు. ఇలా ఎందు కు చేస్తారో తెలుసా..? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు ఒకదాని కొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎంలకు అనుసంధా నంగా ఉండే వీవీ ప్యాడ్‌లో కాగితాన్ని పొందుపరు స్తారు. ఇది 1450 స్లిప్పుల ను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాడ్ లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కూడా కనిపి స్తుంది. అందులో 50 వరకు కాగితం స్లిప్పులు ఓటింగ్ రోజు మాక్ పోలింగ్‌కు వాడతారు. అందుకే ప్రతి పోలింగ్‌బూత్‌లో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- ఉదయగిరి


తెలుసుకుందాం



'బీపీఎస్'కు మంగళం

- నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు
- 2008-09లో పథకం ప్రారంభం
- ఐదేళ్లుగా అమలుకాని వైనం





సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్రనష్టం కలిగించారు. ఎంతో ఆర్భాటంగా 2008-09 విద్యాసంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీపీఎస్) పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఎంతోమంది పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చదువుకునేవారు. ప్రతి సంవత్సరం 1వ తరగతిలో వంద మందిని ఎం పిక చేసేవారు. వారు అందుబాటులో ఉన్న పాఠశా లలో డేస్కాలర్‌గా చదువుకునేవారు. అలాగే 5వ తరగతిలో రెసిడెన్షియల్ పద్ధతిలో 200మందికి అవకాశం కల్పించేవారు. దీంతో నిరుపేదలైన తల్లిదండ్రులు ఎంతో ఊరట చెందేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేదవారు కష్టాలు పడుతున్నారు. నాడు-నేడులో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు తరగతి గదుల నిర్మాణమే ముఖ్యం కాదు... విద్యార్థుల బాగోగులను కూడా ప్రభుత్వం పట్టించుకోవాలి.

- నెల్లూరు (వీఆర్సీ)

నా ఓటు... నీకేనన్నా !

- ఎవరు పిలిచినా వెంట వెళుతున్న ఓటర్లు



ఎన్నికలవేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏపార్టీ నేత పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి తరలివెళ్తున్నారు. ఈ విషయంపై ప్రతిపక్ష నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచారు... వెళ్లాం.. కానీ ఓటు మాత్రం మీ పార్టీకేనని చెబుతున్నారు. దీంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బం ది ఉండకూడ దన్న ఉద్దేశంతోనే కొందమంది అలా ప్రవర్తిస్తు న్నారు. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో అర్ధరాత్రి వరకు ప్రచారాలు చేస్తున్నారు. అభ్య ర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు ముందురోజే ఇంటింటికెళ్లి తమ నాయకుడి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం.. అంత వరకు ఏ పార్టీ నాయకులు పిలిచినా వెళ్తాం.. అంటూ మరికొందరు తెగేసి చెబుతున్నారు.

- ఉదయగిరి

అభిమానంతో ఓటు వేసే వాళ్లం



నా వయసు 80 ఏళ్లు. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో ఎప్పుడూ ఇలాంటి ప్రచార ఆర్భాటాలు లేవు. ప్రలోభాలు కూడా లేవు. ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఊరికి ఓ లారీ పంపేవారు. ఆ లారీ ఎక్కి ఓటు వేసేందుకు వెళ్లే వాళ్లం. ఇప్పుడేమో కార్లు పెట్టి మరీ తీసుకెళుతున్నారు. గ్రామానికి ఓ నాయకుడు వస్తే బారులుగా నిల్చొని చూసేవాళ్లం. కానీ ఇప్పుడు డబ్బులు పెట్టి మరీ బలవంతంగా తీసుకెళ్తున్నారు. మా రోజుల్లో అభిమానంతో ఓట్లు వేసేవాళ్లం. ఇప్పుడే ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే ఓటు వేస్తున్నారు.

- కవరగిరి ఇస్తేరమ్మ, అల్లూరు

మా రోజుల్లో

చల్ చల్ గుర్రం!

ఓటర్లను ఆకట్టుకోవడం కోసం అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు టిఫిన్ అంగళ్లలో బోండాలు వేస్తే మరికొందరు టీ వేస్తున్నారు. ఇంకొందరు చంటిబిడ్డలను ఎత్తుకుని ముద్దాడడం, వృద్ధులతో మాటామంతీ కలపడం వంటివి చేస్తున్నారు. ఇంకా ప్రజల్లో మరింత ఆకర్షితులు అయ్యేందుకు ప్రచారాలలో గుర్రాలపై ఎక్కి కూడా స్వారీ చేస్తున్నారు. కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉలవపాడులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గుర్రంపై స్వారీ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అలాగే కావలిలో స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ గుర్రంపై స్వారీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.



ఉలవపాడు : గుర్రంపై అభివాదం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు



కావలిలో గుర్రంపై సుధాకర్

- ఉలవపాడు/కావలిటౌన్


ఓటు వేయకుంటే...?

పౌరుడి అస్థిత్వానికి ప్రతీక ఓటు. ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి దానికుంది. ఓ వ్యవస్థకు ప్రజాప్రతినిధి ఎంత అవసరమో, ఆ ప్రజాప్రతినిధిని ఎన్నుకోనేందుకు ఓటు అంతే అవసరం. కానీ చాలామంది ఓటును రాజకీయ తంతుగా భావిస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఓటు వేసి తీరాలి.

- **ఓటు వినియోగించుకోకుంటే..**

ఎవరైనా ఓటు హక్కు వినియోగించుకోకపోతే వారు జనాభా లెక్కల్లో లేనట్లే. ఇది అందరికీ తెలిసినా, విద్యావంతులు, ధనవంతులు ఓటు హక్కు వినియోగించు కోవడంలేదు.ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. ప్రజాస్వామ్య సంస్కారం అంటే ఎక్కడి నుంచో వచ్చింది కాదు. మనలో నుంచే వచ్చిందని గాంధీజీ అన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే పౌరులంతా తమ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కూడా ఆయన తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



జూలైలో పింఛన్ ఏడువేలంట్రా..!?



ఒరేయ్ సుబ్బులు... జూలైలో పింఛను ఏడువేలంట్రా... రేయ్ రామన్నా.. ఏడువేలేంటి... నాలుగువేలే కదా సెందర బాబు, జగను సెప్పింది. ఏడువేలు కాదన్నా... ఓరి నీ పాసుగాల నీ తెల్దంట్రా సుబ్బులు... నువ్వు టీవీ చూడట్లా.. సూసానే నాలుగువలేనన్నారు రామన్న... రే కాదురా నాయనా సెందరబాబు సెప్పిందేంటంటే... ఇప్పుడు ఏప్రిల్ నుంచి మే, జూన్ నెలలకు కూడా వెయ్యెయ్యి కలిపి ముఖ్యమంత్రి కాగానే మరుసటి నెల జూలైలో పెంచిన నాలుగువేలకు ఈ మూడునెలల వెయ్యెయ్యి కలిపి ఏడువేలిస్తానని సెప్పిండ్రా నాయనా... ఓ అట్టాగా అయితే సెందరబాబు సీఎం అయితే మనకి జూలైలో ఏడువేలు వస్తది కదా..? ఆ తరువాత ఆగస్టు నుంచి ఎట్టోస్తయి రామన్నా... ఆగష్టు నుంచి నాలుగువేలే.. ఓ అట్నా పెంచిన యెయ్యి ఈ నెల నుంచే అన్నమాట... అయితే ఈ ఇసయం మా ముసిల్దానికి సెప్తా రామన్నా... అంతే కాదురో ఇకలాంగులు ఉళ్లా వారికి అప్పుడు సెందరబాబు మూడేలు సెయ్యలా ? అదే మూడేలే జగన్ ఇస్తావచ్చిండు కదా ? ఆళ్లకి సెందర బాబు ఆరేలు సేస్తానన్నాడ్రా సుబ్బలు... అబ్బో ఆరేలే అంటే రోజుకు రెండొందలు. అయితే మన రంగన్నకి జూలై నుంచి ఆరేలు వస్తాయన్నమాట... పాపం ఇసయం రంగన్నకు సెప్పాల రామన్నా... రోజు నాతోటి ఏందిరా సుబ్బులు మీకు జగను రెండేలు నుంచి రెండొందలయాభై యేటేటా పెంచి మూడేలు సేసినాడుకానీ ఇకలాంగులమైన మాకు సిల్లిగవ్వ పెంచలేదురా ఉప్పుపొప్పు ధరలు పెరిగి ఫించను డబ్బులు దేనికీ సరిపోల్లేదురా అని సెప్పి రోజు బాధపడుతుంటాడు రంగన్నా.. అయితే వాడికి సెప్పరా... సెప్తానన్నా.. సోమవారం జలదంకి రచ్చబండ వద్ద వృద్ధులు సుబ్బయ్య, రామయ్యల మధ్య ఆసక్తిగా జరిగిన సంభాషణ ఇది.

- జలదంకి

'బాస్' లేకుండా ప్చ్....!

- సింహపురి పొలిటికల్ సెలబ్రిటీ ఆనం వివేకా
- నవ్విస్తూ... కవ్విస్తూ ఎన్నికల ప్రచారం
- ఆయన జ్ఞాపకాలు మననం చేసుకుంటున్న అభిమానులు

కొంతమంది ఏ దుస్తులు ధరించినా అందంగానే కనిపిస్తారు. ఇంకొందరు ఏ పనిచేసినా రాణిస్తారు. మరికొందరు ఏ అవతారం ఎత్తినా జనం హర్షిస్తారు. ఈఅన్ని కోణాల్లోనూ అందంగా, హుందాగా, హీరోగా, కమెడియన్‌గా కనిపించే అరుదైన నాయకుడు దివంగత నేత ఆనం వివేకానందరెడ్డి. ఈ పేరు చదవగానే, వినగానే ఆయన హావభావాలు గుర్తుకొచ్చి ప్రజల పెదవులపై చిరునవ్వు మెరుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వివేకా ఓ పొలిటికల్ సెలబ్రిటీ. ఆయనన్నా, ఆయన చేసే విన్యాసాలన్నా చాలా మంది ప్రజలకు ఇష్టం. నెల్లూరు గల్లీలో అయినా అసెంబ్లీ హాలులో అయినా ఆయన తీరు ప్రత్యేకం. కిర్రు చెప్పులేసుకొని ఆయన అసెంబ్లీ హాలులో సందడి చేస్తుంటే ముఖ్య మంత్రులు, ప్రతిపక్ష నాయకులు అందరూ అలా నిలబడి చూడాల్సిందే. అభినం దనపూర్వకంగా చిరునవ్వు చిందించాల్సిందే. ఆయన వేషం, హావభావాలు, శరీర సౌష్టవం, మాటల్లో చిలిపితనం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తాయి. ఎంత మూడీగా ఉన్నా నవ్వు పుట్టిస్తాయి. అందుకే నెల్లూరు ప్రజలకు ఆయనంటే అంత ఇష్టం. నెల్లూరోళ్లకే కాదు రాష్ట్ర వ్యాప్తంగా చాలా మందికి ఆయనంటే ఇష్టం. ఆయన టీవీ తెరపై కనిపిస్తే చాలు అలా నిలబడిపోతారు. ఆయన బొమ్మ తెరమరుగైపోయే వరకు అలాగే నిలబడి చూ స్తారు. ఆనం వివేకానందరెడ్డి ఏమి చేస్తాడో, ఏమి మాట్లాడు తాడో వినాలని, చూడాలనే ఆసక్తి ఒకసారి ఆయన్ను చూసిన ఎవరికైనా కలగకమానదు. దానికి కారణం ఆయన హావభావాలు.



ఎన్నికలంటే ఖాకీ దుస్తులు ఉండాల్సిందే!

నెల్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):వేకువజామునే నిద్ర లేస్తారు. నెల్లూరులోని గల్లీగల్లీలో పర్యటిస్తాడు. టీ దుకాణం కనిపిస్తే అక్కడున్న వారితో కలిసి టీ తాగుతాడు. మాటామాటా కలిపి సమస్యలు తెలుసుకుంటాడు. రోడ్డు పక్కనున్న సెలూన్‌లోకి దూరిపోతాడు. కత్తెర, కత్తి చేతబట్టి నాకు చేతరాదా..! అంటూ సరదగా నవ్వుతాడు. పక్కనున్నవారిని నవ్విస్తాడు. బోండాలు వేసే అవ్వ దగ్గర కూర్చుం టాడు. పక్కకు జరుగవ్వా... అంటూ తను బోండాలు వేస్తాడు. నీ కష్టం ఏమో చెప్పవ్వా అంటాడు. ఆ కష్టాన్ని తీర్చడానికి ప్రయత్నిస్తాడు. రిక్షావాలా దగ్గరకు వెళతాడు. ఒక బీడీ ఇవ్వన్నా అని అడిగి తీసుకొని దమ్ములాగుతూ ఫోటోలకు ఫోజులిస్తాడు. కుమ్మరి వీధిలోకి వెళతాడు కుండలు చేస్తానంటాడు. చాకలి వీధికి వెళతాడు, బట్టలు తికినట్లు పోజులిస్తాడు. ప్రతిపక్ష నాయకుడినైనా, ప్రత్యర్థినైనా తన వ్యంగ్య వ్యాఖ్యలతో ఉతికి ఆరేస్తాడు. పత్రికా ఫొటో గ్రాఫర్లకు, కెమెరాలకు ఆయనొక పండుగ. సాధారణ సమయాల్లోనే ఇలా కనిపించే వివేక ఇక ఎన్నికల సమ యంలో ఎలా కనిపిస్తాడు. జనాలను ఎలా రంజింపజేస్తాడు..!! ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన ప్రత్యేకమే. సాధారణ సమయాల్లో ఎన్ని రకాల దుస్తులు వేసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం ఖాకీ దుస్తులనే ధరిస్తారు. ఇదేమిటన్నా అని ఎవరైనా ప్రశ్నిస్తే ఖాకీ కార్మిక చిహ్నంరా చిన్నా అంటాడు. వీధికో అవతారం ఎత్తుతాడు, గంటకో విన్యాసం చేస్తాడు. ఒక వీధిలో కనిపించినట్లు మరో వీధిలో కనిపించడు. వేసిన కూలింగ్ గ్లాసులు మరో సారి వేయడు. ఒక రోజు వాడిన చెప్పులు ఇంకోసారి వాడడు. ఒకసారి చేసిన విన్యాసం మరోసారి చేయడు. ఆయన వేష ధారణ, మాటలు, చేతలు అన్ని ఎప్పటికప్పుడు ప్రత్యేకం. అంతే కాదు ఆయన రాజకీయ ఎత్తుగడలు అంతకన్నా ప్రత్యేకం. అందుకే పత్రికా ఫొటోగ్రాఫర్లు నిమిషం వదలక ఆయన వెంట పడుతుంటారు. ఆయన ఏ రూపంలో కనిపించినా నెల్లూరు ప్రజలు ఇష్టపడతారు. అందరికి అంతగా ఇష్టపడే వివేకానందరెడ్డి ఈ ఎన్నికల ప్రచారంలో లేరు. ఇక ఏ ఎన్నికల ప్రచారం లో కూడా కనిపించరు. కాని నెల్లూరు నగరంలోని వీధివీధి ఆయన జ్ఞాపకాలను తరచూ నెమరు వేసుకొంటూ నే ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో ఎక్కడైనా వివేకా కనిపిస్తాడా...!!! అని ప్రతి మది వెదుకుతూనే ఉంటుంది. నెల్లూరు నగరంపై వివేక ముద్ర అలాంటిది మరి.



రాజకీయ పదును ఈయనకే సాధ్యం



తారు లేచిపోయి గ్రావెల్ బయట పడిన పల్లిపాళెం రహదారి (జగన్ నడిచిన దారి)



పల్లిపాళెం రహదారిలో కల్వర్ట్ కుంగడంతో ఏర్పాటు చేసిన రింగ్‌బండ్



గుంతలమయమైన పల్లిపాళెం రహదారిలో వెళ్లలేక ఇసుకతో గుంతలు పూడ్చిన రైతులు

జగనన్నా.. ఈ దారిని మరిచితివా!?

బాగుపడని పల్లెపాలెం రహదారి

ప్రతిపక్ష నాయకుడిగా జగన్ చేపట్టిన పాదయాత్ర సంగం మండలంలో 20 కి.మీ దూరం సాగింది. జిల్లా పర్యటలో భాగంగా 2018 ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో ఆయన సంగం మండలంలో పాదయాత్ర చేశారు. బుచ్చి దాటి దువ్వూరు వద్ద సంగం మండలంలోకి ప్రవేశించారు. దువ్వూరు వద్ద ఉన్న ఓ లేఅవుట్‌లో 5వ తేదీ రాత్రి బస చేసి 6న ఉదయం బయలు దేరారు. అప్పటికే సంగం - ముంబయి రహదారి మూడు వరుసల సిమెంట్ రోడ్డుగా మారింది. దీంతో గాంధీ జనసంఘం వరకు 8 కి.మీ నడిచి, అక్కడి నుంచి పల్లిపాళెం రహదారి మీదుగా సంగం వచ్చేందుకు రూట్ మ్యాప్ మార్చారు. అప్పటికే ఆ రహదారి వేసి ఏడేళ్లు గడిచిపోవడంతో గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై నడిచి సంగం చేరిన జగన్ బహిరంగ సభలో మాట్లాడుతూ 'పల్లెపాలెం రహదారి దుస్థితిని కళ్లారా చూశా. గుంతల రహదారిలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబితే విన్నాను. రేపు మనం దరి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి బాగుచేస్తా"నని హామీ ఇచ్చారు. జగన్ మాటలు నమ్మి 2019 ఎన్ని కల్లో ఆయన్ను గెలిపించారు. సీఎం అయ్యారు. కానీ పాదయాత్రలో ఇచ్చిన హామీని మాత్రం మరిచారు. ఆయన నడియాడిన రహదారికి సైతం ఈ ఐదేళ్ల కాలంలో తట్ట మట్టి వేసిన పాపాన పోలేదు. 2022 సెప్టెంబరులో సంగం బ్యారేజీ ప్రారంభానికి వచ్చిన సమ యంలో కలిగిర రహదారిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సీఎం రాకపోకలకు సౌకర్యంగా ఆగమేఘాల మీద కొరిమెర్ల వరకు ఐదుకిలోమీటర్ల రహదారి వేశా రు. అక్కడి నుంచి మిగిలిన రహదారికి ఇప్పటికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో అది మరింత గుంతలమయంగా తయారైంది. ఈ గుంతల రహదారిలో ప్రజలు ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. 'నేను నడిచాను... నేను చూశాను... నేను రహదారులను బాగు చేస్తాను'.. అని గొప్పలు చెప్పిన జగన్ మాటలు మాయమాటలేనని మండల వాసులు విమర్శిస్తున్నారు.

- సంగం